# గాలి వీచిన రోజు

బ్రతికిచెడ్డ పెద్దమనిషి మార్వాడీ కొట్టు దగ్గరకి మరో అప్పు కోసం వెళ్లడానికి భయపడ్తోన్నట్లుగా, ఉప్పబడిపోయిన కోటిపల్లి గోదావరి సముద్రంలో కలవడానికి ప్రవహిస్తోంది.

నిరంతరమూ తన చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలలోని జీవరాశులకి, వెలుగుతో జీవనాధారాన్నీ, చీకటితో విశ్రాంతినీ ఇచ్చే సూర్యుడి అగ్నిగోళం, గోదావరి సముద్రంలో కలిసేచోటు నుంచి నెమ్మదిగా పైకి లేచింది. తెలుగునాడు వెలుగుతో నిండింది. ఆ వెలుగుని ధ్వంసం చెయ్యడానికి జనం నిద్ర నుండి లేచింది.

సూర్యోదయానికి చేయూత నిచ్చిన కోడిపుంజు, ఆ రోజున తనకి నూకలు చెల్లిపోతాయేమో నన్న భయంతోనూ, మరో సూర్యోదయానికి ఆహ్వానాన్నిచ్చే ఆశతోనూ తిరుగాడసాగింది.

• • •

పరబ్రహ్మం తండ్రి దేవతార్చన చేస్తున్నాడు. అయినా దృష్టి దేవుడి మీద లేదు. గుమ్మం గడప మీద కూర్చుని, తల్లితో మాట్లాడుతోన్న కొడుకు పరబ్రహ్మం మీద వుంది.

కుంపటి మీద కాఫీనీళ్ళు పెట్టి విసురుతున్న శకుంతల, అత్తగారు తన మొగుడితో అంటున్న మాటలు వింటోంది.

"నిన్న రాత్రి ఆలస్యంగా వచ్చావనుకుంటాను. ఆ సంబంధం వాళ్లేమన్నారు?" అని తల్లి, కొడుకు పరబ్రహ్మాన్ని ప్రశ్నించింది.

వాయిస్తున్న చిన్నగంటనాపి, ముసలాయన పక్కనే వున్న రాగిపళ్ళెంలోకి జర్రున చీది, కొడుకు సమాధానం కోసం ఎదురు చూడసాగాడు. చేస్తున్న పూజనాపినందుకు గూట్లోని దేవుళ్ళందరూ తమ కోపాన్నీ పరబ్రహ్మం నోటి ద్వారా వెళ్ల గ్రక్కారు.

"పిచ్చి కుదిరింది తలకి చుట్టమన్నట్లుగా, పిల్ల నచ్చింది. ఎనభై వేలు ముట్టచెప్పండి అన్నారు!"

"నా మనవరాలికేం తక్కువొచ్చిందని? దీపంలాంటి పిల్లకి ఎనభై వేలా? వాళ్ళాశ మండిపోనూ!" అంది ముసలావిడ బుగ్గలు నొక్కుకుంటూ.

"మరి ఆనాడు నా అందానికేం తక్కువ వొచ్చినట్లు...?" శకుంతల గుడ్డతో నీళ్ళగిన్నె కిందకి దింపుతూ అంది.

అంటూ ముగ్గురికేసి చూసింది. తన మాటల్లోని వ్యంగ్యం అత్తమామల్నీ, మొగుణ్ణీ సూటిగా తాకిందని గ్రహించింది. ఏళ్ళ తరబడి గుండెల్లో దాచుకున్న మంటల్నీ ఆ ఒక్క వాక్యంలోనూ చెలరేగేటట్లు చూసింది. వాళ్ళ వెలవెలబోయిన ముఖాల్ని చూసి, ఆ రోజున ముగ్గుర్నీ కడిగి ముగ్గులు పెట్టడానికి నిశ్చయించుకుంది శకుంతల.

కాస్సేపు మౌనం వహించిన పరబ్రహ్మం నెమ్మదిగా అన్నాడు. – "పిల్ల అందంగా వుంది కనక ఎనభై వేలట! అవతల రాజోలు డాక్టరుగారెవరో లక్ష రూపాయలిచ్చి, మూడుముళ్లూ పడ్డతర్వాత, కూతుర్నీ అల్లుణ్ణీ అమెరికా పంపిస్తానంటున్నాడట! అబ్బాయికీ అమ్మాయికీ చెల్లు! ఆ కుర్రవాడి మెడిసిన్ డిగ్రీకి ఎవరెక్కువిస్తే వాళ్లు!"

"ఈ సంబంధమే ఖాయం చెయ్యండి, పిల్ల సుఖపడుతుంది" శకుంతల కాఫీ పొడుం నీళ్ళలో కలుపుతూ దృఢంగా అంది.

"అంత డబ్బు ఎలా సర్దుబాటవుతుందని? ఎంత డాక్టరవుతే మటుకు అంత కట్నమా!? నీ కొడుకుల చదువు సంగతి కూడా ఆలోచించు" అత్తగారు అగరొత్తులు వెలిగిస్తున్న మొగుడికేసి చూస్తూ, కోడల్ని ఉద్దేశించి అంది.

తల్లి అనరాని మాటందని పరబ్రహ్మం గ్రహించాడు. బెరుగ్గా శకుంతల కేసి చూశాడు. మొగుడిబ్బందిని చూసి శకుంతల జాలిపడదలచుకోలేదు.

"ఇదే మరో కులంలో అయితే లక్ష మీద కాదు, లక్షల మీద రేటు! బ్రహ్మణ లంపటాలు కాబట్టి ఎనభై వేలంటే చౌకే! అయినా పాతిక సంవత్సరాల క్రితమే బోడి ఎమ్.ఎ. పదిహేనువేలు చెయ్యగాలేంది, ఈ కాలంలో డాక్టరు చదువు చదివినవాడికి ఎనభై వేలేం ఎక్కువనీ!? నా కొడుకులు సన్యాసులైనా ఫర్వాలేదుకాని, ఈ సంబంధం నిశ్చయించవల్సిందే"- శకుంతల మొండిగా అంది, కాఫీ డికాక్షన్ గుడ్డలో వడగట్టుతూ.

పరబ్రహ్మం మాట్లాడలేదు. ముసలావిడకి నోరు నొక్కుకుపోయింది. ముసలాయన ధైర్యం కూడదీసుకుని అన్నాడు - "మన స్థితిగతులు ఆలోచించుకోవాలమ్మా. వాడికి రెక్కలే ఆధారం. ఏదో తాతలనాటి నుంచీ వున్న ఈ కొంపా, ఓ రెండెకరాల చవుడు భూమీ తప్ప ఇంకేముందని? నా ఉదేశ్యంలో ఈ సంబంధం కాక, ఆ పాలగుమ్మి ఊరి సంబంధమే బావుంటుంది. కుర్రాడు కాకినాడ జిల్లా ఆఫీసులో పనిచేస్తున్నాడు, చక్కగా మన కందుబాటులో వుంటాడు!"

"కాలేజీ ప్రిన్సిపాల్‌గారి అల్లుడు జిల్లా ఆఫీసులో గుమాస్తా అంటే మీకు నామర్దాగా లేదూ! ప్రతినిత్యమూ వంశప్రతిష్ఠలకు విలువ కట్టే మీరీ తక్కువ సంబంధానికెలా సిద్ధపడుతున్నారో నాకు తెలియదు కానీ, ప్రిన్సిపాల్‌గారి పెళ్లాం హోదాలో నేను పాలగుమ్మి సంబంధాన్ని ఛస్తే ఒప్పుకోను! ఇంక ఇల్లూ, భూమీ అంటారూ - మీ కివ్వవలసిన కట్నం కోసం మా నాన్న కూడా వున్న రెండెకరాల భూమినీ అమ్మి డబ్బు తీసుకువస్తుంటే, దారిలో దొంగలు దోచుకుపోయారు. పెద్దమనుషులు కలుగజేసుకోవడంతో పెళ్లి పీటల మీద మీ కొడుకు నా మెళ్ళో తాళి కట్టినా, ఉన్న కొంపని కాస్తా అమ్మి ఆ డబ్బు నిచ్చేవరకూ మీరు నన్ను కాపురానికి రానివ్వలేదు. కట్నం లేకుండా కోడలు పిల్ల మీ గడపలో కాలు పెట్టడం మీ వంశప్రతిష్టకి భంగం మరి! ఫస్టు మార్కులతో పాసైన నా తమ్ముడు ఇంజనీరింగ్‌లో సీటొచ్చినా నీళ్ళొదులుకుని గుమాస్తా జీవితంలో స్థిరపడ్డాడు. నా చెల్లెల్ని రెండో పెళ్లివాడికిచ్చి కట్టబెట్టారు మా వాళ్ళు. అయినా మీ దృష్టిలో ఆడపిల్లలెలా తగలడినా ఫర్వాలేదుకాని, వంశాంకురాలు కాబట్టి కుర్రాళ్ళకి మట్టుకు నష్టం కలగకూడదు!" - శకుంతల పాలు కాఫీ డికాక్షన్‌లో కలయబెడ్తూ అంది.

"పాతవన్నీ తవ్వడమెందుకు? అయినా కుర్రాళ్ల భవిష్యత్ కూడా కాస్త చూడాలిగా?" పరబ్రహ్మం కాస్త కోపంగానే అన్నాడు.

"మిమ్మల్ని కట్టుకుని నేను సుఖపడుతున్నానని, నా తమ్ముడు మనసా ఆనందిస్తున్నాడు. నా కొడుకులు నా తమ్ముడికి మేనల్లుళ్ళు. రాధకి ఈ సంబంధం కుదిరిస్తే వాళ్లు కాదనరు. ఇంక మీ నెత్తి మీద కొంపంటారూ- దానితో నాకు ప్రమేయం లేదు. ఈ లోకంలో వున్నవాళ్ళందరికీ స్వంత ఇళ్ళంటూ లేవు!" - శకుంతల కాఫీలో పంచదార కలుపుతూ అంది.

"ఉద్రేకంలో మాట్లాడుతున్నావుకానీ, వాస్తవాన్ని నిదానంగా ఆలోచించు" - పరబ్రహ్మం అనునయంగా అన్నాడు.

"ఈ సంబంధం కాక మరే సంబంధాన్ని కుదిర్చినా, పెళ్లి ముహూర్తానికి నూతిలో పడి ఛస్తాను!" - శకుంతల మూడు గ్లాసుల్లో కాఫీ పోస్తూ అంది.

"ఏమిటమ్మా, మరీ అంత ఘోరంగా....."

అత్తగారి మాటల్ని మధ్యలో ఆపుచేసింది శకుంతల – "మీ అచ్చట్లూ ముచ్చట్లూ మీ సంతానం ద్వారా తీర్చుకున్నారు. ఇది నా సంతానానికి సంబంధించిన సమస్య. నాకూ మీ కొడుక్కీ సంబంధించిన సమస్య. మీరు మధ్యలో కలుగజేసుకోవద్దు" అంది కటువుగా.

ముసలివాళ్ళిద్దరూ అవాక్కయిపోయారు. 'తాము చేసిన తప్పుల్ని చూపించింది మౌనంగా పాతిక సంవత్సరాలు కాపురం చేసిన శకుంతలేనా?!' అని విస్తుపోయారు.

శకుంతల విసురుగా లేచి ముగ్గురి ముందూ మూడు కాఫీ గ్లాసులూ వుంచింది. శకుంతల మాటలతో మొహాలు, మనసులూ వాచిపోయిన వాళ్ల ముగ్గురికీ మరి కాఫీ తాగడానికి మనస్కరించలేదు.

పరబ్రహ్మం తండ్రి పీట మీద నుంచి లేచి పెరట్లోకి పోయాడు. తల్లి సణుక్కుంటూ వంటింట్లోకి దారితీసింది. నీరసంగా లేచి తల పట్టుకుని, హాల్లోకి వెళ్ళబోతున్న పరబ్రహ్మం చేతిలో బలవంతంగా కాఫీ గ్లాసు పెట్టింది శకుంతల.

పక్కగదిలో కూర్చుని తన విషయమై నలుగురి మధ్యా జరిగిన వాగ్యుద్ధాన్ని విన్న రాధ తను నెల తప్పిన విషయం తల్లికెలా చెప్పాలా అని తల పట్టుకుని కూర్చుంది!

• • •

మనసులో పేరుకున్న సహనం అగ్నిపర్వతంలా ఒక్కసారిగా బ్రద్దలై, మౌనాన్ని విడిచి, విరుచుకుపడింది పార్వతి. నిశిరాత్రి నిశ్శబ్దంలో అశనిపాతంలా అరిచింది.

"ఛీ! ఛీ! ఎందుకొచ్చిన బ్రతుకు? ఎందులోనైనా పడి ఛస్తే మంచిది!"

"ఆ చేసేదేదో త్వరగా చేస్తే నీకూ నాకూ శాంతి లభిస్తుంది" – శేషగిరి హేళనగా అన్నాడు, కాఫీ గ్లాసు బల్ల మీద పెడ్తూ.

"అంటోన్నది నా గురించి కాదు, మీ గురించి! ఇలాంటి కక్కుర్తి బ్రతుకు బ్రతకడం కంటే ఎందులోనైనా పడి చావమంటున్నాను!" పార్వతి ఈసడింపుగా అంది.

ఆస్ట్రేలియా ఆదిమవాసుల ఆయుధంలా, తను విసిరిన మాటలకు తిరిగివచ్చిన సమాధానం తనకే తగలడంతో, శేషగిరి ఒక్కసారిగా తెల్లబోయాడు.

అయితే అంతో ఇంతో మూతి మీద మీసమున్నవాడు కాబట్టి అహం దెబ్బతిని, "ఏవిఁటీ కూశావ్?" అంటూ ఆవేశంగా అరుస్తూ, విసురుగా చెయ్యెత్తాడు.

ఎత్తిన చెయ్యిని మధ్యలోనే పట్టుకొని, విసిరికొట్టింది పార్వతి.

"కొట్టడానికైనా అర్హతుండాలి! 'ఏదో చదువుకున్నవాడు – ఉద్యోగం చేసుకుంటున్నాడు – పిల్ల సుఖపడ్తుంది' అని నా కన్నవాళ్లు సన్యాసులై నాకు మీ తద్దినాన్నంటగట్టారు! నా కలల్ని కాల్చిపారేసుకుని, వాళ్ల ఆశలకి రూపాన్నిచ్చి మీచేత నామెళ్ళో గుదిబండ కట్టించుకున్నాను. ఉన్నదంతా నా పెళ్ళితోనే ఊడ్చుకుపోయిన నా వాళ్ళు, మీ కోర్కెలు ఇంకా ఎంత కాలమని తీరుస్తూ కూర్చుంటారు? సిగ్గులేని ముఖానికి వాచీ కావాలట! మీ తాతలు సంపాదించిందంత

వెనకపడివుంది. రెండు వేలకి పైగా వచ్చే ఉద్యోగం వెలగబెడ్తున్నారు. పెళ్ళయి రెండేళ్ళయింది. కూటికి గతిలేని అత్తవారి దగ్గర్నుంచి పండుగ బహుమానం కావాలట! ఇంతగా దిగజారిపోయిన మీకు చెయ్యెత్తడానికి అధికారముందేమో కానీ అర్హత మట్టుకు లేదు!" రుద్రకాళిలా అరిచింది పార్వతి.

అవమానంతో నిలువెల్లా కంపించిన శేషగిరి, బలవంతంగా అతికష్టంమీద మాటలు కూడదీసుకుని అన్నాడు – "నీ నోరు నీకే చెరుపు చేస్తుంది. నీ వాళ్ళెలా ఛస్తే నా కెందుకు? నా క్కావల్సింది వాచీ. వాచీ ఇవ్వందే నీతో కాపురం చేసేది లేదు!"

"నేనన్న మాటలకి మరొకాహరైతే ఎందులోనో పడి నిజంగా చచ్చేవారు. ఇంత జరిగినా వాచీ తెస్తే నాతో కాపురం చెయ్యడానికి సిద్ధంగా వున్నారు! అందుకే పౌరుషం లేని మనిషంటున్నాను!"

పార్వతి దెప్పిపొడుపు మాటలు విని, శేషగిరి ముఖం మరింత ఎర్రబడింది.

"తెగ పొగరుగా వుంది, వదిలిపారేస్తాను" కటువుగా అన్నా శేషగిరి. మాటల్లో బరువు లేదు.

పార్వతి తేలికగా సమాధానమిచ్చింది.

"కాని నేను వెళ్ళిపోడానికి సిద్ధంగా లేను! మిమ్మల్ని కట్టుకుని నా జీవితం కష్టాలపాయ్యింది. మిమ్మల్ని అల్లుణ్ణిగా తెచ్చుకుని మావాళ్ళు నాశనమయ్యారు. వాళ్ళ జీవితాలు బాగుపడేవరకూ మిమ్మల్ని వదిలివెళ్ళేది లేదు. అంతవరకూ మీ గుండెల మీద కూర్చుని కాపురం చేస్తాను"

శేషగిరి రక్తం కుతకుతా ఉడికిపోసాగింది. ఊహించని విధంగా ఎదురు తిరిగిన పార్వతిని అంచనా వెయ్యలేక ఉక్రోషంగా, "నేనూ చూస్తాను. రెండు మూడు రోజుల్లో నేనడిగింది రాకపోతే నువ్వూ చూద్దువుగాని, ఏం చేస్తానో?" అంటూ బయటకు వెళ్ళబోయాడు శేషగిరి.

పార్వతి గుమ్మాని కడ్డంగా నిలబడింది. ఆమె కళ్ళలోని ఎరుపు మరుగునపడింది. మనసులో భయం మాయమయింది. మొగుడి కేసి చూస్తూ నవ్వుతూ అంది – "సరే, మా నాన్నకి ఉత్తరం వ్రాయడానికి కవరు కొని పట్రండి. మీకు మరీ కంగారుగా వుందంటే, ఓ ఇరవై రూపాయిలిస్తే, నేనే వెళ్ళి ప్రయత్నిస్తాను. దారి ఖర్చులకుండాలి కదా మరి!"

శేషగిరికి పార్వతి తీరు అవగాహన కాలేదు.

"నువ్వేం చేస్తావో నాకు తెలియదు. నాక్కావల్సింది వాచీ. కాకి చేతే కబురంపుతావో, కాలినడకనే వెడ్తావో నాకనవసరం! ఛస్తే కానీ ఇవ్వను!" కసిగా అన్నాడు, పార్వతిని చూస్తూ. మనసులో పెళ్ళాం దారికి వస్తోందన్న భావన కొద్దిగా కలిగినా, బింకం వదుల్చుకోదలచుకోలేదు.

"స్టోర్ రూమ్ తాళాలియ్యండి, బియ్యం పప్పులు తియ్యాలి. లేకపోతే మధ్యాహ్నం భోజనం వుండదు"

"నేనింటికి రాను, కాలేజీ కాంటిన్ నుంచి తెప్పించుకు తింటాను" అన్నాడు శేషగిరి మరింత కసిగా.

"మరి నా ఆకలి మాట? నిన్న కూడా తిండి లేదు!" పార్వతి ప్రశ్నించింది.

"నీ పొగరుతో కడుపు నింపుకో!" శేషగిరి పార్వతిని పక్కకు తోసి బయటకు వెళ్ళిపోయాడు.

ఉప్పు, పప్పు, బియ్యాల దగ్గర్నుంచి మొగుడు అజమాయిషీలో కొలతల ప్రకారం తీసుకుని, వంట చేయవలసివస్తోన్న పార్వతికి బ్రతుకంటే రోతనిపించింది. ఎంత చదువుకున్నా సంస్కారరహితుడైన శేషగిరి నీచ మనస్తత్వం కాపురానికొచ్చిన వారం రోజుల్లోనే తెలిసిపోయింది. ఈ రెండేళ్ళు, దుర్భరమైన జీవితాన్ని ఎలా గడపగలిగిందో పార్వతికే తెలియదు.

గోద్రెజ్ బీరువా, సోఫాసెట్, పార్కర్ పెన్‌సెట్, ఆఖరికి బాటా బూట్ల వరకూ... ఎన్నని? పోరుపెట్టి, కాళ్ళ కింద నిప్పులు పోసి, పార్వతినీ, ఆమె తల్లిదండ్రుల్నీ బెదిరించి సాధించాడు. పెళ్ళితోనే నవనాడులూ క్రుంగిపోయిన పార్వతి తండ్రి కాకినాడ ఊరి బయట ఓ అతిచిన్న ఇంట్లోకి మారాడు. ఏదో వస్తున్న జీతంరాళ్ళతో అతికష్టంమీద కాలం గడుపుతున్నాడు. శేషగిరి కోర్కెలు తీర్చడంలో పార్వతి తల్లి మెడలోని మంగళసూత్రాలు సహితం కరిగిపోయినై.

అర్ధాకలితో అలమటించే ఇద్దరు తమ్ముళ్ళూ పార్వతి మనోపథంలో మొదిలారు. 'ఏది ఏమైనాసరే ఇతగాడి దురాశనంతం చెయ్యవలసిందే!' - పార్వతి కసిగా పళ్ళు కొరుక్కుంది. ఎటువంటి పరిస్థితుల్లోనూ తన తండ్రి తన మూలానింక కష్టపడకూడదు.

ప్రస్తుతం తను మొగుణ్ణి విడిచివెళ్తే, తండ్రి తప్ప మరో గత్యంతరం లేదు. ఆ భారం తండ్రి మొయ్యలేడు. ఏ నూతిలో పడో, ఉరేసుకొనో ప్రాణాలు తీసుకుంటే, భర్త మాట దేముడెరిగినా, తల్లిదండ్రులు మట్టుకు కడుపుకోతని భరించలేరు.

విడాకులు తీసుకున్నా, విషం తీసుకున్నా శేషగిరి నిశ్చింతగా మరో ఆడదాని జీవితాన్ని నాశనం చేస్తాడు. తన తండ్రిలాంటి నిర్భాగ్యులు పిల్లల్నివ్వడానికి దేశంలో చాలామందున్నారు. తన జీవితం ఎలాగు నరకమైంది. మొగుడు శేషగిరి మట్టుకెందుకు హాయిగా వుండాలి? తనింక అణిగిమణిగి వుండకూడదు.

'పొగరుతో కడుపు నింపుకోవాలట! పొగరెందుకు, వగరుతో కడుపు నింపుకొని చూపిస్తాను!' పార్వతి గది వరండాలోకి వెళ్ళి, పక్కింటి డాబా మీదున్న కాలేజీ కుర్రాడి అద్దెగది కేసి చూడసాగింది.

విలువలు లేని వెధవ మొగుడికి బుద్ధిచెప్పి, మనిషిగా సమాజంలో నిలదొక్కుకోవాలన్న దృఢనిశ్చయం పార్వతి మనసులో చోటుచేసుకుంది. అందుకు నైతికపతనాన్నే మెట్టుగా వాడుకోదల్చింది.

• • •

బల్ల మీద ఉప్మా ప్లేటు పెట్టి, మొగుడి కెదురుగా కూర్చుంది రాజేశ్వరి. తడారని ఒంటితో గళ్ళలుంగీ కట్టుకుని, భుజం మీద టర్కీ తువ్వాలు వేసుకొని, డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీ మీద కూర్చున్న రాఘవరావు చెమ్చాతో ఉప్మా నోట్లో వేసుకొని, "ఉప్మా చాలా బావుందిసీ!" అన్నాడు, పెళ్ళాం మొహంలోకి చూస్తూ.

"నాన్న దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది" అంది రాజేశ్వరి మంచినీళ్ళ గ్లాసు భర్త దగ్గరగా తోస్తూ.

"చాలాకాలానికి నా కిష్టంగా అల్లంముక్కలెక్కువగా వేసి చేశావు"

"నాన్న దగ్గర్నించి ఉత్తరం వచ్చిందన్నాను, మీ ధోరణి మీది!" అంది రాజేశ్వరి కాస్త విసుగ్గా.

"అలాగా! పచ్చిమిరపకాయలు మరో నాలుగు తగిలిస్తే మరింత మజాగా వుండేది!" అన్నాడు రాఘవరావు.

"ఎంత చేసినా మీకు సంతృప్తి అనేది లేదు. నూక జల్లించకుండా పురుగులతో చేసే మీ అమ్మగారి ఉప్మాలా చేస్తే ఇంకా ఇంకా మజాగా వుంటుంది!" అంది రాజేశ్వరి కాస్త వ్యంగ్యంగా.

"మధ్యలో మా అమ్మ ఊసెందుకు? పచ్చిమిరపకాయలు కాస్త తక్కువయ్యాయన్నాను. అంతేకదా! ఏదిఏమైనా మీ అమ్మ కన్నా బాగానే వంటచేస్తుంది మా అమ్మ!" అన్నాడు రాఘవరావు నవ్వుతూ.

"మా అమ్మ వంట నాతమ్ముళ్ళకీ, నాకూ బాగా నచ్చుతుంది!" అంది రాజేశ్వరి బింగమూతితో.

"మరి మీ నాన్నకో?" రాఘవరావు కొంటెగా అడిగాడు.

"అదే, మానాన్న దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందన్నాను" అసలు సంగతి మళ్ళీ గుర్తుచేస్తూ అంది రాజేశ్వరి.

రాఘవరావుకి మరి తప్పలేదు. కొద్దిగా ఎగతాళి చేస్తూ అన్నాడు - "మీ అమ్మ వంట నచ్చట్లేదు. నువ్వొచ్చి మీ అమ్మకి వంట నేర్పు, అనా?"

"కాదు మా చెల్లెల్ని మరొకరికి వంటచేసి పెట్టేందుకు పంపడానికి ముహూర్తం పెట్టారట!" రాజేశ్వరి కనురెప్పలాడిస్తూ, చిన్నగా నవ్వుతూ అంది.

"మరి నిన్న రాత్రి ఎందుకు చెప్పలేదు?" రాఘవరావు ప్రశ్నించాడు.

"మీరింటికి వచ్చేసరికి ఒంటి మీద స్పృహ వుంటేగా, చెప్పడానికి?"

రాజేశ్వరి మాటల్లోని వెక్కిరింపు రాఘవరావుకి సూటిగా తగిలింది.

"ఏదో కాస్త కొలీగ్స్ బలవంతం చేశారు. దానికింత పెద్ద విసుర్లనవసరం!"

రాఘవరావు మాటలు విని, సంభాషణ కొద్దిగా పక్కదార్లు పడ్తోందనిపించింది రాజేశ్వరికి. వెంటనే అనునయంగా అంది.

"వచ్చేనెల రెండో తారీఖున పెళ్ళి. ఈ రోజుకి సరిగ్గా పది రోజులుంది. బేబీ కివ్వాళే ఆఖరి రోజు దాని నర్సరీ స్కూలుకి. మీరు వెంటనే సెలవుపెడితే, మరో రెండు మూడు రోజుల్లో బయలుదేరి వెళ్దాం. శుభకార్యం జరుగుతోంది. ఇంటికి పెద్దల్లుడిగా మీరు దగ్గరుంటే మా నాన్నకీ, అందరికీ సంతోషంగా వుంటుంది.

"పెళ్ళికొడుకెవరట?"

"అతగాడు నిడదవోలు మున్సబుగారబ్బాయిట. పేరు చక్రపాణి, ఎం.బి.బి.యస్." - రాజేశ్వరి కాస్త గొప్పగానే అంది.

"కట్నం ఏమాత్రమిస్తున్నాడు మీ నాన్న?"

"లక్ష!" కళ్లు తిప్పుతూ అంది రాజేశ్వరి.

రెండక్షరాల రామనామం జపిస్తే లోకకళ్యాణం జరుగుతుందట! ఒక లక్ష కట్నంగా రాజేశ్వరి చెల్లెలి కళ్యాణం జరగబోతోంది. కానీ రాజేశ్వరి నోటమ్మట వచ్చిన ఆ రెండక్షరాల మాటా, రాఘవరావు మనస్సులో అసూయకంకురార్పణ చేసింది. అయినా నవ్వుతూనే అన్నాడు - "నాకు మీ నాన్న అరవై వేలే ఇచ్చాడు!"

"బావుంది, మీరింజనీరూ, అతగాడు డాక్టరూ!" అంది రాజేశ్వరి మొగుణ్ణి ఏడిపించాలని సరదాగా. అప్పటికే అతనేడ్చుకోవడం మొదలు పెట్టాడని రాజేశ్వరాక్షణంలో గ్రహించలేక పోయింది.

"ఇచ్చుకోలేనని నానారాద్ధాంతమూ చేసి అరవై వేలకే నిన్నంటగడ్తే, పోనీలే డబ్బు లేదు కదాని సర్దిపెట్టుకున్నాను. ఇప్పుడు 'లక్ష' ఎక్కణ్ణించి వచ్చిందో!? అంటే మీ నాన్న దృష్టిలో ఇంజనీరు కన్నా డాక్టరెక్కువ!" - ఎంత మామూలుగా అన్నా, ఆ మాటల్లోని ఉడుకుమోత్తనం కొట్టొచ్చినట్టు కనబడింది.

రాజేశ్వరి తెల్లబోయింది. మొదటిసారిగా మొగుణ్ణర్థం చేసుకోవడంలో కొంచెం తడబడింది.

"అదేమిటండీ అలాగంటారు? మా నాన్నకి నేనొకటీ, చెల్లెలొకటీనా? ఇద్దర్నీ సమానంగానే చూస్తాడు. మీ సంబంధం మంచిదనేగా మా నాన్న మిమ్మల్ని బ్రతిమాలుకుని ఈ పెళ్ళి జేస్తే! అప్పట్లో నష్టాలు వచ్చి మా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా వుండడంతో, అంతకంటే ఇచ్చుకోలేక పోయాడు. ఈ మధ్య చెరకుపంట దిగుబడి బాగా రావడంతో, ఇప్పుడిచ్చుకో గలుగుతున్నాడు."

"అదే అంటున్నా, అప్పుడివ్వలేని పరిస్థితిలో వున్నాడు కాబట్టి తక్కువ సంబంధాన్ని చూశాడు. ఇప్పుడివ్వగల స్తోమత వచ్చింది కాబట్టి, డాక్టరు కోసం వెదికాడు అంతేగా?!"

రాజేశ్వరికి మతిపోయింది.

"మీరు మాటల్ని మెలిపెట్టి విపరీతార్థాలు తీస్తున్నారు! అయినా ఆ భావన నాకు కలగడంలో అర్థముంది కాని, మీకు కలగడంలో అర్థం లేదు. మా తమ్ముడికేం చదువుందని అరవై వేలిచ్చారు? నోరు విప్పి ఒక్క ఇంగ్లీషు ముక్క కూడా మాట్లాడలేదు! అలాగని మాతమ్ముడెక్కువా, మీరు తక్కువానా?"

రాజేశ్వరి తనకి తెలియకుండానే అగ్నిలో మరింత అజ్యం పోసింది.

"వెనక ఎకరాలుంటే వేలు రాకేం చేస్తాయి? డబ్బు తర్వాతనే డిగ్రీలు!"

"సర్లెండి, మీ మాటలకి సంతోషించాం కాని, మీరు వెంటనే సెలవు కప్తె చెయ్యండి" అంది రాజేశ్వరి మరేమి అనడానికిష్టంలేక.

రాఘవరావు మాట్లాడలేదు. ఇద్దరి మధ్యా అలముకొన్న నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ టెలిఫోను మోగింది. రాఘవరావు లేచి వెళ్లి ఫోనందుకున్నాడు.

అవతలి వైపు మాటలు విని, "అలాగే, వచ్చేనెల పదిహేనుకల్లా మీరినస్పెక్షన్ కోసం రావచ్చు. పన్లు సవ్యంగానే జరుగుతున్నాయి. నిజానికీ ఉదయం కాలేజీ ప్రిన్సిపాల్‌తో కలిసి ప్రిలిమనరీ ఇనస్పెక్షన్ చేస్తున్నాను" అని ఫోను పెట్టేశాడు. 'వెధవ సన్నాయి నొక్కులూ వీళ్ళూను' అని కొద్దిగా పైకి సణుగుతూనే బల్ల దగ్గరకొచ్చి, "కాఫీ పట్టుకురా" అన్నాడు.

రాజేశ్వరి లోపలికి వెళ్లి కాఫీ తీసుకువచ్చి బల్ల మీద పెట్టింది.

"ఎల్లుండి మంచిరోజు, ప్రయాణానికన్నీ సిద్ధం చేస్తాను. మా చెల్లికీ, మీ క్యాబోయే తోడల్లుడికీ మంచి బహుమతులు కొని పట్టుకురండి. మీరాఫీసుకి వెళ్ళగానే ముందు సెలవు మాట చూడండి" అంది రాజేశ్వరి మొహం మీద చిరునవ్వు పులుముకుంటూ.

"కాలేజీ కొత్త భవనాల ఇనస్పెక్షన్ కోసం హైదరాబాద్ నుంచి వచ్చేనెల జనాలొస్తున్నారు. ఈలోపుగా నాకు చాలా పన్లు చెయ్యించాల్సివస్తుంది. ఎల్లుండి మంచిరోజంటున్నావు. బేబీని తీసుకొని వెళ్ళు" అన్నాడు రాఘవరావు కాఫీని చప్పరిస్తూ.

"అమ్మయ్య బ్రతికించారు! మీకు కోపం వచ్చిందేమోనని హడలిపోయాను. కనీసం పెళ్ళికి రెండు మూడు రోజులు ముందుగానైనా రావాలి మీరు" అంది రాజేశ్వరి సంతోషంగా.

"రాగలను. కానీ రాదల్చుకోలేదు" రాఘవరావు పట్టి పట్టి అన్నాడు.

రాజేశ్వరికతని మాటల్లోని మతలబు తెలియక, "అంటే...?" అని అర్ధోక్తిగా తెల్లబోతూ అడిగింది.

"నువ్వు వెళ్ళగానే మీ నాన్నతో మాట్లాడి నలభై వేలు పంపించు. అప్పుడే నేను పెళ్ళికి వచ్చేది!" -ఉన్నట్టుండి మలుపు తిరిగిన మొగుడి మాటల్ని నమ్మలేకపోయింది.

"మీకేమైనా మతిపోయిందా లేక నిజంగానే అంటున్నారా?!" రాజేశ్వరి తడబడుతూ అడిగింది.

"నిజంగానే అంటున్నాను, నీ మాటల ప్రకారం మీ నాన్న వ్యవసాయం జోరుగా వుంది".

రాజేశ్వరి నిశితంగా భర్త వైపు చూసింది. ఇన్నేళ్ళూ తను కాపురం చేసిన రాఘవరావుకీ, గత పది నిముషాల్లోనూ ఒక్కసారిగా మార్పు చెందిన రాఘవరావుకీ ఎంతో వ్యత్యాసం కనబడింది. ఆమె హృదయంలో భర్త మీద అసహ్యానికి బీజం నాటబడింది.

"ఎవరికీ తెలియకుండా మీ కిప్పుడు మా నాన్న నలభై వేలిస్తే అది మిమ్మల్ని మీరు కించపర్చుకున్నట్లవుతుంది. ఒకవేళ నలుగురికీ తెలిసినా, రెండో అల్లుడికి లక్ష ఇస్తున్నారు కదా అని, పెద్దల్లుడికి కూడా మరో నలభై వేలిచ్చి సంతృప్తిపర్చారని బుగ్గలు నొక్కుకుంటారు! మొదటిది ఆత్మవంచన! రెండోది పరనింద! రెండువిధాలా మీకు గౌరవం వుండదు!" - రాజేశ్వరి నిరసనగా, నెమ్మదిగా అంది.

"ఎవరేమనుకున్నా నాకేం ఫర్వాలేదు!" రాఘవరావు కోపంగా అన్నాడు.

"మీకు ఫర్వాలేకపోవచ్చు. మీచేత మెళ్ళో తాళి కట్టించుకున్నందుకు, మీరు నలుగురిలోనూ

నవ్వులపాలవడం నాకు గౌరవంగా వుండదు. కావాలంటే పెళ్ళికైనా వెళ్ళడం మానుకుంటా కానీ, మా వాళ్ళ ముందు మిమ్మల్నీ, నన్నూ కించపర్చుకోలేను"

రాజేశ్వరి గంభీరంగా అన్న మాటలకి రాఘవరావు నవ్వాడు. ఆ నవ్వులో చదువుకున్నవాడి సంస్కారం కానీ, ఆత్మాభిమానం కానీ రాజేశ్వరికి కనబడలేదు.

"నువ్వు పెళ్ళికి వెళ్లడం మానడంతో ముడిపడ్డ విషయం కాదిది, మన కాపురానికే సంబంధించిన విషయం!" రాఘవరావు విసురుగా కుర్చీని తోసి, పక్కగదిలోకి పోయాడు.

రాజేశ్వరి అచేతనంగా కూర్చుండి పోయింది. ఆమె మనస్సులో అగ్నిశిఖలు లేచాయి. డబ్బుతో ముడిపడ్డ వివాహబంధాల్ని తలచుకుంటున్న ఆమె మనసులో, అప్పటికే ఉద్భవించిన జుగుప్స ఆకాశాన్నంటింది. ఆ సాయంత్రమే ఇల్లు వదలి వెళ్లడానికి నిశ్చయించుకుంది.

* * *

"వదినకు జ్వరంగా వుంది. నిన్న సాయంకాలం రుబ్బురోలు దగ్గర జారిపడినప్పట్నుంచీ అమ్మ కాలి బెణుకుతో బాధపడ్తోంది. నువ్వింకా పడుకుంటే ఎలా కుదుర్తుంది? కాస్త లేచి కాఫీ ప్రయత్నాలు చెయ్యి" రామకోటి, పమిట చెదిరి పక్కనే పడుకున్న పెళ్లాం నీలవేణిని భుజం మీద తడ్తూ, అనునయంగా అన్నాడు.

చెవిటివాళ్ళకి శంఖమేనా వినిపించవచ్చునేమోకానీ, విననట్టు నటించేవాళ్ళకేమి చెప్పినా ప్రయోజనం లేదని ఆ క్షణంలో గుర్తించిన రామకోటి, నీలవేణి భుజాల కిందుగా చేతులు వేసి, లేవదీసి కూర్చోబెట్టాడు.

"వెధవబ్రతుకు, కాస్సేపు తనివితీరా పడుకోడానికి లేదు!" – నీలవేణి విసుగ్గా అన్న మాటలకి రామకోటి బాధపడ్డాడు.

"ఏ రోజున నువ్వు ముందుగా లేచినట్టు? వాళ్లిద్దరికీ ఒంట్లో బాగుండలేదు కాబట్టి చెప్పవలసివచ్చింది. ఒకటి రెండు రోజులు ఇంటి భారం నెత్తిమీద వేసుకుంటే, ఇంతట్లోకి అరిగిపోవు! లే, ఇప్పటికే ఆలస్యం అయింది. అన్నయ్య ఇవ్వాళ అంబాజీపేట మెజిస్ట్రేట్ కోర్టుకి పెందరాళే బయలుదేరి వెళ్ళాలి" అన్నాడు రామకోటి కాస్త బుజ్జగింపుగా, కాస్త మందలింపుగా.

"అడ్డమైనవాళ్లకీ చాకిరీ చెయ్యడానికే ఈ ఇంట్లో అడుగుపెట్టినట్టుంది" – మూర్ఖంగా విసురుగా అన్న నీలవేణి మాటలకొక్కసారిగా రామకోటి అదిరిపడ్డాడు.

"మళ్ళీ అను ఆమాట!" రామకోటి కోపంగా అన్నాడు.

నీలవేణి అలవోకగా నవ్వి. అదోలా చూస్తూ అంది – "ఒక్కమాటు కాదు, లక్ష మాట్లంటాను. వాళ్ళందరికీ చెయ్యవలసిన అవసరం నాకు లేదు!"

"వాళ్ళచేత నువ్వు చేయించుకుంటున్నప్పుడు?"

"నేనేమీ చెయ్యమనలేదే. అయినకాడికి పదిహేను వేలూ కట్నమిచ్చుకున్నది ఈ ఉమ్మడి కుటుంబంలో మగ్గి చావడానికి కాదు!"

"వెధవ బోడి కట్నం పదిహేను వేలిచ్చినందుకు నీ కన్నవాళ్ల నెత్తుగానూ, మమ్మల్ని దిగానూ

చూడనవసరంలేదు. నీ తండ్రొక్కడే కాదు, ఈ లోకంలో కట్నమిచ్చి పెళ్లి చేసింది!"

"లోకం దాకా నా కనవసరం! మీ వదినగారేం కట్నం తీసుకువచ్చారని? ఈ ఇంట్లోనే వుంది. చోద్యమంతా!" - నీలవేణి వెటకారంగా అంది.

రామకోటి పెళ్లాం వైపు తీక్షణంగా చూశాడు. మల్లెలు వేలాడదీసిన మంచం మీద, మల్లెలు వెదజల్లిన పరుపు మీద, తనను మల్లె తీగలా అల్లుకుపోయిన తొలిరాత్రి నీలవేణి, ఆ క్షణంలో మల్లినాగులా కనిపించింది. కిందకి దిగి, జబ్బ పుచ్చుకుని నీలవేణిని మంచం మీద నుంచి కిందకి లాగేశాడు. ఆ ఊపులో కిందపడ్డ నీలవేణి అలానే కూర్చుండి పోయింది.

"లేచి నించో" రామకోటి గర్జించాడు.

కిందపడ్డ నీలవేణి నమ్మలేనట్లుగా చూస్తూ నెమ్మదిగా లేచి నిల్చుంది.

"హద్దుమీరి మాట్లాడినందుకు నిన్ను కొన్ని ప్రశ్నలడుగుతాను, సమాధానం చెప్పు. పెళ్లిలో నీకు పెట్టిన బంగారం నగల విలువెంత?" - రామకోటి కర్కశంగా అడిగాడు.

నీలవేణి బిత్తరపోయింది. జవాబివ్వకుండా నిలుచుండి పోయింది.

"సమాధానం చెప్పడానికి సమాజపు తీరు నీ కర్థమై ఏడిస్తేగా! సమాజంలో కొన్ని అలవాట్లు పాతుకుపోయాయి. ఒక్కొక్కప్పుడిష్టమున్నా లేకపోయినా వాటికి తలొగ్గవలసి వస్తుంది. కట్నమివ్వడమొక హోదా. కట్నం తీసుకోవడం మరొక హోదా. కట్నంలేని పెళ్ళి ఆదర్శమేకానీ, అగౌరవం. కట్నకానుకల విషయంలో మేమేమీ బేరమాడలేదే! మీనాన్న పదిహేను వేలన్నాడు. మావాళ్ళు సరేనన్నారు.

"పెళ్ళిరోజున నీ ఒంటి మీద మేం దిగవేసిన బంగారం విలువ పన్నెండు వేలు. ఇప్పుడిరవై వేలు చేస్తుంది, ధరలు పెరిగిపోవడంవల్ల. మీ అక్కయ్యకు పాతిక వేలు కట్నమిచ్చారని అవసరమున్న చోటా, లేనిచోటా కల్పించుకుని అడ్డమైనవాళ్ళతోటీ చెప్పుకోవడం నాకు తెలియంది కాదు. అలా గొప్పలు చెప్పుకోవడంలో మమ్మల్ని లోకువపర్చడమే నీఉద్దేశ్యమని తెలిసినా మౌనం వహించాను. ఇంతకీ వాళ్ళు నీ అక్కకి పెట్టిన బంగారమెంత?" - రామకోటి ఒక్క క్షణం ఆగాడు.

నీలవేణి ఏదో అనబోయి ఆగిపోయింది.

"ఆగిపోయావేం? మమ్మల్ని కెలికితే నీ వాళ్లనీ కెలకవలసివస్తుంది. వదిన కట్నం తీసుకురాలేదన్నావు కదూ? దానికి సమాధానం విను. వదిన మూడెకరాల భూమితో మా ఇంట్లో అడుగు పెట్టింది. నాన్న రిటైర్ అయ్యేసరికి నా చదువు పూర్తికాలేదు. చెల్లెలికి పెళ్ళి కాలేదు. అన్నయ్య కప్పటికింకా ప్రాక్టీసందుకోలేదు. మేమందరమూ ఎంత వద్దంటున్నా ఆ భూమి నమ్మేసి అప్పటి పరిస్థితుల్లో ఓ మార్గం చూపించింది.

"అంతా ఎందుకు చేసినట్టు? ఏమవసరముండి చేసినట్టు? మా కుటుంబంలో అడుగు పెట్టిన తర్వాత, మాకష్టసుఖాలలో పాలుపంచుకుంటూ, మాలో ఒకరిగా కలిసి పోవడంవల్ల! ఈ ఇంట్లో అడుగుపెట్టి ఏణ్ణర్థం దాటినా నువ్వు మాలో ఒకరివి కాకపోవడం మా దురదృష్టం.

"నేనుద్యోగంలో చేరడం, అన్నయ్య ప్రాక్టీసందుకోవడం మా ఆర్థిక పరిస్థితిని మెరుగు చేసిన వెంటనే భూమి తాలూకు డబ్బుని వదిన పేర బ్యాంక్‌లో వెయ్యడం జరిగింది. తను ఎంత వద్దంటున్నా, ఇంతచేసి, వదిన ఈమాట ఎవరితోనూ అనలేదు! ఎవరితోటీ చెప్పుకోలేదే! ఎందుకు? తను మెట్టిన ఇల్లు తన ఇల్లుగా భావించుకోవడంవల్ల! కావాలంటే ఒక్క మాటతో నీ నోరు మూయించగల శక్తి వున్నా, వదిన నువ్వు కట్నం తీసుకొచ్చి నప్పుడొక్క మాట కూడా అనలేదు! ఎందుకని? సభ్యత కల మనిషి కాబట్టి.

"నేను నిన్ను చేసుకున్నది నిన్ను చూసి కానీ మీ నాన్న ఇచ్చిన కట్నానికి ఆశపడి కాదు! మనసు తెలియకుండా మొహాల్ని చూసి పెళ్ళిచేసుకునే ఈ దౌర్భాగ్యపు వ్యవస్థలో నేను మోసపోయానని ఈ ఉదయం తెలుసుకున్నాను.

"నువ్వేదో చిన్నపిల్లవని వాళ్ళిద్దరూ నెత్తిమీద పెట్టుకుని చూసినందుకు తగిన గుణపాఠం చెప్పావు. ఈ క్షణం నుంచీ ఇంట్లో పనులన్నీ వాళ్ళిద్దరితోటీ కలిసిమెలిసి చేసుకుంటూ సర్దుకుపోయావూ, సరేసరి. నీకా ఉద్దేశ్యం లేకపోతే, నీ ఒంటి మీదున్న బంగారంతో సహా పుట్టింటికి పోయి గొప్పగా బ్రతుకు.

"ఇకనుంచీ నీ అందాన్నెరగా చూపించి నన్నాకట్టుకోలేవు! నువ్వేం చెయ్యదలచుకున్నదీ నాకు మాటలతో చెప్పనవసరంలేదు. పావుగంట లోపుగా చేతల్లో చూపించు!" రామకోటి గది తలుపుని విసురుగా తీసి నడవలోకి వచ్చాడు.

నడవ గుమ్మంలో కూర్చుని బెణికి వాచిన కాలికి మనవరాలిచే అమృతాంజనం రాయించు కుంటున్న రామకోటి తల్లి మాణిక్యాంబ, "ఏమిట్రా? చిన్నపిల్ల, దాంతో ఘర్షణ పడ్తున్నట్లున్నావ్?" అంది.

"ఘర్షణ కాదు, మీరు నన్ను పదిహేను వేల కమ్మిపారేసినందుకు నేను పడ్తున్న క్షోభ! నీ కోడలు మహారాణికి ఉమ్మడి కుటుంబం నచ్చలేదుట! అమ్మా! ఒక్క సంగతి. తనీ కొంపలో వున్నంతకాలం నువ్వూ వదినా పనులు పురమాయించండి కానీ, నెత్తిమీద పెట్టుకోవద్దు. కలిసివుండలేకపోతే పుట్టింటికి పోవచ్చునని చెప్పేశాను. తను ఏ సంగతీ నిశ్చయించుకోడానికి పావుగంట గడువిచ్చాను!" అని రామకోటి నడవ గుమ్మం దాటి, పెరట్లో బావి దగ్గరకు దారితీశాడు.

మాణిక్యాంబ విస్తుపోయింది. రామకోటి ఇంత కటువుగా మాట్లాడ్డం ఎప్పుడూ వినలేదు. అప్పటికే ఈ పరిణామానికి తట్టుకోలేని నీలవేణికి, భర్త అత్తగారితో అన్న మాటలు విని మరింత అదురు పుట్టుకొచ్చింది. ఎంతో మెత్తటివాడనుకున్న మొగుడిలా విజృంభిస్తాడని కలలో కూడా ఊహించని నీలవేణి, తడబడ్తున్న అడుగులతో గది బయటకు వచ్చింది. ఏదో అనబోయి, రామకోటి తల్లి కొడుకు కోపానికి జడిసి, మాట్లాడక ఊరుకుంది.

సరిగ్గా ఇరవై నిముషాల తర్వాత ఆ ఇంట్లో వాళ్ళందరూ మొదటిసారిగా నీలవేణి చేతి కాఫీ తాగారు. ఆ కాఫీ కుడితిలా వున్నందుకు రామకోటి విసుక్కోలేదుకానీ, తనక్కావల్సిన సమాధానం

దొరికినందుకు తృప్తిగా నవ్వుకున్నాడు. ప్రిన్సిపాల్ ఆ రోజు త్వరగా రమ్మనమనడంవల్ల వెంటనే స్నానం చేసి, బట్టలు వేసుకొని కాలేజీకి వెళ్లాడు.

అయితే ఆ సమాధానం తప్పుడు సమాధానమనీ, నీలవేణి అనుకున్నది సాధించిందనీ, రామకోటికా సాయంత్రానిక్కానీ తెలియలేదు.

• • •

రాత్రి తెల్లవార్లూ ఎడాపెడా వున్న తలదిండుల్ని, ఒళ్ళున్న హీరోయిన్లలా ఊహించుకుని విసుగెత్తిపోయి, వాళ్ళు కనీసం కలలోకైనా వచ్చి మధురమైన అనుభూతుల్ని కలిగించనందుకు తిట్టుకుంటూ, ఎర్రబారిన నిద్రలేమి కళ్ళతో లేచాడు సాంబశివం.

దంతధావన చేసి, ముందు సావిట్లోకి వస్తూ, "చెల్లాయ్! కాఫీ పట్టుకురా" అంటూ అరిచాడు.

"లార్డులా ఆర్డర్లివ్వడం తెలుసుకానీ, ఒళ్ళొంచి పనిచెయ్యడం చేతగాదు! అమ్మ వంటింట్లో వుంది. పోయి కాఫీ తెచ్చుకో. లేకపోతే అన్నీ నీ కాళ్ల దగ్గరికి వచ్చిపడాలంటే, పెళ్ళిచేసుకో!" పక్కగదిలో జూయాలజీ రికార్డు వ్రాసుకుంటున్న కమల కూడా గట్టిగానే అరిచింది.

సాంబశివం సణుక్కుంటూ వంటగదిలోకి పోయి, తల్లిచ్చిన కాఫీగ్లాసునందుకొని పోబోతూండగా ఓ పక్కన పీట వేసుకుని కూర్చున్న తండ్రి క్రిష్ణయ్య, "సాంబం! అలా బయటకు పోయి పెరట్లో కాఫీ తాగడమెందుకు? ఇక్కడ కూర్చుని తాగు" అన్నాడు.

'పక్కన కూర్చుని కాఫీ తాగమంటే, మాటల్లో ఏదో తిరకాసుందనుకుంటూ' గడప మీద కూర్చుని నెమ్మది నెమ్మదిగా కాఫీ తాగసాగాడు.

"నాన్న నీ పెళ్లివిషయమై అడగమంటున్నార్రా అబ్బాయీ!" అంది తల్లి.

"నా పెళ్లికిప్పుడేం తొందర వచ్చిందని?" సాంబశివం ముక్తసరిగా అన్నాడు.

'అలాగే కానివ్వండీ అంటే, తొందర చూసి లోకువ కట్టేస్తారు. అందుకనే కోరికలు పట్టుకుని శరీరాన్ని చిత్రహింసలు పెడ్తున్నా, వయసొచ్చిన యువతీయువకులిలానే అనవలసివస్తుంది తల్లిదండ్రులతో! కాదని మరోమారడిగి ఒప్పిస్తే ఫర్వాలేదు కానీ, వీళ్ళకి నిజంగా కంగారు లేదనుకుని పెళ్లి విషయం వాయిదా వేస్తేనే అసలు చిక్కంతా! వెధవ గొడవా, వెధవ హిపోక్రసీనూ! సరే కానియ్యి, ఏమవుతుందో చూద్దాం?!' సాంబశివం ఆలోచనలు పరిపరివిధాల పోసాగాయి.

ఆలోచనల కంతరాయం కలిగిస్తూ, తండ్రి నానుస్తూ గుంభనగా అన్న మాటలు వినిపించాయి.

"తొందరొచ్చిందని కాదు. చెల్లి పెళ్ళి నీ పెళ్ళితో ముడిపడివుంది!"

"అంటే?" అర్థంకాక అడిగాడు సాంబశివం.

"అలా అర్థంకానట్టు నటించకు. మన పరిస్థితి నీకు తెలుసు. కొత్తపేట సబ్‌రిజిస్ట్రారు కూతుర్నిస్తామంటూ సిద్ధాంతి చేత కబురంపాడు. పదిహేనూ, ఇరవై దాకా ఇస్తామంటున్నారు. కాబట్టి ఇరవై వేలనుకోవచ్చు. నువ్వు కనకీసంబంధాన్ని ఒప్పుకుంటే, సుబ్బరామయ్యగారి కొడుక్కి కమల సంబంధం కుదర్చవచ్చు!"

"కొత్తపేట సబ్‌రిజిస్ట్రారు కూతురికి కన్ను మెల్ల! పాటల పోటీకి మా కాలేజీ కొచ్చినప్పుడు

చూశాను. ఆ పిల్ల బావుండదు. నా కిష్టం లేదు" - సాంబశివం మాటలు నాన్నదలచుకోలేదు.

"కన్ను మెల్లగా వుంటేనేం? అది అదృష్టానికి దారితీయొచ్చు" తల్లి లాలనగా అంది.

"నాలాంటివాడు దొరకడమే ఆ అమ్మాయికి అదృష్టం. ఇంక నా అదృష్టం సంగతంటావా, బ్రహ్మచారిగా వున్నా, ఎవరికి భర్తగా మారినా ఇప్పుడు చేస్తున్న డిమాన్‌స్ట్రేటరు గిరీ నుంచి లెక్చరరు గిరీకి ప్రమోషన్ రాక తప్పదు! అంతకుమించి మరేరకమైన అదృష్టమూ నన్ను వరించడానికాస్కారం లేదు!" సాంబశివం మొండిగా అన్నాడు.

"నువ్విలా మొండికేస్తే చేతిలో వున్న సంబంధం జారుకుంటుంది. మన కమల అందం చూసి వాళ్లు పన్నెండు వేలకే ఒప్పుకున్నారు. కమల పెళ్ళి బాధ్యత నా ఒక్కడి మీదే వుందనుకోకు!" క్రిష్ణయ్య నిష్ఠూరంగా అన్నాడు.

"నీ ఒక్కడి మీదే వుందని ఎందుకు బాధపడ్తున్నావో నా కర్థం కావటల్లేదు. దాని పెళ్ళి భారం నా ఒక్కడి మీదా వేసుకుంటాను - సరేనా? నా తోడబుట్టినదాని పెళ్ళి కాందే, నేను పెళ్ళిచేసుకోను!" తన మాటలకి తనకే ఆశ్చర్యమేసింది సాంబశివానికి.

కొద్ది క్షణాల క్రితం కోరికలతో నలిగిపోతున్న శరీరానికి శాంతి కలగడానికి పెళ్లయితే ఎంత బావుండునని కలలు కన్న సాంబశివం, ఇప్పుడు కమల పెళ్ళి విషయమై ఎంతటి ప్రతిజ్ఞ చేశాడు. అందుకనే ఆలోచనలకీ ఆచరణలకీ పొంతనుండదు. మనిషి విలువ పెరిగేది చేతలవల్ల కానీ, ఆలోచనలవల్ల కాదు.

"ఎలా చేద్దామనుకుంటున్నావు?" క్రిష్ణయ్య హేళనగా అన్నాడు.

"కొడుకులూ, వెనక ఆస్తిపాస్తులూ లేని ఆడపిల్లల తండ్రులెలా చేస్తారో అలానే!"

"వాళ్ళప్పులపాలై చేస్తున్నారు.!"

"నేను నా కాలాన్నమ్మి పెళ్లి చేస్తాను. ట్యూషన్లు చెబ్తాను. నీ చాటుగా కాలుస్తున్న సిగరెట్లు మానేస్తాను. సినిమాలు చూద్దం మానేస్తాను. ఇలా కష్టపడితే రెండేళ్ళలో డబ్బు కూడపెట్టగలను. ఈలోపులో కమల చదువు కూడా పూర్తవుతుంది"

"అంతవరకూ ఈ సంబంధం ఆగదు. పిల్ల మట్టుకు మరింత ఎదిగి కూర్చుంటుంది"

"ఈ సంబంధం కాకపోతే, దీని బాబులాంటి సంబంధం తీసుకొస్తాను!"

"బాబులాంటిది కానీ, మరోటి కానీ, అప్పటికి అవిటివాళ్లు కూడా మనకందకుండా పోతారు! నువ్వు కూడబెద్దామనుకుంటున్న డబ్బు పంటి కిందకి రాదు!" క్రిష్ణయ్య కొంచెం విజయగర్వంతో అన్నాడు.

సాంబశివం ఆలోచనలో పడ్డాడు. తండ్రి మూర్ఖంగా మాట్లాడుతున్నాడు. తను కాదంటే తల్లిని నసపెట్టేస్తాడు. దీన్నెలా నరుక్కురావాలి? ఒక్క క్షణం ఆలోచించాడు.

"సరే మీరన్నట్టుగా ఆ మెల్లకన్నమ్మాయినే చేసుకున్నాననుకోండి. వాళ్ళిచ్చే కట్నంతో మీరు కమల పెళ్ళి చేస్తారు! ఒక్క ప్రశ్న, ఇంతకీ కమల సుబ్బరామయ్యగారి కొడుకంటే ఇష్టపడిందా?"

"దానికేం తెలుసు? మూడు ముళ్లూ పడితే ఇష్టాలు వాటంతటవే పుట్టుకొస్తాయి"

"ఇష్టాలనే ఎందుకనుకోవాలి, కష్టాలు కూడా పుట్టుకురావచ్చు. నా కిష్టంలేనిదాన్ని కమల పెళ్లి కోసం నేను కట్టుకోవటానికి సిద్ధంగా వున్నాను. కానీ కమల కిష్టంలేని పెళ్లి చేసి దాన్ని కష్టపెట్టటడంలో ఏమైనా సబబువుందా అమ్మా?" సాంబశివం తల్లి మనసులో తలపులు లేవదీయదానికి ప్రయత్నించాడు.

"ఏమోరా, ఇష్టమేనా అంటే..." తల వంచుకుని మౌనంగా వుండిపోయింది. "మరది అంగీకారం కింద లెక్కకదా?"

"అమ్మా! నువ్వు నాన్నగార్ని అలానే చేసుకొన్నావా?" సాంబశివం నవ్వుతూ ప్రశ్నించాడు.

"అవున్రా, అలానే చేసికొంది! మీ అమ్మ జీవితానికిప్పుడేం వచ్చిందని?"

"అని నువ్వనుకొంటోన్నది! కన్నకూతురికి కావల్సినంత కట్నమిచ్చి పెళ్లిచెయ్యలేక, కొడుకుని పణంగా పెట్టడానికి ప్రయత్నిస్తున్న మీ అసమర్థతని మనసులో ఎలా తిట్టుకుంటూందో మీకేం తెలుసు? మనకేం తెలుసు?" సాంబశివం అనాలోచితంగా అనేశాడు.

"ఒరేయ్, సాంబం! హద్దూ పద్దూ లేకుండా ఏమిటా మాటలు?" తల్లి మందలించింది.

"అమ్మా, మరోమాట! నిజానికి కమలకా కుర్రాడిష్టమే అనుకుందాం. నేను కొత్తపేట సబ్‌రిజిస్ట్రారు కూతుర్ని మీ ఇష్టప్రకారం చేసుకుంటాననుకో. ఒకవేళా అమ్మాయికి కన్నే కాకుండా మనసు కూడా మెల్ల అనుకో. మనసు మెల్లగా వుంటే మాట వంకరగా వస్తుంది! మాదగ్గర కట్నం తీసుకుని, ఆ కట్నంతో ఆడపడుచు పెళ్లిచేశారని ఎత్తిపొడుస్తూ పాటలు పాడిందనుకో. మనెవ్వరికీ సమాధానంగా మాటలు దొరకవు! ఏమంటావు?" సాంబశివం తల్లిని మరింత ఉచ్చులో బిగించేశాడు.

ఆమె మాట్లాడలేదు.

క్రిష్ణయ్య కొడుకు ధోరణిని సహించలేక మధ్యలో అడ్డుకున్నాడు. మాటల్లో మెలిపెట్టి జారుకోదానికి ప్రయత్నిస్తున్నాడని వెర్రికోపంతో అరిచాడు.

"నీ మూర్ఖత్వం మూలాన చెల్లెలికి వచ్చిన బంగారం లాంటి సంబంధాన్ని చెడగొడ్తున్నావు. నువ్వు రెండేళ్ళ తర్వాత ఎంత ఎత్తుకైనా పెరగవచ్చు. అంతదాకా పెళ్ళికెదిగిన పిల్లనుంచుకోవడం అంతగా మంచిది కాదు. ఈలోపుగా ఏదైనా..."

"జరిగితే ఎవరు బాధ్యులంటావు? కన్న సంతానాన్ని గురించి మరీ అంత నీచంగా ఆలోచించకండి. కమల చిన్నపిల్లేమీ కాదు తెలివితక్కువగా ప్రవర్తించదానికి. మరో ఏణ్ణర్థంలో బి.ఎస్‌సి. పూర్తవుతుంది. చేతికి డిగ్రీ వచ్చిన తర్వాత, కమల పెళ్లి సులువుగా జరుగుతుంది".

"ఆడదాని డిగ్రీకి ధర లేదు. ఉన్న ధరంతా మగవాడి డిగ్రీకే! అయినా ఇన్నిమాటలనవసరం. సాంప్రదాయమైన కుటుంబంలో పిల్ల సుఖపడ్తుంది. కొత్తపేట వారమ్మాయికి ఏదో కాస్త కన్నంటే మెల్లకానీ, పిల్ల బాగానే వుంటుందట. నాకే విషయం సాయంత్రంలోగా చెప్పు!" క్రిష్ణయ్య ఆజ్ఞాపిస్తున్నట్లుగా అన్నాడు.

"ఏం, సాయంత్రంలోగా సమాధానం చెప్పకపోతే వారు వేరే అబ్బాయిని చూసుకుంటా

మన్నారా?"

"వాళ్ళనలేదు. వేరే అమ్మాయిని కుదుర్చుకుంటామని సుబ్బరామయ్య అన్నాడు. వాళ్ళబ్బాయికి ఎక్కువ కట్నం దొరికే సంబంధం రెడీగా వుందట. వెంటనే సమాధానం ఇవ్వాలి" - క్రిష్ణయ్య మంకుగా అన్నాడు.

"కన్నందుకు, పిల్లల ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా, వాళ్ల జీవితాల మీదా, భవిష్యత్ మీదా మీకు సర్వాధికారాలూ వున్నాయని మీరనుకుంటోన్నప్పుడు, వేరే అంగీకారాలడగడం శుద్ధదండుగ! అయితే ఒక్కమాట గుర్తుంచుకోండి. ఎక్కువ కట్నమిచ్చే ఇంకో సంబంధం సిద్ధంగా వుందని కబురంపిన కుటుంబానికి సాంప్రదాయముంటుందని నేననుకోను!" సాంబశివం చివాల్న లేచి, ఒక్క క్షణం ఆలోచించి మళ్లీ అన్నాడు.

"కమలకీ సంబంధమే నిశ్చయించాలి. సుబ్బరామయ్యగారికి అడిగిన కట్నం ఇవ్వడానికి సిద్ధంగా వున్నామని కబురంపాలి! ఇదేకదా మీ తొందరంతాను? సాయంత్రం వరకూ ఆగండి. తల తాకట్టు పెట్టయినా కమల పెళ్ళికి కావల్సిన డబ్బు తీసుకొస్తాను. తాంబూలాలకి ముహూర్తం పెట్టి, రాత్రికి కబురంపవచ్చు.

డబ్బు పుట్టించలేక వెధవలాగ ఇంటికి తిరిగివచ్చాననుకోండి, అప్పుడిద్దరికీ అంగీకారం పంపండి. కొత్తపేట సబ్‌రిజిస్ట్రారు దగ్గర అడ్వాన్సు తీసుకుని సుబ్బరామయ్యగారికి పంపొచ్చు. అయితే ఇందులో వున్న తమాషా ఏమిటంటే, నిజానికి నన్నూ, ఆ సుబ్బరామయ్య కొడుకునీ కొత్తపేట రిజిస్ట్రారే కొన్నట్లవుతుంది!" సాంబశివం తల్లిదండ్రుల కేసి తీక్షణంగా చూసి హాల్లోకి వెళ్ళిపోయాడు.

తల్లి మనసాందోళన చెందింది. కొడుకు మాటల వెనుక దాగిన వ్యథ ఆమెని కలవర పర్చింది.

ముందుచూపు లేక మూర్ఖత్వం మనసుని తెర కమ్మడంతో, చేతకానితనంతో క్రిష్ణయ్య పళ్ళు పటపట కొరికాడు.

జూయాలజీ రికార్డు పక్కనపెట్టి అన్ని మాటలూ విన్న కమల, చీటికిమాటికీ తన్నేడిపించే అన్న సాంబశివానికి తనంటే ఎంత అనురాగమో, మొదటిసారిగా గుర్తించగలిగింది. జీవితమంటే ఇంకా పూర్తిగా అవగాహన లేని ఆ పిల్ల మనసులో ఆలోచనలు చెలరేగాయి. సుబ్బరామయ్య గారబ్బాయి తనకి నచ్చినట్టే వున్నాడు. అయితే తన పెళ్ళి అన్నగారికి అప్పు దొరకడం మీద ఆధారపడివుంది. లేనిపక్షంలో కొత్తపేట సంబంధాన్ని అన్న ఒప్పుకోవడం మీద ఆధారపడివుంది. రెండువిధాలా అన్న తన కోసం నష్టపోకూడదు, కష్టపడకూడదు. చదువు పూర్తయితేనే కానీ ఛస్తే పెళ్ళి చేసుకోనని తండ్రికి చెప్పగల ధైర్యాన్నిమ్మంటూ, జూయాలజీ రికార్డులో సగం గీసిన కప్పబొమ్మకి దణ్ణం పెట్టింది.

❖ ❖ ❖

ఆకాశంలో ఎర్రగా లేచిన సూర్యుడు కళ్ళలోనే వున్నట్లుగా నిద్ర లేచింది పద్మ. నిద్రలేమి

కళ్ళతో పెరట్లోకి వెళ్ళి ముఖం కడుక్కొని, వంటింటిలోకి వెళ్ళింది.

అడుగు పెట్టిన అక్క కళ్ళలోకి చూడలేక, గ్యాస్‌స్టవ్ మీద మరుగుతున్న కాఫీనీళ్ళ గిన్నెలోకి తల దించుకుని చూసింది కాంతం.

"ఎందుకే వెర్రిదానా అలా కళ్ళు దించి చూపు తప్పించుకుంటావ్? పది పైసల పంచదారబిళ్ళ కోసం తండ్రితో అంగట్లోకి వెళ్ళిన కుర్రాడు, కాడ్‌బరీస్ చాక్లెట్ కోసం మారాం చేస్తాడు. ఇదీ అంతే! నన్ను చూడ్డానికి వచ్చిన అబ్బాయికి నువ్వు నచ్చావు. ఇందులో నీ తప్పేముందని?" అంటూ పద్మ చెల్లెలు కాంతం పక్కన చేరింది.

"అది కాదక్కా నువ్వు నచ్చలేదని చెప్పి ఊరుకుంటే బావుండేది కానీ, నన్నయితే చేసుకోడానికి సిద్ధమని చెప్పిన వాళ్ళ ఇదికి అసహ్యమేస్తోంది. నాకంటే వేదాంతం చెబుతున్నావు కానీ, నీ మనసెంత బాధపడిందో నీ కళ్ళే చెబుతున్నాయి. ఈ విషయంలో నువ్వూ, అమ్మా నన్నింక బలవంతపెట్టకండి" కాంతం అంది.

"కుర్రవాడు కాడ్‌బరీస్ చాక్లెట్ కావాలని పేచీ పెట్టినప్పుడు, దుకాణదారుడు లౌక్యంగా బలవంతపెట్టి అంటకట్టకపోతే వ్యాపారం జరగదు"

"అది వ్యాపారస్థుడికి డబ్బొచ్చే మార్గం కాబట్టి, కొనేవాడికి నచ్చచెబ్తాడు. కానీ ఇక్కడది కాదక్కా! మనం డబ్బిచ్చుకుంటున్నాం. అదే కట్నానికి నన్ను చేసుకుంటానన్నారే కానీ, కట్నం వద్దనలేదు కదా? డబ్బిచ్చి సుఖాన్ని కొనుక్కునే విటులకి నువ్వన్న మాట వర్తిస్తుంది కానీ పెళ్లిచూపుల్లో కాదు. మనం పడుపువృత్తిలో కనక వుండుంటే, నీ కోసం వచ్చిన పెద్దమనిషి నేను కావాలంటే, అలాగే వాడి పక్కలో పడుకునేదాన్ని!"

కాంతం అంత కటువుగా మాట్లాడుతుందని పద్మ ఊహించలేదు.

"ఏమిటా మాటలు!? అర్థం పర్థం లేకుండా! సంస్కారమున్న మాటలేనా అవి?" పద్మ మందలింపుగా అంది.

"ఏమిటక్కా సంస్కారమూ గింస్కారమూను! అవతలివాళ్ల మనసెంత బాధపడుతుందోనని ఊహించకుండా, ఇలా కబుర్లు పంపే పెద్దమనుషులదా సంస్కారం?" కాంతం ఎదురు ప్రశ్నించింది.

"మనం ఎంత బాధపడ్డా వాస్తవాన్ని ఆలోచించు. నాన్న పోయినా ఎంతో నిబ్బరంతో అమ్మ ఆ ఉన్న ఎకరం కొబ్బరి తోటనీ, ఈ పాత కొంపనీ కాపాడుకుంటూ, మనల్ని కష్టపడి పెంచింది. మన పెళ్ళిళ్ళు చేసి తన బాధ్యత నిర్వర్తించుకోడానికి తపన పడ్తోంది. అటువంటప్పుడు, ఎవరిది ముందూ, ఎవరిది వెనకా అనే ప్రసక్తి లేదు. నా పెళ్లి కాకుండా నీ పెళ్ళేమిటని సంశయించకూడదు" పద్మ బుజ్జగింపుగా అంది.

"అస్సలు నీది మట్టిబుర్రక్కా! నేనన్న మాటలు నీకింకా అర్థంకావటల్లేదూ? సంస్కారరహితుడైన ఆ అబ్బాయి నా కిష్టం లేదు. మీకిద్దరికీ నా పెళ్ళి గురించి అంత తొందరగా వుంటే, నాకోసమని వచ్చే సంబంధాన్ని చూడండి. కుర్రవాడెలా వున్నా కళ్లు మూసుకుని మెడ వంచుతాను. అంతేకానీ

నిన్ను చూసుకోడానికొచ్చిన కుర్రాడు నన్ను చేసుకుంటానంటే మట్టుకొప్పుకోను. జీవితాంతమూ మనిద్దరి మనస్సుల్లోనూ ఓ ముల్లుగా వుండిపోతుంది, ఇటువంటి పెళ్లి!"

కాంతం మాటల్లోని నిజాన్ని గ్రహించింది పద్మ.

"ఛ, అంత మాటలనకే, కనీసం ఒక పెళ్లి జరిగినా చాలని అమ్మా, నేను నిన్ను బలవంతం చేశాం కానీ, మరేమీ కాదు. నువ్వు ససేమిరా కాదంటున్నప్పుడింక ఎందుకు? వాళ్ళకి కబురు పంపించేద్దాం"

"కబురూ వద్దు, కాకరకాయా వద్దు! నేనంటే అంత మోజు చూపించినప్పుడు మళ్ళీ కబురంపుతారో లేదో చూద్దాం. వాళ్ళు మాట్లాడకుండా కూర్చున్నారా విషయం దానంతటదే ముగిసిపోతుంది. మళ్లీ కబురు పంపారో, బుద్ధి కనక చెప్పకపోతే నా పేరు కాంతం కాదు!".

"ఏదో ఇష్టంలేదని చెప్పేస్తే వదిలిపోయేదానికి, మళ్ళీ గొడవలెందుకు?" పద్మ భయంగా అంది.

"గొడవా లేదు, పాడూ లేదు కానీ, ఆ విషయం నా కొదిలేయ్. చిన్నవైనా ఏవో ఉద్యోగాలు చేసుకుంటూ స్వతంత్రంగా బతుకుతున్నాం. ఇప్పట్లో పెళ్లి కాకపోతే కొంపేమీ మునిగిపోలేదు. స్త్రీ గౌరవాన్ని గుర్తించిన పురుషులు తారసపడ్డప్పుడు మనం తప్పకుండా పెళ్ళి చేసుకుందాం. అంతవరకూ ఈ పెళ్ళిచూపుల తతంగాలకి కాస్త బ్రేక్ ఇస్తే బావుంటుంది!" అంది కాంతం.

పద్మ చటుక్కున వంగి చెల్లి బుగ్గ మీద ముద్దు పెట్టుకుంది.

"ఛీ పాడు! ముఖమంటే కడుక్కున్నావు కానీ, పళ్ళుతోముకోలేదు! పోయి తోముకో!" అంది కాంతం నవ్వుతూ.

పద్మ కూడా మనసు తేలికపడి, గూట్లో వున్న కాల్గేట్ పేస్టూ, బినాకా బ్రష్షూ అందుకుంది.

❁ ❁ ❁

పరబ్రహ్మం టై కట్టుకుంటూండగా, శకుంతల మడతలుపడ్డ మొగుడి కాటన్ కోటుని ఇస్త్రీ చేస్తోంది. రాధ నెమ్మదిగా గదిలో అడుగు పెట్టి, తలుపు గడియ వేసింది.

"మీతో ఒకమాట చెప్పాలి" అంది నెమ్మదిగా.

"వేసవి సెలవుల్లో ఎక్స్‌కర్షన్ మాటేనా? కాలేజీ కుర్రాళ్లని విజ్ఞానయాత్రల పేరుతో ముందుకు తోసే బాధ్యత నెత్తిమీద పెట్టుకుని, స్వంతకూతుర్ని పంపలేదన్న పేరొస్తుందే అని మీ అమ్మతో వాదించినా లాభం లేకపోయింది. నువ్వే మీ అమ్మని ఒప్పించు!" అన్నాడు పరబ్రహ్మం నవ్వుతూ.

"అది కాదు నాన్నా, ఎలా చెప్పాలో తెలియటల్లేదు" అంది రాధ గుండె దిటవు చేసుకుని, సంభాషణకి పునాదులు వేస్తూ.

"మాటల్లో తిరకాసు మాని తిన్నగా చెప్పు. నీ మనసులో మాట చెప్పు. నీ పెళ్లి సంగతి గురించి ఏమైనా..." శకుంతల అంది, ఇస్త్రీపెట్టెని కోటు చేతిమీద పాముతూ.

"నాకు చచ్చిపోవాలని వుంది!" రాధ గాద్గదికంగా అంది.

పరబ్రహ్మం ఒక్క క్షణం విస్తుపోయాడు.

"ఏమిటమ్మా అలా మాట్లాడుతున్నావ్. జ్వరంకానీ వచ్చిందా?" అంటూ పరబ్రహ్మం దగ్గరగా వెళ్ళి, కూతురి మెడ మీద చెయ్యి వేసి చూశాడు.

"చచ్చిపోతే అప్రదిష్ట తప్ప మరేమీ కాదని ఆ ధైర్యం చెయ్యలేకపోయాను"

శకుంతల మెదడులో ఓ చిన్న మెరుపు మెరిసింది. ఒక్కసారిగా ఆందోళన చోటుచేసుకుంది. ఇస్త్రీ పెట్టెనలానే కోటు మీద వదిలేసి, కూతురు దగ్గరకు వెళ్లి భుజాలు పట్టుకుంది. పరబ్రహ్మం పక్కకు తప్పుకున్నాడు.

"ఏమిటి జరిగింది రాధా, కొంపదీసి...?" శకుంతల అర్ధాంతరంగా ఆగిపోయింది.

"అవునమ్మా నాజీవితం నాశనమైంది. నేను నెలతప్పాను!" రాధ తల వంచుకుని ఉన్న నిజాన్ని చెప్పేసింది. ఎంతగా గుండె ధైర్యం కూడదీసుకుని, ఆసమాధానం చెప్పగలిగిందో రాధకే తెలుసు.

శకుంతల కూతురివైపు నమ్మలేనట్లుగా కళ్లింత చేసుకుని చూడ్డం తప్ప, మరేమీ అనలేకపోయింది.

"నేను కావాలని కాలు జారలేదమ్మా, బలాత్కారం చెయ్యబడ్డాను!" – ఒక్కసారిగా భోరుమని ఏడుస్తూ తల్లిని కౌగలించుకుంది.

పరబ్రహ్మం షాక్ నుండి తేరుకున్నాడు. కూతురితో గొడవపడి కానీ, లేదా కూతుర్ని హడలుకొట్టి కానీ ప్రయోజనం వుండదు, నడిరోడ్డు మీద పడ్డం తప్ప. బలాత్కారమంటోంది, నెమ్మదిగా వివరాలు తెలుసుకోవాలి.

"ఎవడమ్మా వాడు?" పరబ్రహ్మం నెమ్మదిగా ప్రశ్నించాడు.

"కెమిస్ట్రీ లెక్చరర్ శేషగిరి!" రాధ వెక్కి వెక్కి ఏడుస్తూ సమాధానం చెప్పింది.

"వాడా దుర్మార్గుడు! ఈ విధంగా కసి తీర్చుకున్నాడన్నమాట!" పరబ్రహ్మం మంచం మీద కూలబడిపోయాడు.

"ఏదో వస్తువుల కొనుగోలు విషయంలో డబ్బు తినేశాడని నాలుగైదు సంవత్సరాలక్రితం మీరేదో విచారణ కూడా జరిపారు, ఆ శేషగిరేనా?" శకుంతల కాస్త తేరుకొని అడిగింది.

"అవును, వాడే – విచారణ జరిగిన తర్వాత ఉద్యోగంలోంచి తీసెయ్యాలని రికమెండ్ చేశాను. కానీ కొన్ని శక్తులడ్డుపడడటంవల్ల, రెండు ఇంక్రిమెంట్లు మట్టుకు ఆపుచేయించగలిగాను. అది మనసులో పెట్టుకుని, ఇంతకాలం తర్వాత ఈ దుర్మార్గం తలపెట్టాడన్నమాట! ఇప్పుడేం చేసేది?" పరబ్రహ్మం తననే ప్రశ్నించుకున్నాడు.

తండ్రి మాట విని రాధకి కొంచెంగా నైతిక బలం పుంజుకున్నట్లయింది. జరిగిన దానికి తను కానీ, తన అందం కానీ కారణాలు కావు. మరో పరిస్థితుల్లో అయితే తనను నమ్మడం తల్లిదండ్రులకి చాలా కష్టమైవుండేది. కానీ ఇప్పుడు తనపై తల్లిదండ్రుల సానుభూతి వుంటుంది. రాధ కొద్దిగా తెరిపిన పడింది.

"పెళ్లయిన వెధవకివేం బుద్ధులు? అయినా వాడి బారిన నువ్వెలా పడ్డావమ్మా?" శకుంతల

రాధ తల నిమురుతూ అడిగింది.

"రెండు నెలల క్రితం ఓ రోజు మధ్యాహ్నం కెమిస్ట్రీ ఎక్స్‌పెరిమెంట్ చేస్తుండగా, ఎవరో రాజకీయ నాయకుడు పోయాడని సెలవిచ్చారు. అందరూ వెళ్లిపోయారు. సగంలో వున్న ఎక్స్‌పెరిమెంట్‌ని మానివేయడానికి మనస్కరించక కంటిన్యూ చేశాను. అటెండరేమీ అనలేక సణుగుతూవుండగా, శేషగిరి వచ్చి తొందరగా వుంటే ఇంటికి పొమ్మని చెప్పాడు. ప్రయోగం పూర్తయ్యేవరకూ తనుండి లేబరేటరీ మూస్తానని చెప్పి అటెండర్ని పంపేశాడు. తర్వాత కానీ అతని దురుద్దేశ్యం నాకు తెలిసింది కాదు.

"ఉన్నట్టుండి నన్ను కెమికల్ స్టోర్‌రూమ్‌లోకి లాక్కుపోయి, అరవకుండా నా చీర కొంగుతోనే నోరు కట్టేసి, బలత్కారంచేసి, దాహం తీరిన తర్వాత వికటంగా నవ్వి నన్నొదిలాడు. ఏంచెయ్యా డానికీ తోచక, ఎవరికి చెప్పాలో తెలియక, దైవం మీద భారం వేసి నోరు మూసుక్కూర్చున్నాను. అయితే తర్వాత వాడు జరిగినదాన్ని గురించి మళ్ళా ప్రసక్తి తీసుకుని రాలేదు. మరి ప్రయత్నాలు చెయ్యనూ లేదు. అయితే నాకు నెల తప్పింది. చావడానికి ధైర్యం లేక, మీకు చెప్పడం తప్ప నేను చెయ్యగలిగిందేముంది?"

ఉన్నట్టుండి బట్ట కాలిన వాసన గదంతా ఆవరించింది. పరబ్రహ్మం వెంటనే వెళ్లి ఇస్త్రీపెట్టెని కోటు మీద నుంచి తీసేశాడు. కోటు చెయ్యి కాలిపోయింది. కాలిన కోటు చెయ్యినీ, కూతుర్నీ మార్చిమార్చి చూశాడు.

"నువ్వు చెయ్యని పాపానికి నిన్ను దోషిగా ఎంచే మూర్ఖుణ్ణి కాను. నువ్వు ధైర్యంగా వుండు. ఏం చెయ్యవలసిందీ, ఏం చెయ్యగలదీ నేను చూసుకుంటాను. శకుంతలా! రాధని పల్లెత్తు మాటనకుండా, ఈమాట ముసలివాళ్ళకి తెలియకుండా ఎలా నెగ్గుకొస్తావో నీ మీద వుంది. రాధ భవిష్యత్ మనిద్దరి చేతుల్లోనూ వుంది. నేను కాలేజీకి పోయి మళ్లీ వస్తాను" పరబ్రహ్మం కట్టుకున్న టైని విప్పిపారేసి, కాలేజీకి బయలుదేరాడు.

శకుంతల రాధని పొదివిపట్టుకుని కూర్చుని, నుదుటి మీద ముద్దు పెట్టుకుంది.

◆ ◆ ◆

కాంక్రీటు మెషీన్ భీకరంగా చప్పుడు చేస్తూ తిరుగుతోంది. కట్టిన మంచెలమీదుగా, ఆడా మగా కూలివాళ్ళ చేతుల మీదుగా అంచెలంచెలుగా కాంక్రీటు రెండో అంతస్తు పైభాగానికి వెడుతోంది. కొత్త కాలేజీ ఉత్తర భాగం రెండంతస్తులూ అప్పటికే చాలాభాగం తయారయ్యాయి. కాంట్రాక్టరు కోటీశ్వరరావు చేతులు నలుపుకుంటూ వెనక నడుస్తుండగా, ఇంజనీరు రాఘవరావు, అన్యమనస్కంగా ప్రిన్సిపాల్ పరబ్రహ్మం ఆ ఉత్తర భాగం దిగువ అంతస్తులో ఫిజిక్సు లేబొరేటరీస్‌కి కేటాయించిన పెద్ద హాలుని చూస్తున్నారు. ప్రిన్సిపాల్‌ని కూడా తీసుకుని రాఘవరావు రావడంతో, కోటీశ్వరరావు ఇబ్బందిగా వున్నాడు.

తూర్పు వైపు గోడలో ఏటవాలుగా బీటలు కనిపించాయి.

"ఆ బీటలెలా వచ్చినట్టు?" రాఘవరావు గోడ వైపు చూపిస్తూ కోటీశ్వరరావునడిగాడు.

"బీటలా? అవి తాపీ చారలనుకుంటాను సార్! చెయ్యి కలవక తాపీలో వచ్చిన భేదం కానీ, బీటలు కావు సార్!" అన్నాడు కోటీశ్వర్రావు నసుగుతూ.

"మైక్రోస్కోపులో చూడక్కర్లేకుండా నా కళ్ళకే అంత స్పష్టంగా కనిపిస్తుంటే బీటలు కావంటారేమిటి?!" పరబ్రహ్మం కాస్త చికాకు వ్యక్తపరుస్తూ అన్నాడు.

రాఘవరావు గోడ దగ్గరగా వెళ్లి బీటలమధ్య గోరు గుచ్చి చూశాడు.

ఓచోట చూస్తుండగా ఓ పెద్ద సిమెంటు పెళ్ల ఊడిపడింది. రాఘవరావు వంగి, కిందపడ్డ పెళ్ళని చేతుల మధ్య నలిపి చూశాడు. ఇసుక జరజర రాలింది. ఏమిటన్నట్లుగా చూశాడు రాఘవరావు.

"సిమెంట్ సప్లై అలాగే వుంది సార్. ఏదో ఈ ఎర్రసిమెంటుని మా మొహాన కొడ్తున్నారు కానీ, అందులో అప్పుడప్పుడు క్వాలిటీ లేని సరుకు వచ్చేస్తోంది సార్!" అన్నాడు కోటేశ్వర్రావు.

"సప్లై మాటెలా వున్నా, ఒకటికి మరిన్ని పాళ్ళు ఎక్కువ ఇసుకని కలిపినట్టు తెలుస్తోంది, ఏమంటారు?" రాఘవరావు కర్కశంగా ప్రశ్నించాడు.

"ఏదో ఈ గోడ దగ్గరకొచ్చేసరికి కొంచెం సిమెంటు సప్లై తగ్గినట్టుంది. అయినా పెద్దపనేం కాదు. ఆమేరకి మళ్లీ చేయించేస్తాను. తర్వాత ఆనవాలు తెలియకుండా వెల్ల రంగుల్లో కలిసిపోతుంది"

"తరాల కొద్దీ విద్యార్థులు మసిలే విద్యాలయమయ్యా ఇది! ప్రవేశిస్తునే గోడలు కూలితే ప్రమాదం కాదూ?" పరబ్రహ్మం అన్నాడు.

ఏదో గొప్పకి పోయి ప్రిన్సిపాల్‌ని చుట్టపు చూపుగా పిలిచినందుకు, రాఘవరావు తనను తాను మనసులోనే తిట్టుకున్నాడు.

"అయ్యా, కాంక్రీటు కాలమ్స్ చాలా స్పెషల్ డిజైన్‌లో వేశామండి. గోడలూరికే పార్టిషన్ కోసం కానండి, బరువులు మొయ్యడానికి కాదు. ఈ బిల్డింగ్‌కి వంద సంవత్సరాలు గ్యారంటీ. మీకా భయమక్కర్లేదు!" అన్నాడు కోటీశ్వర్రావు నవ్వుతూ.

"ఆమాట నిజమే అయినా కొత్త గోడల్లో బీటలు కనిపిస్తే ఎవరూ హర్షించరు" అన్నాడు రాఘవరావు కాస్త లౌక్యంగా పరబ్రహ్మాన్ని దృష్టిలో వుంచుకుని.

"సిమెంటు బీటలకీ, అసలు బీటకీ తేడా తెలియనివాణ్ణి కానయ్యా. ఎందుకైనా మంచిది. ఈవైపు పునాదులు గట్టిగా వున్నాయో లేవో చూసుకోండి!" అన్నాడు పరబ్రహ్మం.

పరబ్రహ్మం మాటలకి రాఘవరావు కొంచెం ఆశ్చర్యపడకపోలేదు.

"ప్రిన్సిపాల్‌గారు చెప్పిన మాటలు విన్నారనుకుంటాను. వెళ్లగానే సూపర్‌వైజర్‌ని పంపిస్తాను. అన్నీ దగ్గరుండి చూస్తాడు" అన్నాడు రాఘవరావు.

కోటీశ్వర్రావు చేతులు నలుపుకుంటూ సమాధానమివ్వలేదు. ఇంజనీరు మాటల్లోని బెదిరింపు లీలగా స్ఫురించింది.

"సరే మీరు వెళ్లి కాంక్రీట్ స్లాబ్ ఎలా వేస్తున్నారో చూడండి. నేనీలోపుగా ప్రిన్సిపాల్‌గారితో

బోటనీ లేబొరేటరీస్ హాలు కూడా చూసి, అక్కడకు వస్తాను" అన్నాడు రాఘవరావు.

కోటీశ్వర్రావు అక్కణ్ణుంచి కదిలాడు. పరబ్రహ్మమూ, రాఘవరావూ ముందుకు కదిలారు. అక్కడి గోడల్లోనూ పగుళ్లు కనిపించాయి. పరబ్రహ్మం రాఘవరావు వైపు చూశాడు.

"ఏదో కాంట్రాక్టర్ని కాస్త కట్టడిలో వుంచడానికి కసరడమే కానీ, ఇటువంటి చిన్న చిన్న లొసుగులు ప్రతి కట్టడంలోనూ వుంటాయి. అయితే వీళ్ళు పునాదుల విషయంలో మట్టుకు జాగ్రత్తగానే వుంటారు. మీకు తెలియదేమో కానీ, లోకల్ ఎమ్.ఎల్.ఏ. ఈ కంట్రాక్టర్ని బెదిరించి తన ఇటికాంవుల్నించి ఇటుకలు కొనేటట్లుగా చేశాడు. కాల్పు సరిగా లేకపోయినా ఇలా బీటలూ, పగుళ్లూ వస్తాయి. అయినా ఇతను చెప్పినట్లుగా, బరువంతా కాలమ్స్ మీద వుంటుంది కాబట్టి ఇదంతగా పట్టించుకోవలసిన విషయం కాదు" అన్నాడు రాఘవరావు.

పరబ్రహ్మం చిన్నగా నవ్వుకున్నాడు – "సరే మీరేదో రమ్మన్నారు కాబట్టి వచ్చాను కానీ, నాకీ విషయాలేం తెలుస్తాయని. నేను వెళ్తాను. మీ పని మీరు చూసుకోండి" అన్నాడు.

"ఉండండి, మా డ్రైవరు మిమ్మల్ని ఆఫీసులో దింపేస్తాడు" అన్నాడు రాఘవరావు.

"అబ్బే అవసరంలేదు. ఏమంత దూరమని? నడుచుకుంటూ వెళ్తాను. దారిలో పాత బిల్డింగ్‌లో మార్నింగ్ క్లాసులెలా జరుగుతున్నాయో చూసిపోతాను" అని పరబ్రహ్మం బయట అడుగుపెట్టి, కాలిబాటమ్మట పాత కాలేజీ వైపు నడవసాగాడు.

అంతదూరం నుంచి ప్రిన్సిపాల్ వెళ్ళడం చూసిన కోటీశ్వర్రావు పరుగెత్తుకుంటూ రాఘవరావు దగ్గరకు వచ్చాడు.

"చూశారా, ఆఖరికి ప్రిన్సిపాల్‌గారు కూడా పసికట్టేశారు. మీకు పేమెంట్స్ చేస్తే మాకు పేరొచ్చేస్తుంది!" అన్నాడు రాఘవరావు.

కోటీశ్వర్రావు గుటకలు మింగాడు. ఊహించినంతా జరిగింది. అసలీ కంట్రాక్టు రాఘవరావుకి తెలుసున్న కంట్రాక్టర్‌కి వెళ్ళవలసినా, అతని ఆఫీసులో పనిచేస్తున్న చిన్నఉద్యోగుల సహాయంతో, టెండరు కాయితాల్లో లొసుగులు చూపించీ, పైనుంచి ఒత్తిడి తీసుకొచ్చి, ఇంకా ఏవో కుంభకోణాలు చేసి ఈ కంట్రాక్టుని సంపాదించాడు.

ఇనస్పెక్షన్ జరిగి పార్టు పేమెంట్ జరగకపోతే తను చాలా నష్టపడవలసివస్తుంది. రాఘవరావునెలా అయినా బుట్టలో వేసుకోవాలి.

"సార్! మీరేమీ అనుకోనంటే ఒకమాట! మీరు ప్రిన్సిపాల్‌గారిని తీసుకునిరాకుండా వుండవల్సింది. ఆయన ముందు మీరన్న మాటలవల్ల మనం రాజీపడే అవకాశాలు దెబ్బ తినేస్తాయి!" అన్నాడు కోటీశ్వర్రావు.

తను నోరు జారిన విషయంగానీ, పరబ్రహ్మంతో తర్వాత తనన్న మాటల విషయంకానీ, కంట్రాక్టరుతో చెప్పదలచుకోలేదు రాఘవరావు.

"ఆయన్ని కూడా వెళ్ళి చూడవలసిందని విద్యాశాఖ నుంచి ఉత్తరం వస్తే ఆయన మట్టుకేం చేస్తాడు. మీరేదో పని శుభ్రంగా చేయిస్తున్నారనుకుని వెంటేసుకొచ్చాను. లేకపోతే

ముందుగా నే వచ్చి, తర్వాత ఆయన్ని తీసుకువచ్చేవాణ్ణి!" అన్నాడు రాఘవరావు, ఓ చిన్న అసత్యాన్ని జోడిస్తూ.

"సార్! నేను మీకు కొత్తవాణ్ణయినా, అనవాయితీల విషయంలో మీరు నిశ్చింతగా వుండండి. సార్! వచ్చేనెల పెద్ద ఇన్స్‌పెక్షన్ జరిగేలోగా నేనన్నీ చూసుకుంటా కానీ, పరబ్రహ్మంగారు రంగంలోకి దిగకుండా చూడండి! వాళ్ళక్కడ స్లాట్ వేస్తున్నారు. నేను మీరన్నట్టుగా కాస్త దగ్గరుండి చూసుకోవాలి. మధ్యాహ్నం వచ్చి మీతో వివరంగా మాట్లాడతాను" అన్నాడు కోటీశ్వర్రావు. నిజానికతను వెంటనే హైదరాబాద్ ఫోన్ చేసి ముందు జాగ్రత్తలు తీసుకునే కంగారులో వున్నాడు.

"కోటీశ్వర్రావుగారూ! మీరు మరీ నాసిరకం పనిచేయించారు. పని నాణ్యత విషయమై పెనాల్టీ క్లాజ్‌లేవో వున్నాయి. వాటిని నేను చూడాలి. మధ్యాహ్నం వచ్చి కలుసుకోండి. మరోమాట, మీరు ప్రిన్సిపాల్‌గారి విషయంలో జాగ్రత్తగా వుండండి. ఆయన మీద ఏరకమైన ఒత్తిడి తీసుకొచ్చినా, ఆయనకేరకమైన ఆశలు చూపించినా, మొదటికే మోసమొస్తుంది. ఆయన కూడా వచ్చి చూసినందువల్ల మీకు పేమెంట్స్ రిలీజ్ చెయ్యడంలో కష్టమూ వుంది. నా గౌరవానికి నష్టమూ వుంది" - రాఘవరావు ఉచ్చు బిగించాడు. పరబ్రహ్మాన్ని తీసుకురావడం కూడా మంచిదే అయిందని, మొదట్లో అనుకున్నదానికి వ్యతిరేకంగా ఆలోచించాడు.

"మీ కష్టనష్టాలని మరచిపోయే వ్యక్తిని కాదు సార్, నేను!" అన్నాడు కోటీశ్వర్రావు.

రాఘవరావు సీరియస్‌గా ముఖంపెట్టి, బయటకు వెళ్లి జీపులో కూర్చున్నాడు. డ్రైవరు జీప్‌ని స్టార్ట్ చేశాడు.

'అనుకున్నంతా అయింది. రేటు పెంచేస్తాడు!' అనుకుంటూ, కోటీశ్వర్రావు దూరంగా ఆపిన తన మారుతీ కారు వైపు నడిచాడు.

⚬ ⚬ ⚬

ఫిజిక్స్ లెక్చరర్ శ్రీకంఠస్వామి చెబుతున్న పాఠం ఆపి, వెనక బెంచీల వైపు చూశాడు.

"ఈ మార్నింగ్ క్లాసులు పెట్టడం వల్ల మీకెంత ఇబ్బందిగా వుందో మాకూ అంతే ఇబ్బందిగా వుంది. ఊరికే నా కంఠశోష తప్ప మీకేమీ పట్టినట్టు లేదు!" అని విసుగ్గా అన్నాడు.

"సకాలంలో కోర్సులు పూర్తికాకపోతే మాదా తప్పూ సార్!" - ఎవరో మధ్య బెంచీ కుర్రవాడు ఎగతాళిగా అన్నాడు.

"అవునయ్యా మీదేమీ తప్పూ కాదు! మాదీ, ప్రభుత్వానిదీను! ఆడపిల్లల ఫుట్‌బాల్ గేమ్‌లో బౌండరీలైన్ దగ్గరకు బంతిని తన్నడానికి వచ్చిన పిల్లని లైను బైటకి లాగి ముద్దు పెట్టుకున్న విద్యార్థి మీద చర్య తీసుకున్నందుకు పది రోజులు సమ్మె! హాఫ్‌ఇయర్లీ పరీక్షల్లో కాపీ కొడుతున్న విద్యార్థుల్ని నలుగురెదుటా మందలించిన లెక్చరర్ మీద చర్య తీసుకోవాలని మరో పది రోజులు క్లాసులు మూయించిపారేశారు! ఎవడో తలమాసిన రాజకీయనాయకుడు ప్రభుత్వం మీద మిమ్మల్నాయుధంగా వాడుకున్నప్పుడు ముందు వెనకలు చూసుకోకుండా ఊరిలో విధ్వంసకాండ

జరుపుతూ కాలేజీని పూర్తిగా ఇరవై రోజులు మరిచిపోయారు. ఇప్పుడు కోర్సులు కాకపోతే మరి మాదీ తప్పు!"

"సార్! ఎవరో కొందరు విద్యార్థుల మూలంగా జరిగినవాటికి మమ్మల్నందర్నీ అనడం భావ్యంకాదు!" – ఓ ముందు బెంచీ కుర్రవాడన్నాడు.

"మీరు ముందుబెంచీల్లో కూర్చుని మంచివాళ్ళమనుకుంటే ప్రయోజనం లేదు. దారితప్పి నడుస్తున్న మీతోటి సోదరుల్ని ఎదిరించగల గుండెసత్తా మీకున్నప్పుడు, వ్యవహారాలిలా తగలడి వుండేవి కావు! అల్లరి విద్యార్థులు గొడవలు లేవదీస్తే మాకెందుకని ఇంట్లో కూర్చునే పిరికిసన్నాసులంటే నాకు గౌరవం లేదు.కొందరు గొడవలు లేవదీసి కాలేజీ మానేస్తే, కొందరు గొడవల్లో కాలేజీ కెందుకులే అని మానేస్తారు. ఈ రెండో రకం విద్యార్థులు కూడా విద్యాసంస్థలని చెడగొడుతున్నారు. చెప్పొచ్చేదేమిటంటే ఎవరు కారకులైనా అంతిమ ఫలితం ఒకటే! తప్పెవరిదైనా ముప్పు మీకే. ఎందుకంటే పరీక్షలిచ్చేది మేం కాదు, మీరు!"

"హియర్ హియర్!" – ఎవరో వెనక బెంచీ కుర్రవాడరిచాడు.

"నా ఫిజిక్స్ పాఠం కంటే నా ఉపన్యాసం నచ్చిందనుకుంటాను. అవున్లే పాఠాలు విని పరీక్షలు పాసయ్యే రోజులు పోయాయి!"

"వెనక బెంచీ కుర్రవాళ్ళని చిన్నచూపు చూసే ముందు బెంచీ కుర్రవాళ్ళకి మీరు బుద్ధి చెప్పినందుకు సంతోషంకొద్దీ అలా అన్నాను కానీ సార్, వేరే ఉద్దేశ్యంతో మట్టుకు కాదు. మీరు పాఠం మొదలు పెట్టండి సార్!" మళ్ళీ ఆ కుర్రాడే అన్నాడు.

"ఏం మొదలు పెట్టేది నా శ్రాద్ధం! వెనుకనుంచి మూడో వరసలో చేతులు మారుతున్న ఆ వస్తువుని మీరందరూ చూస్తేనేకాని పాఠం వినేటట్టు లేరు! మీరందరూ ఆ పనేదో త్వరగా కానిస్తే, ఆపేసిన పాఠాన్ని మళ్ళీ మొదలు పెడ్తాను" అని, శ్రీకంఠస్వామి కుర్చీలో కూర్చున్నాడు.

రోజులు మారాయి. గతులు మారాయి. తరాల అంతరాలలో ప్రవృత్తులు మారాయి. విద్యార్థులు శ్రీకంఠస్వామి మాటల్ని అక్షరాలా పాటించారు. ఆ వస్తువు ముందు బెంచీలో మొదటి విద్యార్థి చేతికొచ్చి మళ్ళీ వెనక్కి వెళ్ళే సమయంలో శ్రీకంఠస్వామి –

"మీ కుతుహలం తీరిందికదా! మరింతసేపూ నాచేత పాఠం ఆపించిన వస్తువేదో చూడాలని నాకూ వుంది! అప్పుడే మీరు వెనక్కి పంపించేస్తే ఎలా?" అన్నాడు నవ్వుతూ.

ముందు బెంచీ మొదటి విద్యార్థి ఆ వస్తువుని శ్రీకంఠస్వామి ముందు బల్లమీదుంచాడు. అదొక విదేశీ చేతిగడియారం. దినమాసాలు తెలియజేస్తుంది, సమయంతో పాటుగా బజర్ మోగిస్తుంది. పగలు సూర్యరశ్మితో, రాత్రి ఛార్జయిన బాటరీతో పనిచేస్తుంది. అది కాసియో కంపెనీ వాళ్ళు కొత్తగా మార్కెట్లోకి వదిలిన రిస్ట్‌వాచ్.

శ్రీకంఠస్వామి దాన్ని చేత్తో పట్టుకుని ముందూ వెనకా చూస్తూ, "ఎవరిదిది?" అని అడిగాడు.

అందరి బుర్రలూ వెనక్కి తిరిగాయి. వెనక బెంచీలో కూర్చున్న రాజారావు లేచి నిలడి, "నాదే సార్! మా బాబయ్య టోక్యో నుంచి నాకు పుట్టినరోజు బహుమతిగా పంపాడు" అన్నాడు.

"ఇవ్వాళేనా, నీ పుట్టినరోజు?" శ్రీకంఠస్వామి అడిగాడు.

"అవున్సార్! అందుకనే దీన్ని పెట్టుకొనివచ్చాను. నేనెంత కాదంటున్నా కుతూహలం కొద్దీ చేతులు మారడంతో మీ పాఠానికంతరాయం కలిగింది క్షమించండి!" అన్నాడు రాజారావు.

"దేశనాయకులు దేహం చాలించిన రోజు వార్త ఎప్పుడు వింటే అప్పుడు సెలవు ప్రకటిస్తారు. మహానాయకుల పుట్టినరోజుకి వాళ్ల చరిత్ర పూర్తిగా కాలగర్భంలో కలిసిపోయే వరకు ఏటా సెలవు దొరుకుతుంది. నీ వాచీ ప్రకారం ఈ పీరియడ్ ముగియడానికింక సరిగ్గా ఎనిమిది నిముషాల నలభైసెకండ్ల వ్యవధి వుంది. నీకు పుట్టినరోజు శుభకాంక్షలు తెలుపుతూ, ఈ కొన్ని నిముషాల టైము నీ సెలవుగా ప్రకటిస్తున్నాను!" అని శ్రీకంఠస్వామి వాచీని బల్లమీద వుంచి, క్లాసు వదిలి బయటకు వెళ్ళిపోయాడు.

క్లాసంతా ఒక్కసారిగా గొల్లుమంది.

రాజారావు తొందరగా ముందుకు పరుగెత్తుకువచ్చి, వాచీని తీసుకుని చేతికి పెట్టుకుని అందరి వైపూ చూశాడు.

"రాజారావ్ జిందాబాద్!" అని ఎవరో అరిస్తే క్లాసంతా అరిచింది.

అన్యమనస్కంగా మెట్లెక్కి అప్పుడే వరండాలో అడుగుబెట్టిన ప్రిన్సిపాల్ పరబ్రహ్మం 'మళ్లీ ఏం గొడవొచ్చి పడిందో?' అనుకుంటూ తన ఆఫీసు గది వైపు దారి తీశాడు.

• • •

రామకోటి హుషారుగా వినీ వినబడనట్లుగా ఈల వేసుకుంటూ, ఫైళ్లు ముందర పడేసుకుని చూస్తూ, ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురావల్సిన విషయాల్ని ఓ చిన్న నోట్‌బుక్‌లో వ్రాసుకున్నాడు. క్రితంరోజు సాయంత్రం టైపిస్టు టైపు చేసిన కాలేజీరిపోర్టు తాలూకు డ్రాఫ్టు తీసి చదవసాగాడు. ఉన్న అయిదు పేజీల్లోనూ తప్పులు దొర్లాయి. వాటన్నిటినీ ఎర్ర సిరాతో మార్కుచేశాడు.

ఆతప్పుల్ని చూసి విసుక్కుంటూ బెల్ కొట్టాడు.

వెంకటస్వామి గదిలోకి వచ్చాడు.

"పోయి, టైపిస్టు వినోద్‌కుమార్‌ని వెంటనే రమ్మనమని చెప్పు" అన్నాడు.

"అయ్యా, ప్రిన్సిపాల్‌గారు త్వరగా రమ్మంటే మీరూ నేనూ వచ్చాంకానీ, వినోద్‌కుమార్‌గారింకా రాలేదండీ, ఆయనగారికి పెళ్లిచూపుల బడలిక తీరలేదనుకుంటాను!" అన్నాడు వెంకటస్వామి నవ్వుతూ.

"శోభనం రాత్రి పెళ్లికొడుక్కి బడలిక తీరలేదంటే అర్థముంది కానీ, ఈ ఊళ్లోనే చూసిన పెళ్ళిచూపుల్లో బడలికేమిటి నా బొంద? ఈమధ్యన ప్రతిరోజు ఆలస్యంగా వస్తున్నాడు. ఈ డ్రాఫ్టు నిండా తట్టెడు తప్పులున్నాయి. ఇలానే తీసుకువెళ్ళి ప్రిన్సిపాల్‌గారికి చూపిస్తే బాగుండదు!" అన్నాడు రామకోటి.

"అయ్యా, నాతో అంటే ఏం ప్రయోజనం? ఆ వినోద్‌కుమార్‌గారినే డైరెక్టుగా అనేసి, ఓసారి గట్టిగా బుద్ధి చెప్పండి"

"ఈ ఏడాదసలే కుర్రాళ్ళ గొడవల మూలాన కాలేజీ నడక కుంటుబడింది. పరీక్షల ముందు ఆఫీస్ స్టాఫ్‌ని రెచ్చగొడ్తే ప్రయోజనముండదు సరికదా, మరికొన్ని అడ్డంకులు రావచ్చు. అందులోనూ మన హీరోగారు ఎమ్.ఎల్.ఏ.గారి కాండిడేటు! అంచేత వార్నింగులిచ్చి అతగాణ్ణి రెచ్చగొట్ట డానికిది సమయం కాదు. అదీకాక ఇప్పుడిప్పుడే ఊపిరి తీసుకుంటున్న ప్రిన్సిపాల్‌గారికి కొత్త సమస్యల్ని కలిగించడం నా కిష్టం లేదు. సరే, నా గొడవేదో నేను పడ్తానుగానీ, పోయి ఓ కప్పు కాఫీ తీసుకురా" అన్నాడు రామకోటి, రెండ్రూపాయల కాగితం వెంకటస్వామికిస్తూ.

"అయ్యా, ఈ కాలేజీ మొత్తానికి మీరొక్కరే పెద్దయ్యగారి కష్టసుఖాలలోచిస్తున్నారు కానీ, మిగతా ఎవరండయ్యా బాధపడ్తోంట?! అటు పంతుళ్ళూ, ఇటు కుర్రాళ్లూ పెద్దయ్యగార్నీ సంవత్సరం నానాచికాకులూ పెట్టేశారు" అంటూ వెంకటస్వామి కాంటీన్‌కి పోయాడు.

పది నిముషాల తర్వాత వెంకటస్వామి తీసుకొచ్చిన కాఫీని తాగబోతుండగా, ప్రిన్సిపాల్ కబురంది, కాఫీనలాగే వదిలేసి, ఫైళ్లు తీసుకొనివెళ్ళాడు. గదిలో అడుగుపెడ్తూనే ప్రిన్సిపాల్ పరబ్రహ్మం చాలా ఆందోళనగా వుండడం గమనించాడు.

సాధారణంగా ఎటువంటి క్లిష్టపరిస్థితుల్లోనూ తన గాంభీర్యాన్ని కోల్పోని పెద్దమనిషివాళ దిగులుగా కనబడ్తున్నాడంటే, ఏదో పెద్ద చిక్కే వచ్చినట్టుందనుకుంటూ, "మీరేదో నలతగా వున్నట్టు కనబడుతున్నారు. ఒంట్లో బాగోలేకపోతే రెస్టు తీసుకోండి. రిక్షా పిలిపిస్తాను" అన్నాడు రామకోటి.

కనుకొలకుల్లో వున్న నీటిబిందువుల్నెంతగా ఆపుచేసుకుందామనుకున్నా ఆగలేదు పర బ్రహ్మానికి. తలెత్తేలోపుగా అవి జారి బల్ల మీది గ్లాస్‌టాప్ మీద పడ్డాయి.

బ్లాటింగ్ పాడ్ తీసుకుని వాటినద్ది, బాక్ రెస్టు మీదనున్న తువ్వాలు తీసి, కనుకొలకులు తుడుచుకుంటూ లేని నవ్వు తెచ్చుకొని, "విశ్రాంతి తీసుకుంటే పోయే బాధ కాదోయ్! నలక పడ్తే కన్ను తెరచినా మూసినా బాధపెడ్తూనే వుంటుంది, బయటకు వచ్చేదాకా" అన్నాడు పరబ్రహ్మం.

"మీరు చూసి సంతకాలు చెయ్యవలసిన ఫైళ్ళు నాలుగైదున్నాయి. కాలేజీ రిపోర్టు నిండా చాలా తప్పులు దొర్లించాడు మన వినోద్‌కుమార్. అతనింకా రాలేదు. రాగానే డ్రాఫ్టుని మళ్ళీ టైపు చేయించి మీకు చూపిస్తాను" అన్నాడు రామకోటి.

"దానిక్కాదు నిన్ను పిలుస్త. కెమిస్ట్రీ లెక్చరర్ శేషగిరి పర్సనల్ ఫైలు తీసుకురా. అతని మీద ఇదివరకు నడిచిన డిసిప్లినరీ యాక్షన్ కాయితాల్ని మళ్ళీ ఓసారి చూడాలి"

"సార్! ఆ కేసేదో చిన్నగా తేలిపోయిందికదా! ఆ ప్రబుద్ధుడు మళ్ళా ఏవైనా లిటిగేషన్లు కానీ పెడ్తున్నాడా? లేక కొనుగోళ్ల విషయంలో కొత్త గల్లంతులేమైనా చేస్తున్నాడా?" అన్నాడు రామకోటి కుతూహలంగా.

"కాదుకానీ..." పరబ్రహ్మం మాట మధ్యలో ఆపేశాడు.

"సార్! ఇటువంటి వారిని శిక్షించాలంటే మనం చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. చాలా

బలమైన సాక్ష్యాధారాలుండాలి. అవసరమైతే ఎరవేసి పట్టాలి. మీరు సరేనంటే, పథకం ఆలోచిస్తాను" అన్నాడు నెమ్మదిగా.

పరబ్రహ్మం ఓ క్షణం తటపటాయించాడు నిజం చెప్దామని. నాలుక చివరి వరకూ వచ్చిన మాటల్ని దిగమింగేశాడు. జరిగిన దురాగతాన్ని నలుగురెదుటా వుంచితే, సమాజంలో ఓ కొద్ది రోజుల పాటు జాలి లభిస్తుందేమో కానీ, వచ్చిన మచ్చ జీవితాంతమూ చెరిగిపోదు. అదీకాక శేషగిరిని శిక్షించడానికి కావల్సిన సాక్ష్యాధారాలు కోర్టు వాళ్లకి చూపించడం చాలా వ్యయ ప్రయాసలతో కూడిన పని. ప్రస్తుతానికి తన కూతురి మాటొక్కటే ఆధారం. అదీ దొంగపడ్డ ఆరు నెలలకి కుక్క మొరిగిన విధంగా వుంటుంది.

జన్యువిషయమై పరీక్షలు చేయించి నిర్ధారణ చేయించాలంటే కేసు విషయం ఊళ్లోనే కాదు, రాష్ట్రమంతటా తెలుస్తుంది. శేషగిరి శిక్ష దేముడెరుగుకానీ, తనూ తన కుటుంబమూ రోడ్డున పడవలసివస్తుంది. తన పరువు ప్రతిష్ఠల కోసం కాకపోయినా, రాధ భవిష్యత్ కోసమైనా తను నోరు మూసుకుని కూర్చోవాలి.

పాత ఎంక్వయిరీలో ఏమైనా లొసుగులున్నాయేమో చూద్దామని తప్ప, ఆ ఫైలు తెప్పించి నిజానికి తను చెయ్యగలిగిందేమీ లేదు.

"అవును నువ్వన్నమాటా నిజమే. ఎవరి పాపాన వారు పోక తప్పదు. ఏదో రోజు చట్టం విధించలేని శిక్షని వాళ్ళంతట వాళ్లే కొనితెచ్చుకోక తప్పదు. సరేలే, ఈ విషయమెవరితోటీ అనకు" అన్నాడు పరబ్రహ్మం, మనసు కాస్త కుదుటబెట్టుకుని.

"మీరు నాకు వేరే చెప్పాలా సార్! అయినా మీ రనుమతిస్తే నేనా కాయితాల్ని క్షుణ్ణంగా చదివి ఏదైనా మార్గముంటే చూస్తాను"

పరబ్రహ్మం ఏదో మాట్లాడబోయి, "మే ఐ కమిన్ సర్" అన్నమాటలు విని, "ఎస్" అన్నాడు.

సాంబశివం అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికి వచ్చాడు. ఇద్దర్నీ విష్‌చేసి బల్లకి పక్కగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

"మార్నింగ్ క్లాసుల్ని గురించి కుర్రాళ్లేమైనా గొడవకానీ లేవదీశారా? అయినా మీరూ, మీ బోటనీ లెక్చరరూ ఏమీ పట్టనట్టు కూర్చుంటే ఎలా? అన్నిటికీ నేనే బుర్ర బద్దలుకొట్టుకోవా లంటే, ఈ కాలేజీ ఎలా నడుస్తుంది?" పరబ్రహ్మం చికాకుగా అన్నాడు అత్త మీద కోపం దుత్తమీద చూపించినట్టుగా. అసలు విషయం తెలుసుకోకుండా సాంబశివాన్ని అనాలోచితంగా అన్నందుకు, మరుక్షణంలోనే బాధపడ్డాడు.

సాంబశివం చిన్నబుచ్చుకోలేదు. నవ్వుతూ అన్నాడు – "గొడవలు కనక వస్తే మా లెక్చరర్ విషయం నేను చెప్పలేను కానండి, నేను మట్టుకు విద్యార్థులతో కలయబడి పోట్లాడుతా కానీ విషయాన్ని మీ గడపలోకి తీసుకురాను. నేను వచ్చిన విషయం నా అంతరంగికం సార్! మీ సలహానీ, మీ సహాయాన్నీ అర్థించడం కోసం వచ్చాను"

"అయామ్ సారీ సాంబశివం! గొడవలతో విసుగెత్తి అలా అన్నానుకానీ మరేమీ కాదు.

ఏమీ అనుకోకు" అన్నాడు పరబ్రహ్మం.

"నేను కాలేజీ రిపోర్టు వినోద్‌కుమార్ రాగానే మళ్ళీ డ్రాఫ్టు టైపు చేయించి తర్వాత వస్తాను" అని రామకోటి కుర్చీలోంచి లేవబోయాడు.

"మరీ అంత అంతరంగికం కాదనుకోండి. నా మూలాన మీరు వెళ్ళిపోనవసరం లేదు. అంతా విని నవ్వకుండా వుంటే చాలు!" అన్నాడు సాంబశివం నవ్వుతూ.

పరబ్రహ్మం బుర్రూపడం చూసి, రామకోటి లేచే ప్రయత్నం విరమించుకున్నాడు.

"మీరేమీ అనుకోకుండా మీ గుమ్మంపైని ఎర్రబల్బు స్విచ్ ఆన్ చెయ్యండి" అన్న సాంబశివం మాటలకి నవ్వుకుంటూ స్విచ్ ఆన్ చేసి, 'ఇంక చెప్పు' అన్నట్లుగా చూశాడు పరబ్రహ్మం.

సాంబశివం గొంతు సవరించుకొని, ఆ ఉదయం జరిగినదంతా వివరంగా చెప్పాడు. అంతా చెప్పి చివరగా అన్నాడు.

"కని పెంచినవాళ్లకి కాల్చిపారేసే హక్కుందన్నట్టుగా మా నాన్నగారు, కొడుకు జీవితం కొల్లేట్లో కొట్టుకుపోయినా పర్వాలేదుకాని, ఈడొచ్చిన పిల్ల ఇంట్లో వుండకూడదన్న మూర్ఖత్వంతో చికాకు పెట్టేస్తున్నారు. ఈ సాయంత్రంలోగా డబ్బయినా చూస్తాను లేదా ఆ మెల్లకన్నమ్మాయిని చేసుకోడానికి అంగీకారమైనా తెలుపుతానని వచ్చేశాను. సార్! మీరు నాకు ధనసహాయం దొరికే మార్గం చూపాలి"

"రోలొచ్చి మద్దెలతో మొర పెట్టుకున్నట్లుగా వుంది! ఓ తలమాసిన మధ్యవర్తి మా అమ్మాయి రాధ కోసమని ఓ డాక్టరు సంబంధాన్ని తీసుకొచ్చాడు. మా ఆవిడ తల తాకట్టు పెట్టయినా ఈ సంబంధం కుదర్చమంటోంది. ఉన్న కొంపా, భూమీ కట్నానికి సరిపోతే, పెళ్ళి ఖర్చులకి ప్రావిడెంట్ తప్ప మరో గత్యంతరం లేదు. ఆనవాయితీల పేరిటా, మొహమాటం పెట్టుబడుల పేరిటా ఉన్న ఆ కాస్త బ్యాంక్ బేలన్సూ సరిపోతుంది. నేనూ నీ లానే ఇంట్లో ఘర్షణపడి వచ్చానంటే నమ్మవు!" అన్నాడు పరబ్రహ్మం.

"ఇన్నేళ్ళనుంచీ ఉద్యోగం చేస్తున్న మీ పరిస్థితే ఇలా వుంటే, ఏదో మూడేళ్ళ క్రితం ఉద్యోగంలో చేరిన నాలాంటివాడి సంగతి వేరే చెప్పుకోనక్కర్లేదు"

సాంబశివం గొంతుకలో నిస్పృహ చూసి రామకోటికి జాలి వేసింది.

"నా బ్యాంక్ బేలన్సంతా తుడిచిపెట్టి మీకో ఎనిమిది వేలు సర్దగలను" అన్నాడు రామకోటి.

"కెమిస్ట్రీ లెక్చరర్ శేషగిరి దగ్గర చాలా డబ్బుంది సార్! మీరో మాట ఆయనతో చెప్పి అప్పు ఇప్పించండి. ఆయన రేటు ప్రకారం వడ్డీ ఇచ్చుకుంటాను" అన్నాడు సాంబశివం పరబ్రహ్మం వైపు చూస్తూ.

"అలాంటి వ్యక్తులతో లావాదేవీలు పెట్టుకోవడం మంచిది కాదు. అతగాడు 'ధనదాహం'తో నిన్ను జలగలా పీల్చేస్తాడు. తాకట్టు పూచీ లేందే పూచికపుల్ల కూడా ఇవ్వడు. అయినా అతనికీ నాకూ చుక్కెదురన్న సంగతి నీకు తెలియదేమో! కావాలంటే ప్రస్తుతానికి నీకు కావల్సిన డబ్బు నేను నీ కిస్తాకానీ, శేషగిరి ముందు మట్టుకు దాసోహం అనకు" అన్నాడు పరబ్రహ్మం.

"మీ అమ్మాయి పెళ్ళి సమస్య ముందున్న మిమ్మల్నిబ్బంది పెట్టడం భావ్యం కాదు. అప్పు కోసం ఆలోచించానేకానీ, ఆ అప్పు తీర్చడానికెంతకాలం పడ్తుందోనని ఆలోచించలేదు. సరే సార్, అందమనేది ఒక్క మొహానికే కాదుకదా! ఒక విధంగా ఆలోచిస్తే ఏదో అవకరం వున్న పిల్లని చేసుకుంటే ఆ అభిమానం మూలానైనా మొగుడికి అణకువగా వుంటుందేమో? పెద్దవారుకదా అని నా బాధ మీ ముందు వెళ్లబోసుకోవడానికి వచ్చాను" అన్నాడు సాంబశివం, ఓ నిశ్చయానికి వస్తూ.

"అక్కడే నువ్వు పొరబడ్తున్నావు. అందమైన భార్య పురుషుడికి శత్రువన్నది పూర్వీకులన్నమాట. కానీ మానవ నైజం స్త్రీ పురుషులకందరికీ ఒకటే. అందమైన మొగుడు కూడా ఆడదానికి శత్రువే. ఈడూ జోడూ కుదరని స్త్రీ పురుషులు వివాహబంధంలో బహిరంగంగా ఎంతో సభ్యతతో ప్రవర్తించినా, మానసికంగా వ్యభిచరించక మానరు. అంతరాంతరాల్లో అసంతృప్తితో నలిగిచస్తారు.వైవాహిక జీవితమనేది పూలబాట కాదు సాంబశివం. అందుచేత నీ కిష్టంలేని పిల్లని చేసుకుని రాజీపడలేక తర్వాత బాధపడడం కంటే, మొండిగా కాదనడమే నయం. నీ కోసం నేను ఇంకొర్నర్థించే బదులు, నాకు చేతనైన సహాయం నేనే చెయ్యడం మంచిది"

పరబ్రహ్మం మాటలు విని సాంబశివం విస్తుపోయాడు.

నోరెత్తి మాట్లాడేలోగా మళ్లీ పరబ్రహ్మమే అన్నాడు.

"ఒకవేళ మా అమ్మాయి రాధ నువ్వంటే ఇష్టపడితే, నీ అభిప్రాయమేమిటి? అధికారంతో నిన్నడగటల్లేదు. ఓఆడపిల్ల తండ్రిగా నిన్నడుగుతున్నా!"

రామకోటీ, సాంబశివం అవాక్కవడం మాటటుంచి, తన గుండెలో గూడుకట్టుకున్న కూతురి మీది అనురాగం, స్వార్థపూరితమైన ఈ మాటల్ని తన ప్రయత్నం లేకుండానే ఎలా అనిపించిందో పరబ్రహ్మానికే తెలియలేదు.

సాంబశివం అంతరాంతరాల్లో ఓ చిన్న ఆశాకిరణం కనపడింది. ఆనందానికంకురార్పణ జరిగింది. "నా అభిప్రాయం మాటటుంచి, మీ రాధ..."

సాంబశివం మాటల్ని మధ్యలోనే త్రుంచేశాడు పరబ్రహ్మం.

"ఆ విషయం నా కొదులు. మీ ఇద్దరిలో ఎవరి కిష్టం లేకపోయినా నేను బలవంతం చెయ్యను. మరోమాట. ఈ పెళ్లికీ, నేను చేస్తానన్న సహాయానికీ ముడిపెట్టట్లేదు. ప్రస్తుతం నీ కష్టం గట్టెక్కాలి" అంటూ బ్రీఫ్‌కేస్‌లోంచి చెక్కు బుక్కు తీసి, ఇరవై వేలకి చెక్కు రాసి సాంబశివానికిచ్చాడు.

"దీన్ని మార్చి డబ్బు నీ తండ్రికియ్యి. ఒకవేళ మా రాధ సరేనంటే నేను వచ్చి మీ నాన్నగారితో మాట్లాడుతాను. అంతవరకూ రాధ విషయం ఎత్తకు. అన్నీ అనుకూలంగా జరిగితే, వివాహం జరిపించడానికి ఖర్చుంటుంది. రామకోటీ నాకు పి.ఎఫ్. లోనెంత వస్తుందో చూసి చెప్పు. నాలుగైదు రోజుల్లో అప్లై చేస్తాను" అన్నాడు పరబ్రహ్మం, సాంబశివం ముఖంలో కనబడ్డ అంగీకారసూచనల్ని ఆత్రుతగా చూస్తూ.

సాంబశివం కుర్చీలోంచి లేచి పక్కగా వంగి పరబ్రహ్మం పాదాలకి నమస్కరించాడు. పరబ్రహ్మం ఏదో అనబోయేలోగా గదిలోంచి వడివడిగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు.

"మీరెంత ఉదాత్తమైన మనసు గలవారు సర్!" రామకోటి మనసా వాచా స్తుతిపూర్వకంగా అన్న మాటలు, పరబ్రహ్మానికి సుత్తిదెబ్బల్లా తగిలాయి.

* * *

దిగులుగా కూర్చున్న రాజేశ్వరి కాలింగ్ బెల్ విని, నీరసంగా లేచివెళ్ళి తలుపు తీసింది. జరీ కండువా సర్దుకుంటూ, "రాఘవరావుగారున్నారా?" అని ప్రశ్నించాడు కోటీశ్వర్రావు.

"ఏదో కాలేజీ బిల్డింగ్ ఇన్‌స్పెక్షన్ వుందని ఉదయమే వెళ్ళారు. అక్కడైనా వుండొచ్చు లేదా అక్కణ్ణుంచి ఆఫీసుకైనా వెళ్ళుండొచ్చు. మీ పేరూ, వచ్చిన పనీ చెబ్తే ఆయన వచ్చిన తర్వాత చెప్తాను. లేదంటారూ ఆఫీసుకి వెళ్లి చూడండి" అంది రాజేశ్వరి మెట్టుకు దిగువగా మామిడిపళ్ళ బుట్టని పట్టుకుని నిల్చున్న మరోవ్యక్తిని కూడా చూస్తూ.

"అలా నిల్చుండిపోయావే, బుట్ట తీసుకునివెళ్లి హాల్లో పెట్టు" అన్నాడు కోటీశ్వర్రావు.

రాజేశ్వరి అప్రయత్నంగా పక్కకు జరిగింది. బుట్టని లోపల పెట్టి, ఆ కూలిమనిషి, "వస్తానయ్యగారూ" అంటూ వెళ్లిపోయాడు.

"నా పేరు కోటీశ్వర్రావు. ఉదయం రాఘవరావుగారు ఇనస్పెక్షన్ చేసిన కాలేజీ బిల్డింగ్ కంట్రాక్టర్‌ని నేనే. ఉదయం నేనూ అక్కడే వున్నాను. ఆయన తిన్నగా జీప్‌లో ఇంటికొచ్చేశారనుకుని ఇక్కడకు వచ్చాను. మీ కభ్యంతరం లేకపోతే ఆయనొచ్చే వరకూ కూర్చుంటాను" అన్నాడు కోటీశ్వర్రావు.

"మధ్యాహ్నం భోజన సమయం వరకూ రాకపోవచ్చు. లేదా కారియర్ పంపమని కబురుపెట్టి, ఆఫీసు వదలి సాయంత్రం వరకూ రాకపోవచ్చు. అయినా ఇప్పుడిప్పుడే కలుసుకుని మళ్ళీ ఇంతలోనే చూడవలసిన అవసరం ఎందుకో?" రాజేశ్వరి విసుగ్గా అంది.

మొగుడి కోసం అప్పుడప్పుడు కంట్రాక్టర్లూ వాళ్లూ ఇలా రావడం తనకేమీ కొత్త కాకపోయినా, మనసు బాగోలేకపోవడం మూలాన మాటల్ని కాస్త విసురుగా కూడా అంది.

కోటీశ్వర్రావుకి చిన్న అవకాశం దొరికింది.

"ఇంజనీరుగారి భార్య మీరు. మీకు తెలియందేముంది? ఆగ్రహానికి గురికాకుండా అనుగ్రహం సంపాదించుకోవడం కోసం మా తిప్పలు మేం పడాలికదమ్మా! అవసరమొస్తే ఎన్ని వందల సార్లయినా తిరగాలి మరి! మీరు రాఘవరావుగారికో ఫోనుచేసి అర్జంటుగా ఇంటికి రమ్మని పిలవండి. మీ మేలు మర్చిపోను" కోటీశ్వర్రావు చిరునవ్వుని దాచుకుంటూ అన్నాడు.

రాజేశ్వరికి కుతూహలం రేకెత్తింది. భర్త రావలిసిన జీతం కంటే ఎక్కువే సంపాదిస్తున్నాడని రాజేశ్వరికి తెలుసు. 'నీకేవమ్మా, బంగారు పిచికవి. మీ ఆయన రెండు చేతులా సంపాదిస్తున్నాడని ఇరుగుపొరుగు స్త్రీలన్నప్పుడు ఆ మాటల్లోని ఎత్తిపొడుపుని పక్కకు నెట్టి రాజేశ్వరి గర్వంగా చూసేది.

ఉదయం జరిగిన ఘర్షణ తర్వాత, భర్తకున్న నిజమైన ధనదాహం గుర్తించగలిగింది. అన్యాయంగా ఆర్జిస్తున్న డబ్బు చాలక, ఆరేళ్లు కాపురం చేసిన తర్వాత కూడా తన పట్ల అలా ప్రవర్తించడంతో రాజేశ్వరికి నిజంగానే ఒళ్లు మండింది.

సరే, భర్తతో ఈ కోటీశ్వర్రావుకున్న లావాదేవీల్ని గురించి కూపీ లాగితే, ముందు ముందు ఏదో విధంగా ఉపయోగపడవచ్చు. తెగతెంపులదాకా వస్తే, మొగుడి బండారం బయటపెట్టి పగ తీర్చుకోవచ్చు.

"సరే, హాల్లోకి వచ్చి కూర్చోండి. మరో పది నిముషాలు చూసి ఫోన్ చేస్తాను" అంది రాజేశ్వరి.

కోటీశ్వర్రావు గుమ్మంలోపల ఓ పక్కగా చెప్పులు విడిచి సోఫాలో కూర్చున్నాడు.

లోపలి గది గుమ్మంలో నిల్చుని కోటీశ్వర్రావునీ నిశితంగా పరిశీలిస్తూ, "చెప్పండి, వచ్చిన పనేమిటో?" అంది గంభీరంగా.

కోటీశ్వర్రావు ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు. తన అనుభవంలో లంచాలిచ్చి ఉద్యోగుల్ని కొనడం కొత్తేమీ కాదు. చాలామార్లు, ఆదేశానుసారం డబ్బుని ఉద్యోగులకి కాకుండా వాళ్ల భార్యలకీ, తల్లిదండ్రులకీ, అన్నదమ్ములకీ, ఇంకా దగ్గర స్నేహితులకీ అందజేసిన రోజులున్నాయి. కానీ భర్త తరపున బేరాలాడ్డం ఈ ఇంటి ఆనవాయితీ కాబోలు. ఈ ఇంజనీరు భార్య చాలా ఘటికురాల్లా వుంది. సరే, మునిగిపోయిందేమీ లేదు, అడుగుతోంది కాబట్టి చెప్పి చూద్దామని-

"ఇచ్చిపుచ్చుకోవడాలు మాకూ ఇంజనీర్లకీ కొత్త కాదు. ఈరోజు రాఘవరావు గారెందుకో చికాకుగా కనబడ్డారు. సైటు దగ్గర తీరిగ్గా మాట్లాడ్డానికి అవకాశం దొరకలేదు. ఆఫీసులో ఏకాంతంగా మాట్లాడ్డం కష్టం. రాఘవరావుగారికి మీరు ఫోను చెయ్యండి. మీకు థాంక్స్ చెప్పుకుంటాను" అన్నాడు.

రాజేశ్వరి మనస్సులో ఓ కొత్త ఆలోచన చోటుచేసుకుంది. దురాశా, స్వార్థాలు మనుషుల నెంతగానైనా దిగజారుస్తాయి. నాణ్యతలేని నాసిరకం పనిచేసి ఈ కంట్రాక్టరు సంఘాన్ని దోస్తున్నాడు. నోర్లు మూయడానికి జేబులు నింపుతున్నాడు. తన భర్త బింకమైన ప్రవర్తన పైపైకి మాత్రమే. ఒకవేళ ఈ ఉదయం జరిగిన ఘర్షణ మూలాన కంట్రాక్టరుతో చికాకుగా ప్రవర్తించి వుండొచ్చు.

ఏదిఏమైనా ఈ విషయంలో భర్త రాఘవరావు కోటీశ్వర్రావిచ్చే లంచానికి దాసోహమనక తప్పదు. పాపం ఎవరు చేసినా ఒకటే. మొగుడి కందబోయే డబ్బులోంచే తన కాపురం సవ్యంగా జరిగే సదుపాయం ఎందుకు చేసుకోకూడదు? కానీ ఎలా నరుక్కురావడం? ఆలోచించి నెమ్మదిగా అంది. చీకట్లోకి బాణం వదిలింది.

"కాలేజి భవన నిర్మాణం నాసిరకంగా జరుగుతోందని ఈయన ప్రతిరోజూ సణక్కుంటున్నారు. హైదరాబాద్ వాళ్లని బుట్టలో వేసుకుని ఇక్కడ వాళ్లకి మొండిచెయ్యి చూపించేటట్టున్నాడు, నా తడాఖా తెలియదని పళ్లు నూరుతున్నారు. తెలియకడుగుతున్నా, ఇంతకీ మీ కంట్రాక్టు

విలువెంత?"

రాజేశ్వరి ప్రశ్న విని కోటీశ్వర్రావు విస్తుపోయాడు. ఈ రాఘవరావు ఆఫీసు విషయాలన్నీ పెళ్ళానికి చెప్పి ఏడుస్తాడనుకుంటాను. భర్తకి వచ్చే పైసంపాదనలో ఈమె కీలకపాత్ర వహిస్తూవుండొచ్చు.

డొంకతిరుగుడు మాని తిన్నగానే మాట్లాడి చూద్దామని - "నలభై లక్షలు. మేమెంత నిజాయితీగా పనిచేసినప్పటికీ, లేని లొసుగులు చూపించి అజమాయిషీచేసే సూపర్‌వైజర్ల నుంచి హైదరాబాద్‌లో అధికారవర్గం వరకూ అంచెలంచెలుగా అందవలసింది అందజేస్తేనే గాని మాకు డబ్బివ్వడం జరగదు. దీనితో మాకొచ్చే లాభాలు మా కష్టానికి సరిపోవు. మీ ధోరణి చూస్తే మీ కన్ని విషయాలూ తెలుసుననే అనుకుంటున్నాను. దాపరికం ఎందుకు? ఇంకొకళ్ళకి వెళ్ళవలసిన కాంట్రాక్టుని నేనెగరేసుకుపోయానని రాఘవరావుగారికి కోపంగా వుంది. అందుకని ఇంటిదగ్గర తీరుబడిగా మాట్లాడదామని వచ్చాను" అన్నాడు.

"మీ మధ్య సన్నిహితం కనుక వుందుంటే మీరెంత ముట్టజెప్పేవారు?" రాజేశ్వరి సూటిగా అడిగేసింది.

"అయిదు శాతం చొప్పున రెండు లక్షలు. హైదరాబాద్‌లో మరో ఇంత! ఇదీకాక ఇంకో ఏభై అరవై వేల దాకా ఇతర ఖర్చులుంటాయి"

"మొదట్నుంచీ మీ కంట్రాక్టు విషయంలో అయనకు కోపంగా వుంది. ఆనవాయితీ ప్రకారం మీరాయనకి రెండు లక్షలూ ముట్టచెప్పడానికి ప్రయత్నించినా ఆయన చస్తే ఒప్పుకోరు! మాటల సందర్భంలో మీ దగ్గర్నుంచి కనీసం మూడు లక్షలైనా గుంజాలని అన్నారు. ఏమంటారు?" రాజేశ్వరి లౌక్యంగా అంది.

"చాలా నష్టపోతానమ్మా! నేను మీకు ముందే చెప్పానుగా, నా శ్రమకి ఫలితం దక్కదని!"

"మీరు బిగిసిపోతే మొదటికే మోసం రావచ్చు. రెండు లక్షలివ్వడానికి సిద్ధంగా వున్నట్లు మీ మాటల వల్ల తెలుస్తోంది. కానీ ఆయన మనస్సులో మూడంకె మెదుల్తోంది. కానీ, మీరు మరోవిధంగా చేస్తానంటే మీ కరవై వేలు ఆదా కలిగేటట్లు చూస్తాను!" అంది రాజేశ్వరి.

ఆ మాటలు కోటేశ్వర్రావుని తికమకపెట్టేశాయి.

"మీరనేదేమిటో వివరంగా చెబ్తేనే కాని, నా బుర్ర అర్థంచేసుకోలేదు."

"మా ఆయనకి తెలియకుండా నాకు నలభై వేలివ్వండి. ఇది ఆయన కోపం ఖరీదు. ఆ కోపాన్ని పోగొట్టి మీ మామూలు రెండు లక్షలకీ, వీలైతే అంతకంటే తక్కువకీ ఆయన్నొప్పించే బాధ్యత నాది!"

కోటీశ్వర్రావుకి మతిపోయింది. తనేప్పుడూ ఇటువంటి పరిస్థితిని ఎదుర్కోలేదు. అయినా నిలదొక్కుకుని అన్నాడు - "మీకు నలభై వేలిచ్చిన తర్వాత కూడా మీరాయన్ని ఒప్పించలేకపోతే నాకు మొదటికే మోసం వస్తుంది. మీ మాట నమ్మేదెలా?"

"అవినీతిపరులక్కూడా ఓ రకమైన మాట నిజాయితీ వుంటుందని విన్నాను. మీరు మరో

అరవై వేలెక్కువ కాదనుకుంటే, ఆయనతోటే మాట్లాడి మూడు లక్షలూ ఇచ్చుకోండి! నాకేం పోయింది" రాజేశ్వరి గడుసుదనం చూపిస్తూ అంది.

అసలు వీళ్లిద్దరికీ ఇదలవాటేనేమో? తనక్కూడా మనస్సులో మూడు వరకూ ముట్టచెప్తేకానీ ఈ ఘటం కదల్దేమోనని ముందునుంచీ అనుమానంగానే వుంది. అందుచేత రెండూ నలభై అంటే పర్వాలేదు.

"మీరొప్పించండి, మీరన్నట్టుగా చేస్తాను" అన్నాడు కోటీశ్వర్రావు.

"అలా కుదరదు. ముందుగా నాకు నలభై వేలూ, ఓ గంట గడువూ ఇవ్వండి. ఆయన్ని దారికి తీసుకొచ్చే బాధ్యత నాది. మీరు తర్వాత ఈ రోజులో ఎప్పుడైనా ఆయన్ని కలిసి వ్యవహారం ముగించుకోండి. కానీ పొరపాటున కూడా ఈ నలభై వేల సంగతీ మీరెత్తకూడదు!"

కోటీశ్వర్రావుకున్నట్టుండి ఏదో అనుమానం వేసింది. భార్యాభర్తలిద్దరూ కలిసి ఆడుతున్న నాటకమా, లేక భర్తకు తెలియకుండా ఆడుతున్న నాటకమా? రాజేశ్వరి ముఖంలోకి చూశాడు. ఆమె కళ్ళవెనుకనేదో బాధ లీలామాత్రంగా కన్పించింది.

కోటీశ్వర్రావు సూటిగా అడిగేయదల్చుకున్నాడు.

"మీరు చిత్రంగా మాట్లాడుతున్నారు. ఉద్యోగరీత్యా మనిషి ఎటువంటి అవినీతికి పాల్పడ్డా, అయినింటి ఆడమనిషి మీరిలా ప్రవర్తించడం నాకు వింతగా వుంది. మీకొచ్చిన అవసరం ఏమిటో చెప్తే నాకు చేతనైన సహాయం చేస్తాను" అన్నాడు.

రాజేశ్వరికొక్కసారిగా ఏడుపొచ్చేసింది. చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంటూ, వచ్చే ఏడుపునాపుకుంటూ గాద్గదికంగా అంది.

"మీరు నలభై వేలిస్తే నా వాళ్ల దృష్టిలో దిగజారకుండా, నా కాపురం నిలబెట్టుకోగలుగుతాను. పూర్వంలో నా పెళ్లి కరవైవేలే కట్నం ఇచ్చి, ఇప్పుడు చెల్లిపెళ్ళికి లక్ష కట్నం ఇస్తోన్నందుకు, ఈయన అహం దెబ్బతిని, కోపం వచ్చి నన్ను వదిలేస్తానంటున్నారు.!"

ఎంత బాధపడకపోతే ఇంతటి తెగువ చేసింది. తండ్రినాడబ్బుడిగి కాపురం నిబెట్టుకోడానికి ఆత్మాభిమానం అడ్డొచ్చి, ఈ అవకాశాన్ని ఇలా వాడుకోదలచింది. ఇందులోనూ ఆత్మాభిమానం కోల్పోయిందని ఆమె గ్రహించిందో లేదో? గ్రహించిందని ఆ కన్నీళ్ళే చెబ్తున్నాయి. అయినా తన జాగ్రత్తలో తనుండాలి.

"నేను మీ ఇంటికి రాకపోతే మీరేం చేసేవారు? ఇప్పుడు మీరు నిజం చెప్పేశారు కాబట్టి, నేనొప్పుకోకపోతే?" కోటీశ్వర్రావు ప్రశ్నించాడు.

"ఏంచేసేదాన్ని? అందర్నీ కడుపులో దాచుకునే గోదావరి దగ్గరుండగా ఇంకేంచేస్తాను?" రాజేశ్వరి గుమ్మం మీద చతికిలపడిపోతూ అంది.

కోటీశ్వర్రావు కాళ్ళకి బంధం పడిపోయింది. మరోసారి మనసులో లెక్కలు వేసుకున్నాడు. తనెలాగూ మూడుకి సిద్ధంగా వున్నాడు. ఓ నలభై వేలు పక్కకి పోయినా మొత్తం మీద రెండూ నలభైకి పని జరిగిపోతుంది. ఒకవిధంగా ఈ అమ్మాయి కాపురం నిలబెడితే, ఆ సహాయం

ముందుముందు తనకి ఉపయోగపడొచ్చు. ఇందుకని తను అదనంగా నష్టపోయేదేమి లేదు.

అయినా బెట్టు చూపుతూ, అనుమానం నటిస్తూ అన్నాడు – "మీ మీద జాలికొద్దీ అనండి, నా స్వార్థమనండి, మీరడిగిన డబ్బిస్తాను. కానీ వ్యవహారం జరక్కపోతే?

"మా నాన్నతో మాట్లాడి ఆయన్ని నలభై వేలూ ఇవ్వడానికొప్పించానని మా ఆయనతో చెప్తాను. దాంతో ఆయన మూడ్ తిరిగివస్తుంది. నేను మీ విషయం లౌక్యంగా ప్రస్తావించి, ఉన్న రేటు కంటే ఎక్కువడిగితే మొదటికే మోసం రావచ్చని బెదురు పుట్టించి ఆయన్ని ఒప్పిస్తాను. ఆయన ఒప్పుకోక తప్పదు!"

"అదీ మీ అభిప్రాయమేకానీ, ఆయన ఒప్పుకుంటాడన్న నమ్మకమేమిటి? మీ ఇంటి వ్యవహారం కుదుటబడొచ్చుకానీ, నా వ్యవహారం మట్టుకు కుంటిగానే వుండిపోవచ్చు"

"ఒకటీ అయిదుతో మొదలు పెట్టి రెండు వరకూ వెళ్ళండి. రెండుతో పని జరక్కపోతే, కొసరుగా ఓ ఫిగర్‌ని తీసుకొచ్చి పక్కలో పడవేయండి. ఈ విషయంలో ఆయనకి యావ తప్ప ధైర్యం లేదు. అయితే తన ప్రయత్నం లేకుండా, తను నోరువిప్పి అడగకుండా అవకాశం వస్తే మట్టుకు వదిలే రకం కాదు! మీకు వీలుగా వుండేటట్లు ఈ మధ్యాహ్నమే బయలుదేరి మా ఊరెళ్తాను!"

'ఈమెకి పిచ్చికాని ఎక్కలేదు కదా?! కావాలని తన జీవితం మరింత నరకం చేసుకోబోతోంది!' అనుకుంటూ, "మీరన్నిటికీ తెగించినట్లు కనబడ్తున్నారు. లేని అలవాట్లు చేస్తే మీకే నష్టం కలగవచ్చు!" అన్నాడు కోటీశ్వర్రావు.

"వైవాహిక జీవితాన్ని డబ్బుతో తూచే ఆయనంటే, నా కిప్పుడు సదభిప్రాయంలేదు. నా కాపురాన్ని నిలబెట్టుకోవడం కోసం అన్నప్పుడు సంఘాన్ని దృష్టిలో పెట్టుకుని అన్నాను. నా తల్లిదండ్రుల్నీ, నా కన్నకూతుర్నీ దృష్టిలో వుంచుకుని అన్నాను కానీ, ఈయనతో దాంపత్యజీవితమే నా పరమావధి అని మట్టుకు కాదు!"

రాజేశ్వరి మాటలకి కోటీశ్వర్రావుకి నిజంగానే మతిపోయింది.

సరే, ఇదీ తమాషాగానే వుంది. అయినా అందరి కష్టసుఖాలూ ఆలోచిస్తూ కూర్చుంటే పన్లు జరగవు. ఒకరికి నోట్లు పెరుగుతోంటే, మరొకరికి నోట్లో మన్ను పడక మానదు. ఒక లాభం కోసం ఆలోచించే వ్యక్తి మరోరకమైన నష్టానికి సిద్ధపడక తప్పదు. రాఘవరావు భార్య ప్రస్తుతానికీ దారి ఎన్నుకుంది. దానివల్ల ఆమె వ్యక్తిగత జీవితంలో వచ్చే మార్పులకి తను బాధ్యుడు కాబోడు.

బ్రీఫ్‌కేస్ తెరచి, నాలుగు వంద రూపాయల కట్టలు రాజేశ్వరి పక్కగా వెళ్లి వుంచాడు. బ్రీఫ్‌కేస్ మూసి, చేత్తో పట్టుకుని కోటీశ్వర్రావు మరి మాట్లాడకుండా బయటకు దారి తీశాడు.

తన కళ్ళను తానే నమ్మలేని స్థితిలో, రాజేశ్వరి నోట్ల కట్టల్ని తీసుకుని లోపలికి పోయి, తను ప్రయాణానికి సిద్ధంచేసుకున్న సూట్‌కేసులో బట్టల అడుగున దాచింది.

❁ ❁ ❁

మొగుడు రామకోటి కాలేజీకి వెళ్ళిపోవడంతో, నీలవేణి మనసు కోటి బుసలు కొట్టింది. అరగంట తర్వాత స్నానం చెయ్యకుండానే వంటగదిలోకి వెళ్లి, గిన్నెల్నీ, పళ్ళాల్నీ కావాలని ఎత్తిపడేస్తూ, శబ్దాలు చేస్తూ వంటకుపక్రమించింది.

ఆమె కోపాన్ని వ్యక్తపరుస్తున్న ఆ శబ్దాల్నర్థం చేసుకోలేని మూర్ఖురాలు కాదు రామకోటి తల్లి మాణిక్యాంబ. జ్వరంతో వున్న పెద్దకోడలు వంటింట్లోకి వెళ్ళబోతే వద్దని సైగ చేసింది. మంచికో చెడుకో రామకోటి నీలవేణిని గద్దించి వెళ్ళడంతో ఆమె వెంటనే జోక్యం కలుగజేసుకోలేదు.

"అన్నీ వండి బల్ల మీద సర్దాను. ఎవరిక్కావల్సినప్పుడు వారు వడ్డించుకు తినవచ్చు" అని జనాంతికంగా మాటలు గట్టిగా వదలి తన గదిలోకి వెళ్ళబోతుండగా, "గదిలోకి వెళ్ళబోయే ముందు కాస్త గేటు దగ్గర నిల్చుని, గిన్నెలకి సొట్టలు తీసేవాడెవడైనా వస్తే చూడు!" అంది మాణిక్యాంబ నవ్వుతూ.

నీలవేణి కోపం ఓ పక్క ముద్దు కలిగిస్తోంటే సరదాకంది కానీ, ద్వేషభావంతో మట్టుకు కాదు. అయితే రామకోటి అన్నట్లుగా నీలవేణి తమలో ఒకరిగా కాలేనందుకు కొద్దిగా బాధపడిన మాట వాస్తవం.

ఉదయమే భోజనం చేసి కోర్టుకి వెళ్ళే రామకోటి అన్న తారకం, అవుట్‌హౌస్ ఆఫీసుగది లోంచి, కూతురు భోజనానికి పిలిస్తే వచ్చాడు. ఉదయం తాగిన కాఫీని తలుచుకుంటూ, బల్లముందు కూర్చుని బోర్లించిన కంచాన్ని తిప్పి వడ్డించుకున్నాడు. ఏవీ నోట్లోకి వెళ్ళలేదు. రెండు గరిటల పెరుగు కాసింత అన్నంలో కలుపుకుని తిని, స్కూటర్ మీద అంబాజీపేట వెళ్ళాడు.

మరి కాస్సేపట్లో "మామ్మా అన్నం పెట్టవా, అమ్మ మూలుగుతూ పడుకుంది. స్కూలుకి వెళ్ళాలి" అన్న మనవరాలి మాటలు విని, నడవలో మంచం మీద నుంచి లేచి కుంటుకుంటూ వెళ్ళి, మనవరాలికి వడ్డించింది. వడ్డిస్తూ కొడుకు తిని వదిలిన కంచం వైపు చూసింది.

అంతలోనే, "మామ్మా! ఈ వంట అస్సలు బాగోలేదు. నేను తినలేను!" అంది మనవరాలు, బల్లదగ్గర్నుంచి లేచిపోతూ.

మాణిక్యాంబ అన్నింటిని కాస్త కాస్త నోట్లో వేసుకుని చూసి చిన్నగా నవ్వుకుంది.

"అలా ఆకలితో స్కూల్‌కి వెళ్తే నీరసం వస్తుంది. అమ్మనడిగి డబ్బులు తీసుకుని దార్లో ఇడ్లీలో, పెసరట్టో హోటల్లో తినిపో" అంది.

తలుపు వెనకనుంచి పాము చెవుల్తో వింటున్న నీలవేణి తలుపు తీసుకుని బయటకు వచ్చింది.

"ఆ విసుర్లన్నీ నామీదే ననుకుంటాను!" అంది హేళనగా.

"ఆ బల్ల మీదున్న కంచాల్ని చూడు, నీ వంటెలా అఘోరించిందో తెలుస్తుంది!" అంది మాణిక్యాంబ.

"అక్కగారి వంటకలవాటుపడ్డవాళ్ళకి నా వంటెలా సహిస్తుంది. మీ రెండో కొడుకు

బలవంతంగా నాచేత పన్లు చేయిస్తే చేస్తా కానీ, నేను చేసిన పన్లూ, వంటలూ మీ కందరికీ నచ్చాలని లేదుగా!" అంది రోషంగా.

మాణిక్యాంబకి సహనం చచ్చింది.

"ఆ మాటలు నువ్వు వండిన వాటిని నోట్లో వేసుకుని మాట్లాడివుంటే అలాగే అనుకునేదాన్ని. అన్నం జావలా కారుతోంది. పప్పు ఉడకలేదు కదా, పైగా ఉప్పు కషాయం. కూరంతా గొడ్డుకారం. చారు భయంకరమైన పులుపుగా వుంది. సరే, నీ చేతివంట నీ మొగుడి కెంత ఇష్టంగా వుంటుందో అదీ చూద్దాం, వాటిని తీసుకొనివెళ్లి ఫ్రిజ్‌లో పెట్టు" అంది.

నీలవేణి ఏదో అనబోయి ఆగిపోయింది.

మాణిక్యాంబ ఊరుకోదల్చలేదు.

"నువ్వు వంట రాక ఇలా చేశావంటే, పెళ్లికి ముందు నీ తల్లీ, తర్వాత నేనూ నీకు తర్ఫీదునివ్వకపోవడం నేరం. కానీ కావాలనే నువ్విలా చేస్తే అంతకంటే ఘోరమూ, నేరమూ మరొహటి లేదు. నిజానికి నా కాలు బెణకడం, నీ తోడికోడలుకి జ్వరం రావడం ఒకందుకు మంచిదే అయింది. లేకపోతే నీ మనసులోని మాట తెలియడానికి చాలాకాలం పట్టేది.

"సంఘంలో సహజీవన సామరస్యం ఎంతగా అవసరమో, తలుపుల వెనుక స్త్రీ పురుషుల శృంగార జీవితంలో కూడా అంతే అవసరం. స్త్రీ పురుషులొకరికొకరు లొంగి వుండడమనే దాంట్లో, ఎంత కాదనుకున్నా శృంగార జీవితమే మూలకారణమవుతుంది. అయితే నలుగురి మధ్యా వుండడంవల్ల ఆ శృంగార జీవితంలో కొన్ని హద్దులేర్పడతాయి. సమష్ఠి కుటుంబంలో స్వేచ్ఛ వుండదు. నీకు వేరు కాపురం పెట్టుకోవాలన్న ఆలోచనలో తప్పేమీ లేదు. సాయంత్రం రామకోటి రాగానే వేరే ఇల్లు చూడమని చెబ్తాను. నువ్వు బెంగపెట్టుకోవద్దు.

"నేనీరోజు ఓ విషయం గుర్తించగలిగాను. అనవాయితీగా తీసుకున్నా, అవసరముండి తీసుకున్నా, ఇవ్వగలిగినవారు అడక్కుండా ఇచ్చినా, ఇవ్వలేని వాళ్ల దగ్గర్నుండి నిర్దాక్షిణ్యంగా తీసుకున్నా, కట్నమనేది మగవాడి వ్యక్తిత్వాన్నీ, అతను పుట్టి పెరిగిని కుటుంబం సంస్కారాన్నీ తీవ్రంగా దెబ్బతీస్తుందని.

"మరోమాట! నీకు నిజంగా వంట చేతకాకపోతే వేరు కాపురం పెట్టేలోగా, నా దగ్గరో నీ తోడికోడలు దగ్గరో నేర్చుకో. ఎందుకిలా అంటున్నానంటే, దానికి రెండు కారణాలు. ఒకటి రామకోటి నా కొడుకు. వాడికి సరైన తిండి లేకపోతే నా మనసు బాధపడ్తుంది. రెండవది అతిథులూ, అభ్యాగతులూ తిని, 'బాగున్నాయన్న' మెచ్చుకోలు మాటలు మొహమాటానికన్నవిగా వుండకూడదు. నిజంగానే అనాలి"

నీలవేణి అత్తగారి కటువు మాటల్ని చేదుమాత్రల్లా మ్రింగింది. ఆవిడంత ముక్కుసూటిగా మాట్లాడ్డం ఇదే మొదటిసారి. ఈరోజు లేచిన తర్వాత ఇది రెండోసారి ఖంగుతినడం. అయినా అత్తగారు వేరు కాపురం పెట్టిస్తాననడంతో, అంతరాంతరాల్లో ఆనందపుటలలు లేచాయి.

"ఆవేశంలో ఏదో అలా చేశాను. మీరు పడుకోండి. మళ్ళీ వంట చేస్తాను" అంది.

డైనింగ్ టేబుల్ మీది పదార్థాల్ని ఒక్కటొక్కటీ తీసుకువెళ్ళి, పెరట్లో పెంటకుప్ప మీద

పడేసింది. ఆనందపుటలలతో బాటు, ఎగిసివస్తున్న అవమానపు జ్వాలల్ని కూడా అదుపులో పెట్టుకుని మామూలుగా కనబడ్డానికి నీలవేణికి విశ్వప్రయత్నమే చేయవలసి వచ్చింది.

• • •

డాబాగది చేరుకున్న రాజారావు, అలవాటు ప్రకారం గుమ్మం పక్కనున్న దీపంగూడులో చెయ్యి పెట్టాడు. తాళం దొరకలేదు. తలెత్తి గొళ్ళెం వైపు చూశాడు. తాళం కప్పలేదు. గొళ్ళెం తీసి వుంది. కారియర్ తెచ్చే రాములమ్మ తాళం వెయ్యడం మరచిపోయిందేమోననుకుంటూ, తలుపులు తోసి లోపలికి అడుగుపెడ్తూనే స్థాణువులా నిలబడిపోయాడు.

మంచం ముందు బల్ల వేసుకుని, కారియర్ గిన్నెల్లోంచి గాజుప్లేట్లో పదార్థాలు వడ్డించుకుంటున్న ఆమెని చూసి ఆశ్చర్యపోతూ, మరో అడుగు ముందరకు వేశాడు కష్టంగా. పమిటజారి కనబడ్తున్న ఎత్తుల సొంపుతో కన్ను చెదిరి అదిరిపోయాడు.

"మీరు, మీరు..." రాజారావుకి మరి మాటలు పెగల్లేదు.

"అవును, నేనే పక్కింటి శేషగిరి భార్యని. నువ్వు కాలేజీలో ఏం చదువుతున్నావో, మా ఆయన నీ క్లాసులు తీసుకుంటాడో లేదో నాకు తెలియదుకానీ, నేనాయన భార్యనని నీకు మట్టుకు తెలుసు! అవునా కాదా?" పార్వతి కొంటెగా ప్రశ్నించింది.

జారిన పమిట సర్దుకోలేదు. కొంటెగా మాట్లాడుతోంది. రాజారావు హృదయంలో ఓ శృంగార తరంగం లేచింది. ఊహలతో నలిగిపోయే మనసుకీ, తాపంతో దహించే శరీరానికీ కొద్ది ఘడియల్లో శాంతి లభించనుందేమో? యవ్వనప్రాంగణంలో ఎప్పుడో అడుగు పెట్టిన తనకు విద్యార్థిగానే అదృష్టం దొరకబోతోందేమో?

"తెలుసును. తెలియకుండా ఎలా వుంటుంది!" రాజారావు ధైర్యం కూడదీసుకుని అన్నాడు.

"నేనెవర్ని మట్టుకో తెలుసా, లేక ఇంకా వివరాలు తెలుసా? నా పేరు?" - పార్వతి చిలిపిగా నవ్వుతూ అంది.

"మీ పేరు పార్వతి" రాజారావు భుజాన్నున్న సంచీ తీసి పక్కనే వున్న గూట్లో పెడ్తూ అన్నాడు.

"ఎలా తెలుసు?" అప్పటివరకు ముందుకు వంగి మాట్లాడుతున్న పార్వతి, వెనక్కి వంగి చేతుల మీద ఆనుకుంటూ అడిగింది.

ఎగిసిన ఎత్తుల్ని చూసి రాజారావులో ఉద్రేకం పొంగిపొరలసాగింది. అప్పుడప్పుడూ శేషగిరి గొంతెత్తి పిలిచిన పిలుపుల వల్ల పేరు తెలుసు. అలా చెప్పేస్తే చప్పగా వుంటుంది. రాజారావు సినిమా డైలాగు వదిలాడు.

"తోటలో వున్న అందమైన గులాబీ పేరు తెలియకుండా ఎలా వుంటుంది?!"

"ఏదో అనుకున్నానుకానీ తెలివైనవాడివే! ఇంకా నాగురించి ఏం తెలుసును?"

"ఇంకేం తెలుస్తుంది. మీరందమైనవారని తెలుసు. అంతకంటే ఇంకేం తెలుస్తుంది? ఎలా తెలుస్తుంది?" రాజారావులో బెదురు ఎప్పుడో పోయింది. కొంటెగా అన్నాడు.

పార్వతి మనస్సులో ఒక్కసారిగా తను తప్పుచేసి దిగజారిపోతున్నానేమో అనిపించింది. అయినా తను గడుపుతున్న హీనపరిస్థితి నుంచి బయటపడ్డానికిదొక్కటే మార్గం అనుకుని, పాపశంకని మూలకి నెట్టి, "అందమైన గులాబీనంటున్నావు. గులాబీ కిందనున్న ముళ్ళ సంగతి నాలోచించావా?"

"గులాబీ ముళ్ళు గుచ్చుకుంటున్నా ఆనందంగా వుంటుంది!"

"అది నీ దృక్పథంలో. కానీ ఈ గులాబీ నిజంగా ముళ్ల మీద జీవితం గడుపుతోంది" అంది పార్వతి. ఆమె గొంతులో చిన్నగా జీర.

"అంటే?" రాజారావు అయోమయంగా అడిగాడు.

"తిండి తిని రెండు రోజులైంది. వారంలో ఒకటి రెండుసార్లిలా పస్తులు పడవలసి వస్తోంది. ధనదాహంతో, పిసినారితనంతో నానా క్షోభలూ పెడ్తున్నాడు. పడుపు వృత్తి సాగించడం నా ధ్యేయం కాదు కానీ, నీ కవసరమొచ్చినప్పుడల్లా ఈ గులాబీని ధరకు కొనుక్కుంటావా?"- కళ్ళమ్మట నీళ్ళు గంగలా పొంగుతుండగా పార్వతి అన్న మాటలు విని రాజారావు ఒక్క క్షణం చలించకపోలేదు.

ఆ కన్నీళ్ళ పార్వతి రాజారావు హృదయంలో మరింత అందంగా చోటుచేసుకుంది. కోరికలు చెలరేగిన మనస్సుని కూడదీసుకుని, ఆమె పొందుని కోరే దేహాన్ని అధీనంలో వుంచుకుని, ఆమెనో వ్యక్తిగా పరిగణించి సహాయం చేసి, తన్ను తాను ఆత్మవంచన చేసుకోదలచుకోలేదు రాజారావు.

ఆమె మీద తనకు బలీయమైన కోర్కె ఏర్పడింది. అదీ ఆమె ప్రవర్తన వల్ల. కావాలని ఆమె చేసిన ధైర్యం మూలాన. ఆమె పతనానికి తాను కారకుడు కాబోడు.

తనకి డబ్బు లోటు లేదు. ఇక్కడ పెళ్లి ప్రసక్తి లేదు. వచ్చిన అవకాశం వదల్చుకోదలచుకోలేదు రాజారావు.

నిశ్శబ్దంగా తలుపులు దగ్గరగా వేసి, గడియ పెట్టి, మంచం దగ్గరకు వెళ్లి పక్కగా కూర్చుని పార్వతి భుజాల మీద చేతులు వేశాడు రాజారావు.

"ఒక్క క్షణం ఆగు! నా అదృష్టమో ఏమో కానీ, ఇంతవరకూ నేను తల్లిని కాలేదు. ప్రస్తుతం నేనెవరి జీవాలకీ రూపునిచ్చి తల్లి కావడానికి సిద్ధంగా లేను. ఎర్రత్రికోణం ప్రకటనల సంగతి నీకు తెలియంది కాదు! పోయి కొనుక్కునిరా! ఈలోపుగా కాస్త అన్నం తిని నా ఆకలి తీర్చుకుంటాను. తర్వాత నీ ఆకలి తీరుస్తాను"

పార్వతి అంత ధైర్యంగా అన్న మాటలు విని రాజారావు నిజంగానే వెర్రివాడైపోయాడు. కదలకుండా అలానే భుజం మీద చేయి వేసిన రాజారావుని పక్కగా తిరిగి, గట్టిగా కౌగలించుకుంది. ఆ స్పర్శ, ఆ అనుభూతీ రాజారావుని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

పార్వతి దూరంగా జరుగుతూ, "రుజువు చూపించానుగా. నువ్వు బయటకు వెళ్ళి వచ్చేలోగా నా ఆకలి తీర్చుకుని పారిపోతానని భయంగా వుంటే గది బయట గొళ్లెం పెట్టి మరీ వెళ్ళు. నా

కష్యంతరం లేదు!" పార్వతి కవ్విస్తూ అంది.

రాజారావు అతికష్టంమీద లేచివెళ్లి తలుపులు తీసి బయటకు పోయి, తలుపుల్ని దగ్గరగా మట్టుకు వేసి, మెట్లు దిగి, స్కూటర్ తీసుకుని మందుల షాపుకి వెళ్ళాడు.

'ఇంత ఉదయం పూట కాలేజీ విద్యార్థికి దీని అవసరం ఎందుకు వచ్చిందా?' అని షాపు వాడనుకుంటాడేమోనని అనుకున్నా, ధైర్యంగా పది రూపాయల కాయితం కౌంటర్ మీద పెట్టి అడిగాడు.

"రూపాయి సరుక్కి పది రూపాయల కాయితమిస్తే ఎలా? చిల్లర లేదు" షాపువాడన్నాడు.

"ఈ చిల్లర లేదని ప్రతిచోటా గొడవే! ఉండీ బిగుసుకుపోతే మీ వ్యాపారాలెలా సాగుతాయి?"

రాజారావు మాటలు వినకుండా, కౌంటర్ చివరికి పోయాడు షాపువాడు కొత్తగా వచ్చిన వ్యక్తి వైపు.

రాజారావు తల తిప్పి చూశాడు. ఫైనల్ ఇయర్ బి.ఎ. చదువుతున్న కృష్ణవేణి బేగ్ తీసి రూపాయి కాసు బల్ల మీద పెట్టింది. షాపతనిచ్చిన పేకెట్ బేగ్‌లో వేసుకుని వెళ్లిపోయింది.

ఇద్దరి మధ్యా ఒక్కమాట కూడా లేదు! షాపతను మళ్లీ రాజారావు దగ్గరకొచ్చాడు.

"చిల్లర లేదని చెప్పానుగా. ఉదయం పూట. ఇంకా బేరాలొస్తే కానీ చిల్లర రాదు. రూపాయుంటే ఇవ్వండి!" అన్నాడు.

"ఇప్పుడొచ్చిన అమ్మాయికి నువ్విచ్చింది అదేనా?" రాజారావు కుతూహలంగా ప్రశ్నించాడు.

"ఏం కాలం వచ్చిపడిందో కానీ, ఈ కాలం విద్యార్థులకి నీతినియమాలు లేకుండా పోతున్నాయి. అయినా మీ నీతినియమాలోచిస్తూ కూర్చుంటే మా వ్యాపారాలెలా సాగుతాయి. నిజంగా ఛిల్లర లేదు. కావాలంటే పదిపేకెట్లు తీసుకోండి. లేదా పది రూపాయలు ధర చేసే ఇంపోర్టెడ్ సరుకుంది. ఇమ్మంటారా?"

రాజారావప్పటికే కాలయాపన చేశాడు. "సరే, ఇంపోర్టెడ్ సరుకివ్వు" అన్నాడు.

షాపతను కౌంటర్ బల్ల కింద అరలో చెయ్యిపెట్టి ఓ పేకెట్ తీసి ఇచ్చాడు.

"అయిదుంటాయి పంచరంగుల్లో!" అంటూ పది రూపాయల కాయితం తీసి సొరుగులో పడేశాడు.

రాజారావు పేకెట్ పాంట్ జేబులో వేసుకుని, స్కూటర్ స్టార్ట్ చేశాడు. తను వెళ్ళేలోగా మనసు మార్చుకుని వెళ్లిపోతుందేమో పార్వతి, అన్న అనుమానం పీడిస్తుండగా గది చేరుకుని తలుపు తోశాడు.

కారియర్, తిన్న అన్నం ప్లేటూ వున్న బల్ల పక్కకు జరిగివుంది. పక్కమీద పడుకున్న పార్వతి చేతులు చాచింది.

తలుపు గడియ వేసి ముందుకు అడుగు వేశాడు. రాజారావుకి తొలి అనుభవం రాత్రి కాదు పగలే లభించింది. దాంతో బ్రహ్మచారులకుండే భ్రాంతి కూడా తీరిపోయింది.

❖ ❖ ❖

కోటీశ్వర్రావుకి కంగారుగా వుంది, రాఘవరావు విషయం త్వరగా తేల్చుకోవాలని తన మీద ఒత్తిడి తీసుకుని రావడానికి ప్రిన్సిపాల్‌గారిని లౌక్యంగా కావాలని తీసుకునివచ్చి వుంటాడు. ఉత్తరం రావడం అదీ ఉత్తిదే అయ్యుంటుంది. కంట్రాక్టు తనకు రావడంలో ఇప్పటికే హైదరాబాద్‌లో చాలా ఇచ్చుకోవలసివచ్చింది.

రాఘవరావు భార్య ఈపాటికి ఫోను చేసుంటే, ఈయనగారు మావగారిమీద చికాకు మరిచిపోయి, కనీసం తనతో మాట్లాడ్డానికి సుముఖంగా వుండొచ్చు. ఆఫీసులో కలవడానికి ప్రయత్నిద్దాం అనుకుంటూ కోటీశ్వర్రావు కొండంత ధైర్యం పుంజుకుని రాఘవరావు ఆఫీసుకి వెళ్లాడు.

ఇద్దరు ముగ్గురు అసిస్టెంట్ ఇంజనీర్లు కోటీశ్వర్రావుని చూసి మందహాసం చేసి, రాఘవరావు గది గుమ్మం మీద వెలుగుతున్న ఎర్ర దీపాన్ని చూపించారు.

రాఘవరావు డవాలీ బంట్రోతు బాబూరావు కారిడార్‌లో వున్న ఓ సోఫాలో కోటీశ్వర్రావుని కూర్చోబెడుతూ, "కాఫీ తెచ్చేదా సామీ" అన్నాడు.

"కాఫీకేమీ కంగారులేదుకానీ, మీ అయ్యగారితో ఎవరున్నారు?" కోటీశ్వర్రావు ప్రశ్నించాడు.

"లోపల ఎవరూ లేరు సార్! ఉదయం నుంచీ విసుగ్గా, చికాగ్గా వున్నారు. హైదరాబాద్ ట్రంక్‌కాల్ బుక్‌చేసి, ఎర్ర దీపం వెలిగించుకుని గదిలో కూర్చున్నారు.!"

"నువ్వు లోపలికి వెళ్ళి నేను వచ్చానని ఓ మాట చెవిని పడేసిరా"

"అయ్యబాబోయ్! అయ్యగారు మండిపడ్తారు" అన్నాడు బాబూరావు.

"చేతులు చాపేటప్పుడు వచ్చే ధైర్యం నీ కిటువంటప్పుడుండదా అబ్బీ! నోరు మూసుకుని, లోపలికి వెళ్ళి చెప్పిరా!" కోటీశ్వర్రావు గద్దిస్తూ అన్నాడు.

అప్పటికే అడపాదడపా కోటీశ్వర్రావు సొమ్ము రుచిచూసిన బాబురావుకి, కోటీశ్వర్రావు కెదురుచెప్పే ధైర్యం లేకపోయింది. నెమ్మదిగా గది తలుపు తోసుకుని లోపల అడుగు పెట్టాడు.

కుర్చీలో కూర్చుని కాస్త జార్లబడి సీలింగ్‌కేసి చూస్తున్న రాఘవరావు, బంట్రోతు బాబురావు లోపల ప్రవేశించడం గమనించి, "సూపర్‌వైజర్ చింతామణి వచ్చాడా?" అని అడిగాడు.

"ఆయనింకా రాలేదుకానీ, కోటీశ్వర్రావుగారు మిమ్మల్ని కలుసుకోవాలని బయట కూర్చున్నారు" అన్నాడు నెమ్మదిగా, సన్నాయినొక్కులు నొక్కుతూ.

ఎంత బింకంగా ప్రవర్తించినా ఇటువంటి విషయాల్లో ఒకరి నాడి మరొకరికి కొద్దిగా తెలుస్తుంది. హైదరాబాద్‌లో తన కొలీగ్ పరాంకుశంతో మాట్లాడి కాని, తను కోటీశ్వర్రావుతో డైరెక్టుగా మాట్లాడ్డం ఇష్టంలేదు రాఘవరావుకి. అందుకనే ట్రంక్‌కాల్ బుక్‌చేసి ఎదురు చూస్తున్నాడు.

"ఇప్పుడు నాకు తీరుబడి లేదు. ఓ గంట పోయిన తర్వాత ఇంటికి పోయి మధ్యాహ్నం వస్తాను. మధ్యాహ్నం కానీ, రేపు కానీ వచ్చి చూడమను. అన్నట్టు ఇంట్లో కూరలైపోయాయను కుంటాను. మార్కెట్‌కి పోయి ఏవైనా కూరలు కొని ఇంట్లో ఇవ్వు" అని ఓ ఏభై రూపాయల

నోటు బాబూరావు చేతికిచ్చాడు.

బాబూరావు తలుపు తోసుకొని బయటకు వెళ్ళి తలుపు మళ్ళీ దగ్గరగా వేసేటంతలో టెలిఫోను మోగింది. హైదరాబాద్ నుంచేమోనని ఆత్రుతగా అందుకున్నాడు. అవతలి వైపు నుంచి రాజేశ్వరి మాటలు విని చికాగ్గా, "ఎందుకు?" అన్నాడు.

"ఇప్పుడే అన్నయ్య టెలిఫోన్‌లో మాట్లాడాడు, పెళ్ళికి ముందుగా మిమ్మల్ని రమ్మని పిలవడానికి మీరింట్లో లేరు, ఆఫీసుకి వెళ్లారని చెప్పాను"

"అయితే?"

"ఇంక దాచడమెందుకని, నాకున్న అభిమానాన్ని చంపుకుని, మీరడిగినట్లుగా కాకుండా, నేనలిగినట్లుగా మాట్లాడాను. దానికన్నయ్య ఏమన్నాడో తెలుసా?"

"ఏమన్నాడు?"

"అసలు వాళ్ళకే ఈ ఉద్దేశ్యం కడుపులో ఎప్పట్నుంచో వుందిట! కానీ పెళ్ళయిన ఇన్నేళ్ళకి మీ కదనంగా మరో నలభై వేలిస్తే, మిమ్మల్ని కించపరిచినట్లవుతుందేమోనని భయపడి ఊరుకున్నారుట! మనిద్దర్నీ ముందుగా రమ్మని మరీమరీ చెప్పాడు. ఒకవేళ మీకు ముందుగా వీలుకాకపోతే, కనీసం నన్నయినా ముందుగా రమ్మన్నారు. ఒకవేళ వాళ్ళు మీ ఆఫీసుకి టెలిఫోన్ చేస్తే డబ్బు విషయం గురించి ఏమీ మాట్లాడకండి. వాళ్లిస్తామన్నారు కాబట్టి ఆ విషయం నేను చూసుకుంటాను. ఏమంటారు?" అవతలి పక్కనుంచి టెలిఫోన్‌లో మాట్లాడుతున్న రాజేశ్వరి ఎదురుగా లేక కానీ, ఆమె ఎంత కసితో, అసహ్యంతో ఈ మాటలందో రాఘవరావు గుర్తించలేక పోయాడు.

తనకు తెలియకుండానే పెదవుల మీద చిరునవ్వు వెలిసింది. అయినా భార్య రాజేశ్వరి మాటల వెనుక దాగిన ముల్లు చిన్నగా గుచ్చుకోకపోలేదు.

"ఏవో అనాలోచితంగా అన్న మాటల్ని నువ్వు సీరియస్‌గా తీసుకున్నావు. సరేలే ఇద్దామని వాళ్ళకే అనిపించినప్పుడు, కాదంటే బావుండదు. నాకు మూడు నాలుగు రోజులు పనిభారం వుంది. ముందుగా నువ్వెళ్ళు. బట్టలూ అవీ సర్దుకుని వుండు. నీకంత మరీ తొందరగా వుంటే ఈరోజే వెళ్లు. నేనింకొంచెంసేపులో ఇంటికి వస్తాను" రాఘవరావు ఆనందంగా టెలిఫోను పెట్టేసి, హైదరాబాద్ ట్రంక్‌కాల్ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

బయటకొచ్చిన బాబూరావు కళ్ళ సైగలందుకుని కోటీశ్వరరావు సోఫాలోంచి లేచి ఆఫీసు బయటకు వెళ్లాడు.

"అయ్యగారో గంట గడిచిన తర్వాత ఇంటికి వెడ్తారట. నన్నీలోపుగా కూరలకి పంపిస్తున్నారు" అన్నాడు బాబూరావు.

బాబూరావు మాటల్లోని సందేశం కోటీశ్వర్రావుకి తెలిసింది. కొద్దిగా ప్రాణం తెరిపినపడ్డట్లయింది. మనిషి దారిన పడ్తున్నాడు.

"మీ అయ్యగారికే కూరలంటే ఇష్టం?" కోటీశ్వర్రావు ప్రతిచిన్న అవకాశాన్నీ వాడుకోదల్చాడు.

"మీకు చాదస్తంకానీ అయ్యగారికేం కూర ఎలా వండితే ఇష్టమో అమ్మగారికి తెలుస్తుంది కానీ, నా పనల్లా కంటికి నచ్చిన కూరనల్లా కొనిపారేయడమే!"

"దఫాకేమాత్రం కూరలు కొంటారు?"

"ఈ రోజు ఏభై ఇచ్చారు. ఒక్కోరోజు వంద ఇస్తారు. ఓ లెక్కని లేదు"

ఆవిడగారు సాయంత్రం బయలుదేరి వెళ్తానంది. ఇన్ని రూపాయల కూరలేంజేసు కుంటారు? అంటే రాఘవరావుకింకా భార్య ప్రయాణం సంగతి తెలియదన్నమాట. అంటే ఇంకా రాఘవరావుకి టెలిఫోన్ చేసి వుండదన్నమాట. కోటీశ్వర్రావు కొద్దిగా కంగారు పడ్డాడు. కంగారుని కనబడనీయకుండా, "బాబూరావ్! మీ అమ్మగారూళ్ళో లేని సమయంలో మీ అయ్యగారు తిండికేం చేస్తుంటారు?".

"ఆ అవకాశం కోసం చూసే చిన్న ఉద్యోగులు ఎడాపెడా భోజనాలకి పిలుస్తారు. అప్పు డప్పుడు హోటల్ నుంచి భోజనం తీసుకువెళ్తాను. ఎక్కువ రోజులైతే వంటమనిషిని పెట్టు కుంటారు"

"ఆడా? మగా?" కోటీశ్వర్రావు నవ్వుతూ అడిగాడు.

బాబూరావు ఒక్క క్షణం కోటీశ్వర్రావు ముఖంలో అర్థాలు వెదకడానికి చూశాడు. నవ్వుతూ, "ఆ వంట చేసేది నేనేనండి! ఆడేం కాదు!" అన్నాడు.

"అన్నట్టు మరో మాట. అమ్మగారుళ్ళోలేనప్పుడు ఆయన ఒంటరిగా వుంటారా? లేదా నువ్వుకానీ, మరెవరు కానీ తోడుగా వుంటారా?" కోటీశ్వర్రావు గుంభనగా అడిగాడు.

"వంట చేసి ఇంటికి పోతాను. మళ్ళీ ఉదయమే వెళ్తాను" అన్నాడు బాబూరావు – 'మీకు కావల్సిన విషయం తెలిసిందా?' అన్నట్లు చూస్తూ.

కోటీశ్వర్రావు జేబులోంచి రెండు వందలు తీసి బాబూరావు కిచ్చాడు.

"తూకం సరిగా తూయించి ఓ కిలో జీడిపప్పు కొని, కొన్నదాంట్లో కొట్టేయకుండా అయ్యగారింట్లో ఇవ్వు. మిగిలే డబ్బు నువ్వుంచుకో" అన్నాడు.

బాబూరావు కళ్ళు ఓ వెలుగు వెలిగాయి. పాతిక రూపాయలు మిగుల్తుంది. నీతిమాలిన కంట్రాక్టర్లూ, దారితప్పిన ఆఫీసర్లూ వున్నంతకాలం, తనలాంటి వాళ్ళ జీవితాలు ఓ మాదిరి సుఖంగానే గడిచిపోతాయనుకుంటూ, బాబూరావు సైకిలు తీసుకునిపోయాడు. అయితే బాబూరావు తన నీతిమాలినతనాన్ని గురించి ఏమీ ఆలోచించలేదు.

❁ ❁ ❁

రామకోటి తన గదిలోకి తిరిగివచ్చేసరికి వినోద్‌కుమార్ బల్లపక్క కుర్చీలో కూర్చుని సిగరెట్ కాలుస్తున్నాడు. వెంకటస్వామి ఓ పక్కగా ఓ బల్ల ముందు స్టూలుమీద కూర్చుని ఆఫీసు కవర్ల మీద స్టాంపులంటిస్తున్నాడు.

కాలుతోన్న సిగరెట్‌ని వరండాలోకి విసిరేసి, "మీరు రెడ్‌లైట్ డిస్కషన్స్ చేస్తున్నారు కదా, రావడం ఆలస్యమవచ్చని మీరు తెప్పించుకున్న కాఫీ నేను తాగేశాను. మీకు మళ్ళా కాఫీ

తెప్పించేదా?" అన్నాడు వినోద్‌కుమార్ చిద్విలాసంగా.

"నేనా కాఫీని ఎంగిలి చేసివుంటే?" రామకోటి తన కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

"మీరు కాఫీని ముట్టకుండానే ప్రిన్సిపాల్‌గారి గదికి పరుగెత్తారని వెంకటస్వామి చెప్పాడులెండి. అయినా ఒకవేళ మీరు ఎంగిలిచేసినా కొంపేమీ మునిగిపోదు. ఈ హోటళ్ళలో మనం తినేవి, తాగేవి అన్నీ ఎంగిలిమయం. మన కాంటీన్ కాఫీ కూడా అంతే! ఇంతకీ ఎర్రలైటు వెలిగించేశారు. ఎవరి మీద బ్రహ్మాస్త్రం పడబోతోంది సార్!" వినోద్‌కుమార్ అన్నాడు, కుతూహలంగా ప్రశ్నిస్తూ.

"కవచాలు ధరించుకుని వున్నారందరూ, ఎవరి మీద పనిచేస్తుందని? సరే, ఈ మాటలకేంగానీ మీరు టైపు చేసిన ఆ రిపోర్టు నిండా చాలా తప్పులు దొర్లాయి. ఈపాటికి సంతకం అయిపోయి వెళ్ళిపోవల్సింది. దాన్ని వెంటనే మీరు రీటైప్ చేసి తీసుకురండి" అన్నాడు రామకోటి.

"డ్రాఫ్టులో ఆ మాత్రం తప్పులు దొర్లితే పర్వాలేదు" వినోద్‌కుమార్ అతినిర్లక్ష్యంగా అన్న మాటలు విని, రామకోటికి కొద్దిగా చికాకెత్తింది.

"చూడండి మిస్టర్ వినోద్‌కుమార్! కావలిస్తే అవసరమొచ్చిన మార్పులూ చేర్పులూ చేయడానికి డ్రాఫ్టు కానీ, టైపిస్టు చేసిన తప్పులకి కాదు. పేజీకి ఏదో ఒకటీ అరా అయితే పర్వాలేదు కానీ, అన్ని తప్పులతో ప్రిన్సిపాల్‌గారి ముందరపెడ్తే బావుండదు. మీరు త్వరగా మరో డ్రాఫ్టు కాపీ టైపు చెయ్యండి"

"అంటే ఈ డ్రాఫ్టుని నేను మరోసారి టైపు చెయ్యాలి, దాన్ని మీరు చూడాలి, ప్రిన్సిపాల్‌గారు చూడాలి. తర్వాత మరోసారి వేళ్ళకి పని కల్పించి మరోమారు టైపు చెయ్యాలన్నమాట?"

"అన్నమాటేగా మరి!"

"మీరు నా కనవసరంగా పని పెంచేస్తున్నారు. ఇలా అయితే ఎలా కుదురుతుంది?"

"ఇచ్చిన పని సకాలంలో సవ్యంగా చేస్తే మళ్ళీమళ్ళీ చెయ్యవలసిన అవసరముండదు"

"అంటే, నేనీపని సకాలంలో సవ్యంగా చెయ్యలేదంటారు, అదేనా మీ ఉద్దేశ్యం?"

వినోద్‌కుమార్ కయ్యానికి కాలుదువ్వుతున్నాడని గ్రహించాడు రామకోటి.

"వాదించడం మీ ధ్యేయమే అయితే నాకు తీరుబడి లేదు. మీరు వెంటనే రిపోర్టు డ్రాఫ్టుని రీటైప్ చెయ్యండి. ప్రిన్సిపాల్‌గారికి ఓ గంటోపుగా చూపించాలి. ఈ మధ్యాహ్నానికల్లా ఫైనల్ రిపోర్టు సంతకం జరిగి వెళ్లితీరాలి" రామకోటి కటువుగా అన్నాడు.

"దీన్ని టైపు చెయ్యడం, దాన్ని ప్రిన్సిపాల్‌గారు చూడ్డం, చూసింతర్వాత మళ్ళీ టైపు చెయ్యడం మధ్యాహ్నంలోగా అయ్యే పని కాదు. అంతకుముందే నాకర్జంటు పనుంది"

"ఆ అర్జంటు పనికోసమే నిన్న ఎవరకీ చెప్పాపెట్టకుండా వెళ్లిపోయారు, రెండు గంటల ముందుగానే. ఇక్కడా అర్జంటు పనులుంటాయి. వాటిని సకాలంలో చెయ్యవలసిన బాధ్యత మనందరి మీదా వుంది. వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేసి స్వంత పనులు చూసుకోవడం బాధ్యతారహితంగా ప్రవర్తించడం తప్ప మరేమీ కాదు!"

వినోద్‌కుమార్ మొదటిసారిగా కంగుతిన్నాడు. రామకోటి ఇంత కటువుగా మాట్లాడ్డం

ఇదే మొదటిసారి. 'అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరుగా అథారిటీ చెలాయిస్తున్నాడు. సరే ఆ సంగతీ చూద్దాం' అనుకుంటూ, "మీరనవసరంగా నోరు చేసుకుంటున్నారు. మీరొక్కరే బాధ్యతతో ప్రవర్తిస్తున్నట్టుగా మాట్లాడుతున్నారు. మీరు నాచేత వందసార్లు టైపు చేయించినా ఈ తప్పులు దొర్లక మానవు. ఎందుకంటే టైపు మిషను సరిగా లేదు!" అన్నాడు పొగరుగా.

వినోద్‌కుమార్ మడతపేచీ పెడుతున్నట్లు రామకోటికి అర్థమైపోయింది. ఉదయం తను వెంకటస్వామితో నిగ్రహం, ఓర్పు అంటూ ఏవో మాటలు చెప్పాడు. వాటిని పక్కకు నెట్టి, "వెంకటస్వామీ! ఈయన గదిలోంచి ఆ టైపు మిషన్ తీసుకురా, ఏం పాడైపోయిందో చూస్తాను" అన్నాడు.

వెంకటస్వామి పక్కగదిలోకి వెళ్లి వినోద్‌కుమార్ టైప్ మిషన్ తీసుకొచ్చి, రామకోటి బల్ల మీద పెట్టాడు.

"మిషన్ కవర్ తాళం తియ్యండి"

"తాళం చెవి తొందరగా వచ్చే హడావుడిలో ఇంటి దగ్గర మరచిపోయాను"

వినోద్‌కుమార్ విసురుగా అన్న మాటలతో రామకోటి కోపం తారస్థాయినంటుకుంది. ఏమైతే అదవుతుందని ఒక్కసారిగా వినోద్‌కుమార్ మీద విరుచుకుపడ్డాడు.

"మిస్టర్ వినోద్‌కుమార్! ఏ అండదండలు చూసుకుని మీరిలా ప్రవర్తిస్తున్నారో నాకు తెలియంది కాదు. వ్యక్తిగతంగా మీరు నాకు గౌరవమిచ్చినా ఇవ్వకపోయినా పర్వాలేదు కానీ, కుర్చీని మట్టుకు అవమానిస్తే సహించను. నిన్నకాక మొన్న ఉద్యోగంలో చేరిన మీకు, మీభవిష్యత్ మీ వెనుక బలం మీద ఆధారపడి వుందని మీ కనిపించవచ్చు.

"ఆ ఆధారం పోవడానికొక్క ఎలక్షన్ చాలు. మధ్యంతరంగా ఒక్క విశ్వాసరాహిత్య తీర్మానం చాలు. మీ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు మీద కలం పెట్టించి మీ భవిష్యత్‌ని పాడుచేసే అధికారం ఈ కుర్చీ కుందని మరిచిపోకండి. ఎందుకెందుకని సహిస్తూ కూర్చుంటే మీ ప్రవర్తన హద్దు దాటుతోంది. మీకు మొదటిసారిగా హెచ్చరిక చేస్తున్నాను. మరోసారిలా ప్రవర్తిస్తే మెమో అందుకోవలసి వస్తుంది.

"మీ టైప్‌మిషన్ తుప్పే పట్టిందో, తగలడిందో నా కనవసరం. వెంకటస్వామీ! ఈ మిషన్ తీసుకెళ్ళి ఈయన బల్ల మీద పెట్టి తాళం పగలగొట్టు! కాదంటారూ, ఏ ఫిజిక్స్ డిపార్టుమెంటుకో వెళ్ళి టైప్ చేసి తీసుకురండి. అలా చూస్తూ కూర్చుంటే కుదరదు వినోద్‌కుమార్! ఈకాయితాలు తీసుకువెళ్ళి గంటలోగా టైప్ చేసి తీసుకురండి. లేదా మీకిచ్చే మెమో కూడా మీ చేతే టైప్ చేయిస్తాను. వెళ్లండి!" అంటూ రామకోటి డ్రాఫ్టు రిపోర్టుని వినోద్‌కుమార్ ముందుకు విసిరికొట్టాడు.

వినోద్‌కుమార్‌కి వణుకుపుట్టింది. రామకోటి ఆగ్రహం చూసి అదిరిపోయాడు. ప్రస్తుతానికి మాట్లాడి ప్రయోజనం లేదు. ఎర్ర సిరాతో చాలాచోట్ల దిద్దబడిన రిపోర్టు కాయితాల్ని తీసుకుని, అవమానం నిలువునా దహిస్తుండగా తన గదిలోకి దారి తీశాడు. వెనుకనే వెంకటస్వామి టైప్

మిషన్ తీసుకువెళ్ళాడు.

కొద్ది సేపట్లో వెంకటస్వామి చిన్నగా నవ్వుకుంటూ రామకోటి దగ్గర వచ్చి నెమ్మదిగా అన్నాడు – "తాళం తీసి, టైపు చెయ్యడం మొదలు పెట్టాడు. మీరు మంచి ఛలేగా అంటించారు. సార్, ఇటువంటి వాళ్ళతో ఎప్పుడూ నెమ్మదిగా వుండకూడదు. ఇంతకీ ఈయనగారి కంగారేమిటో తెలుసా సార్? నిన్న పెళ్ళిచూపులు చూసుకోవడానికి వెళ్ళి, అక్కని చూసి బాగోలేదని, చెల్లి నచ్చిందన్నాడు. ఈరోజు ఉదయం మళ్లీ మధ్యవర్తి ద్వారా కబురంపాడట ఏ సంగతీ తెలపమని. ఆ చెల్లి ఈయన్ని మన కాలేజీ పక్కనున్న గాంధీపార్కులో మధ్యాహ్నం కలుసుకోమందిట! ఇందాకా మీరు ప్రిన్సిపాల్‌గారితో వుండగా వినోద్‌కుమార్ మీకు తెచ్చిన కాఫీ తాగుతూ సంతోషంగా నాకు చెప్పిన విషయాలివి. ఆయన పెళ్లిచూపుల సంబరం ఎలా వున్నా, మీరు మట్టుకు బాగా బాజా వాయించారు!"

"మనిషిని కాల్చి చంపినా పర్వాలేదుకానీ, మనస్సుని గాయపరిస్తే మట్టుకు బాధ చాలా దుర్భరంగా వుంటుంది. ఓ ఆడమనసుని గాయపరిచి వినోద్‌కుమార్ మగజాతికే అవమానం తీసుకొచ్చాడు" అన్నాడు రామకోటి.

వెంకటస్వామి మరింత దగ్గరగా వచ్చి ముందుకు వంగి రామకోటి చెవిలో అన్నాడు నెమ్మదిగా.

"అయ్యగారూ! మీ నోటమ్మట ఆ మాట ఎందుకొచ్చిందో నాకు తెలియదు కానీ, ఈయన నిజంగానే మగజాతికి అవమానం! ఈయనగారికి ఇదివరకే పెళ్లయిందట! కట్నం విషయమై తల్లీకొడుకులిద్దరూ ఆ యమ్మని నిలువునా దహించేశారని తెలిసింది సార్! ఏదో మనకెందుకులే అని ఊరుకున్నాను కానీ, ఈ రోజు మీకు చెప్పకుండా ఉండలేకపోతున్నాను"

రామకోటి ఒక్క నిముషం మౌనంగా వుండిపోయాడు.

"నీకెలా తెలుసు ఈ విషయం?" అని అడిగాడు.

"మా బావమరిది పార్వతీపురంలో పోలీస్ కానిస్టేబుల్ సార్. ఈ దారుణం జరిగిందక్కడే. ఏదో మొన్నీమధ్య మాటల సందర్భంలో తెలిసింది".

రామకోటి ఉన్నట్టుండి ఓ నిశ్చయానికి వచ్చేశాడు. ఒకవేళ ఆ చెల్లెలెవరో ఈ పెళ్లికి ఒప్పుకుంటే, అన్యాయానికి గురికాక తప్పదు. తెలిసీ ఆమెకు చెప్పకపోతే అంతకంటే దారుణం మరొహటుండదు.

"వెంకటస్వామీ! ఇతగాడు చూసిన అమ్మాయిలెవరో తెలుసా?" అన్నాడు.

"ఆ అక్క పేరు పద్మ. జూనియర్ హైస్కూల్లో టైపిస్టుగా పనిచేస్తోంది. చెల్లెలు పేరు కాంతం. వీనస్ ప్రెస్‌లో ప్రూఫ్‌రీడర్‌గా పనిచేస్తోంది. ఈ వివరాలు కూడా వినోద్‌కుమార్ చెప్పినవే సార్".

"సరే నువ్వెళ్ళి మరో కప్పు కాఫీ తీసుకురా. నాకు చాలా పనుంది. వెళ్లేటప్పుడు కాస్త తలుపు దగ్గరగా వేసి వెళ్ళు!" అన్నాడు రామకోటి, కాఫీకి డబ్బులిస్తూ.

వెంకటస్వామి బయటకు వెడ్తూ తలుపు దగ్గరగా వేసి వేళ్లాడు.

రామకోటి డైరెక్టరీలో నంబరు చూసి, వీనస్ ప్రెస్‌కి టెలిఫోన్ చేశాడు.

❖ ❖ ❖

ఈ వ్యవహారాన్నీరోజు ఎలాగైనా తేల్చేసుకోవాలి. సాయంత్రంలోగా రాఘవరావుని ఏదోవిధంగా కొనిపారేస్తే, ముందు ముందు పన్లన్నీ సుఖంగా జరిగిపోతాయి. ఈరోజు ఈ విషయం ఓ కొలిక్కి వస్తే, ఎంత రాత్రయినా తన ఊరు పోవచ్చు. ఈలోగా ఈ ఊరి కాలేజీలో చదువు వెలగబెడ్తున్న కుమారరత్నాన్ని ఓసారి చూడాలి. వాడు గదిలో వుంటాడో లేదో. కాలేజీకి పోయుండొచ్చు. వాడిదివాళ పుట్టినరోజు కూడాను. కోటీశ్వర్రావు తన కొడుకు రాజారావుండే ఇంటికి కారు తీసుకొని పోయాడు.

డాబా మెట్లెక్కి గది తలుపు బయట తాళం లేకపోవడం చూసి, కొడుకు గదిలోనే వున్నాడన్న సంతృప్తితో తలుపు తట్టాడు.

ఆ తలుపు వెనక, అలిసిపోయిన తన శరీరాన్నీ, వెళ్లిపోవడానికి సిద్ధమవుతున్న పార్వతి నలిగిన శరీరాన్నీ మార్చిమార్చి చూసుకుంటున్న రాజారావు ఒక్కసారిగా స్తంభించిపోయాడు. అప్పటికే బట్టలు కట్టుకుని, జుట్టూ అవీ సరిచేసుకుని వెళ్లడానికి సిద్ధంగా వున్న పార్వతి తాము ఇరకాటంలో పడ్డట్టు గ్రహించింది. వెళ్లి తలుపు పక్కగా గోడ కానుకుని నిల్చుని, తలుపు తీసి ఎవరో చూడమన్నట్టుగా సైగ చేసింది.

రాజారావు ధైర్యం కూడదీసుకుని కొద్దిగా తెరచి చూశాడు.

"కాలేజీకి వెళ్ళలేదట్రా?" అంటూ తలుపులు తోసుకుని కోటీశ్వర్రావు గదిలో ప్రవేశించి, మంచం మీద కూలబడి తల ఎత్తి చూసేసరికి, తోసిన తలుపు చాటున నిలబడ్డ పార్వతి కనిపించింది.

ఎంతకాలం నుంచి జరుగుతోందో తెలియదుకానీ, కొడుకు గ్రంథసాంగుడయ్యాడని కోటీశ్వర్రావుకి కొట్టొచ్చినట్టు తెలిసిపోయింది. ఏదో అనబోయి మస్తిష్కంలో ఓ మెరుపు మెరిసి ఆగిపోయాడు. గొడవపడి లాభం లేదు. వయసులో వున్న కుర్రాడు వశం తప్పాడు. పెళ్ళికాకమునుపు తను ఏడ్చిన ఏడుపులేమంత తక్కువని? తన పోలికే కొడుక్కీ వచ్చింది.

"ఒరేయ్ ఆకలిగా వుంది. పోయి ఇడ్లీలు పట్రా" అన్నాడు కొడుకు నుద్దేశించి.

రాజారావు బ్రతుకుజీవుడా అనుకుంటూ, నిస్సహాయంగా ఓసారి పార్వతి కేసి చూసి బయట పడ్డాడు.

"అయినింటి ఆడదానిలా వున్నావు?" కోటీశ్వర్రావు నెమ్మదిగా ప్రశ్నించాడు.

"అవును, నేను పక్క ఇంట్లో వుంటున్న కెమిస్ట్రీ లెక్చరర్ శేషగిరి భార్యని. కానీ అవసరం అధోగతిని పట్టించింది!" పార్వతి అక్కడే నిల్చుని ధైర్యంగా అంది.

"నీతోపాటు నా కొడుకూ దిగజారాడు. ఎంతకాలంనుంచి?"

"నేను నీతి తప్పడం, మీ కొడుకు దారి తప్పడం - ఇదే మొదటిసారి. అయినా అతగాడి

తప్పేమీ లేదు. నేను ముందే చెప్పాను. నా అవసరం నన్నీస్థితికి దిగజార్చిందని!"

"ఆ అవసరమేమిటో తెలుసుకోవచ్చా?" కోటీశ్వర్రావు నిదానంగా అన్నాడు. గొంతుకలో ఎక్కడా కోపపు ఛాయలు లేవు.

పార్వతికి పూర్తిగా జంకు పోయింది. నిండా మునిగినదానికి చలేమిటనుకుంటూ జవాబిచ్చింది.

"నా మొగుడు పెళ్ళిలో తీసుకున్న కట్నం కాక అయినవీ కానివీ పుట్టింటి నుంచి తెమ్మంటాడు. వాళ్లు పూర్తిగా చితికిపోయారు. కావల్సినవి రాకపోతే ఇక్కడ నాకు తిండి పెట్టకుండా కడుపు మాడ్చేస్తాడు. రెండేళ్లనుంచీ నరకయాతననుభవిస్తున్నాను. జీవితం మీద విసుగెత్తి, జీవితాన్నంతం చేసుకునే ధైర్యంలేక, ఆకలి బాధ భరించలేక ఈరోజు ఈ దారి నెన్నుకున్నాను. మీ రాజారావుని కవ్వించి రెచ్చగొట్టింది నేనే!" తల వంచుకుని కాక, కోటీశ్వర్రావు కళ్ళలోకి చూస్తూనే సమాధానమిచ్చింది.

ఈ కళ్ళలో కూడా నీళ్లు. రాజేశ్వరి కళ్ళలో నీళ్ళు. రాజేశ్వరి అలా తెగించింది. తను సలబై వేలు సమర్పించుకున్నాడు. ఈమె ఇలా తెగించింది. తన కొడుకు శృంగార జీవితంలో అడుగు పెట్టాడు. ఈ వెధవ డబ్బు ఎంతటి పాపిష్టి పనినైనా చేయిస్తుంది. ఎదుటి వాడి బుర్రలు బద్దలు కొట్టి సంపాదించినా పర్వాలేదుకానీ, కట్టుకున్నదాన్ని హింసించి తెచ్చుకున్న డబ్బుతో మగవెధవ నిజంగా ఏం సుఖం పొందుతాడు? శాడిజం తప్ప! అయినా తను మట్టుకేం నిజాయితీగా సంపాయిస్తున్నాడని? ఒకసారి న్యాయం తప్పిన తర్వాత ఎలా సంపాదించినా ఒకటే! లక్ష్యం ఒకటే, కానీ మార్గాలు వేరు.

ముందుముందు మార్గం సుగమం చేసుకోవడానికి, రాజేశ్వరికి వ్యాపారదృష్టితో సహాయం చేశాడు. పార్వతికి? దేశంలో ఎందరి జీవితాలలో ఈ కట్నకానుకల సమస్యలతో నాశనమైపోతున్నాయి. అందర్నీ తను ఉద్ధరిస్తూ కూర్చుంటాడా? పార్వతిని వెళ్లిపొమ్మంటే వెళ్లిపోతుంది. అయితే తనెంతో మందికి ఉద్యోగాలిచ్చి బ్రతుకుతెరువు చూపిస్తున్నాడు. ఈమె ఒక మార్గాన్ని ఎన్నుకుంది. ఆ మార్గాన్ని తనుపయోగించుకోవచ్చు.

"చూడు పార్వతీ! ఇది నువ్వాలోచించుకున్న మార్గమే. అందుకని నన్నపార్థం చేసుకోనంటే, నా స్వార్థంతో నీతో ఓ మాట చెప్పదలచుకున్నాను" అన్నాడు కోటీశ్వర్రావు.

"చెప్పండి" అంది పార్వతి నిర్లిప్తంగా.

"ప్రాస్టిట్యూట్‌తో సరాగాలకి ఈ సంఘంలోని చాలా ఘరానా పెద్దమనుషులు కోరిక వున్నా పేరు చెడుతుందన్న భయంతో, లేదా చెడు రోగాలంటుతాయన్న భయంతో అటువైపు అడుగులు వెయ్యరు. అటువంటి పెద్దమనుషులతో వ్యవహారం జరిపేటప్పుడు, సంసార ముసుగులో వున్న స్త్రీలు చాలా ప్రయోజనాల్ని సాధించగలుగుతారు. నువ్వు సిద్ధంగా వుంటే, నేను నీ కెంతైనా సహాయం చేస్తాను. ఈ కాలేజీ కుర్రాళ్ళతో వ్యవహారం నీకు లాభసాటిగా వుండదు. వాళ్ళు గొప్పలకి పోయి నోరు జారితే నీ సంగతి అందరికీ తెలిసిపోతుంది. ఆలోచించుకో" అన్నాడు.

"ఆలోచించుకోనవసరం లేదు. నేనేం చెయ్యాలి?" - పార్వతికి తెలుసు తను పెద్ద ఎత్తులో వ్యవహారాలు జరపాలి.

"ఏముంది, నా కవసరమొచ్చినప్పుడల్లా నువ్వు పెద్దమనుషుల్ని చూస్తోవుండాలి. నీ స్థాయీ, ఆరోగ్యమూ దిగజారకుండా చూసే బాధ్యత నాది. నువ్వు గడప దాటినప్పుడల్లా నా కంట్రాక్టు విలువని బట్టి నీకు డబ్బిస్తూవుంటాను. అదే పరిస్థితిలోనూ రెండు వేలకు తగ్గదు! ఏ పరిస్థితుల్లోనూ నువ్వు కలిసే వ్యక్తుల నుంచి ఒక్క పైసా కూడా తీసుకోడానికి ప్రయత్నించకూడదు. ఎందుకంటే నువ్వు సంసార స్త్రీవి. నీ సుఖానికి మార్గాలు వెదుక్కుంటున్నావు తప్ప, డబ్బు కోసం కాదని వాళ్లభిప్రాయం ఏర్పరుచుకోవాలి. నీ ధ్యేయం నా పని జరగడమే!"

పార్వతి తన చెవుల్ని తానే నమ్మలేకపోయింది. ఒక్క తప్పటడుగుతో అవినీతి పథంలో తనింత శీఘ్రంగా ప్రయాణం చేయవలసివస్తుందని కలలో కూడా అనుకోలేదు.

"అలాగే!" అంది పార్వతి.

కోటీశ్వర్రావు బ్రీఫ్‌కేస్ తెరిచి రెండు వేలు తీసి బల్లమీద పెట్టాడు.

"ఈ రెండువేలూ వుంచు. బహుశా ఈ రోజే నీ అవసరం కలగొచ్చు" అన్నాడు.

పార్వతి ముందడుగు వేసి, వణికే చేతుల్తో, రెండు వేలూ తీసుకుని, గోడ వైపు తిరిగి జాకెట్లో పెట్టుకుని, నిండుగా కొంగు కప్పుకుంది. అంతకు క్రితమే రాజారావిచ్చిన ఆరు వందల్లో ఓ అయిదు వందల రూపాయిల నోటు, మరో వంద రుపాయల నోటు రెండు వేలకీ స్వాగతమిచ్చాయి.

"నీకు వీలు ఎలా కుదుర్తుంది?"

"ప్రస్తుతానికీ ఊరు దాటనంతవరకూ, రాత్రి కానంతవరకూ ఎలాగో వీలుచేసుకుంటాను. ముందు రోజుల మాటంటారా, అనుభవమే మార్గం చూపిస్తుంది."

"సరే ప్రస్తుతానికి అలాగే కానిద్దాం. తర్వాత అవకాశాలెలా కల్పించాలో నాకూ అనుభవం నేర్పుతుంది. మరోచిన్నమాట! వయసులో వున్న నా కొడుక్కి నీ వల్ల ఆ సుఖమేమిటో తెలిసిపోయింది. నేను మిమ్మల్నిద్దర్నీ ఇలా చూశానని వాడు మళ్ళీ నీ వైపు తలతిప్పకపోయినా, సాని కొంపల వైపు పోయే ప్రమాదముంది. వాడికి త్వరలో పెళ్లి చేసేస్తాను. అంతవరకూ వాడు నీ దగ్గర్నుండి దూరంగా పోకుండా చూసే బాధ్యత నీ మీదే వదిలేస్తున్నాను. కానీ చదువు మాత్రం తగలడకుండా చూడు!"

పార్వతికి కోటీశ్వర్రావు తనను తిరుగులేని మార్గంలో పంపిస్తున్నాడని తెలుసు. అయినా తను చెయ్యదలచుకున్నది ఉన్నదున్నట్టుగా నిజాయితీగా చెప్పిన కోటీశ్వర్రావు పార్వతి దృష్టిలో ఓ రకమైన గౌరవాన్ని సంపాదించుకున్నాడు. తను ఎన్నుకున్న మార్గాన్ని మరింత విశాలం చేసిన కోటీశ్వర్రావుకి చేతులెత్తి నమస్కరించాలని అనిపించినా, ఆ ప్రయత్నం నుంచి విరమించుకుని, పార్వతి గది బయట అడుగు పెట్టింది.

ఇడ్లీ పొట్లాలు తీసుకుని నిర్జీవంగా మెట్లెక్కుతున్న రాజారావుని చూసి, భయపడవద్దని సైగ

చేస్తూ పార్వతి మెట్లు దిగింది.

ఇడ్లీ పొట్లాల్ని సంచిలోంచి తీసి బల్ల మీద పెట్టి గూట్లో వున్న పుస్తకాల్ని తీసుకుని రాజారావు కాలేజీకి రెగ్యులర్ క్లాసులు అటెండ్ అవడం కోసం వెళ్ళిపోయాడు. మాట్లాడి కొడుకుని మరింత ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక కోటీశ్వర్రావు ఇడ్లీ పొట్లాలు విప్పాడు.

• • •

సాంబశివం తండ్రి క్రిష్ణయ్య ఆఫీసు ఎగ్గొట్టాడు. తాలూకా ఆఫీసు తనిఖీకి కలక్టరొస్తున్న సమయంలో కొడుకుతో ఉదయం జరిగిన ఘర్షణ గుర్తుతెచ్చుకుంటూ, కారాలూ మిరియాలూ నూరుతూ ఇంట్లోనే కూర్చున్నాడు. అక్కడ ఆఫీసులో పని ఎలా జరుగుతుందన్న ఆలోచనైనా లేకుండా, కలెక్టరుచేత తిట్లూ, చివాట్లూ తినడానికి తన కన్నా పైవాళ్ళు చాలామందున్నారన్న కసితో, మాటిమాటికీ ఆ కసినంతా పెళ్ళాం బిడ్డల మీద చూపిస్తూ, మాటలంటూ కూర్చున్నాడు.

తండ్రి ధోరణి చూసి కమలకి విసుగెత్తిపోయింది. కర్తవ్యం పేరిట భవిష్యత్‌ని ఆలోచించ కుండా, జీవితాలతో చెలగాటాలాడే పెద్దరికంలో అర్థంలేదనిపించింది. తన పెళ్లి ఎలాగో కానిచ్చి చేతులు కడుక్కుని కూర్చుందామని ఆయన గోల.

అంతవరకూ కొంత సబబుగానే వున్నా, అన్న కిష్టంలేని పెళ్ళితో ఈ పెళ్ళిని ముడిబెట్టిన తండ్రి అసమర్థతని చూసి జాలీ వేస్తోంది, కోపమూ వస్తోంది.

మరీ నిలదీసి ఎదిరిద్దామన్నా, ఆర్థికంగా తను స్వతంత్రురాలు కాదు. ఒకవేళ నిజంగా తనూ ఓ ఉద్యోగం చేస్తూ వుంటే, తండ్రి తొందరపడుతూ పెళ్లి ప్రయత్నాలు చేసేవాడా? ఏమో, స్వార్థమనేది ఎంతటి పనినైనా చేయిస్తుంది.

అన్నది ప్రస్తుతం చిన్న ఉద్యోగం. అయినా తన పెళ్ళి విషయంలో తండ్రి నెదిరించాడు. తను బి.ఎస్సి. పూర్తిచేసేవరకూ పెళ్ళి చెయ్యడం మంచిది కాదని చెప్పినా తండ్రి మంకుపట్టు పట్టడంతో శపథం చేసి బయటకు వెళ్ళాడు. తన మూలాన అన్న జీవితంలో బాధపడకూడదు. వ్రాయలేని రికార్డుని పక్కకు నెట్టి, ముందుగదిలోకి అడుగు పెట్టింది.

వంటగదికీ, ముందుగదికీ మధ్యనున్న గడప మీద కూర్చుని, వంటచేస్తున్న తల్లి రుక్మిణితో అంది – "అమ్మా! చదువయ్యేవరకూ నాకు పెళ్లిచేసుకోవడం ఇష్టంలేదమ్మా"

ముందుగది కుర్చీలో కూర్చున్న క్రిష్ణయ్య కస్సుమన్నాడు. "ఇందాకా వాడు గొడవచేసి వెళ్లాడు, ఇప్పుడు నువ్వు మొదలు పెట్టావు!"

"చిన్నదాని మీద ఎందుకలా కసురుకుంటారు?" అంది రుక్మిణి వంటగదిలోంచి.

"కన్నందుకు బాధ్యతలు తీర్చుకుందామని నేను చూస్తుంటే, మధ్యలో మీ గోలేమిటి? పొద్దుట్నుంచీ చూస్తున్నాను!".

"అవుననుకోండి. కానీ కమల చదువు పూర్తవ్వాలని ఉబలాటపడ్తోంది. ఇది కూడా ఆలోచించవలసిన విషయమే కదా?"

"తను గ్రాడ్యుయేటవుతే, ఇంకో మెట్టెక్కువ మొగుడు కావాలంటుంది! ఇప్పుడే తట్టుకోలేని

పరిస్థితిలో వుంటే, అప్పుడేం చెయ్యగలను? అయినా సుబ్బరామయ్యగారి కొడుక్కి ఏం తక్కువొచ్చిందని. బి.ఏ. పాసయి శుభ్రంగా జిల్లా ఆఫీసులో పనిచేస్తున్నాడు. ఇదేమీ చదివి రాజ్యాలేలనక్కర్లేదు."

ఒక్కోప్పుడు ఉద్రేకం కొండంత ధైర్యాన్నిస్తుంది.

తండ్రి మాటలతో కమలకి కోపం ముంచుకొచ్చింది.

"పిల్లలకో మంచి భవిష్యత్‌ని చూపించలేని మనుషులు, అసలు పిల్లల్ని పుట్టించుకోకుండా చూసుకోవాలి. బాధ్యతలపేరిట పిల్లల్ని నట్టేట్లో ముంచే అధికారం మీ కుందనుకోవడం, మా దురదృష్టం!" అంది అరుస్తూ.

"ఏమిటే అఘాయిత్యం? నాన్నగార్నలా అనవచ్చా?" అంటూ రుక్మిణి కమల కాలు మీదుగా గడప దాటుకుంటూ ముందుగదిలోకి వచ్చింది. క్రిష్ణయ్య బుసలు కొడ్తూ కుర్చీలోంచి లేచి, కూతురి వైపు రాబోతోంటే, రుక్మిణి అడ్డుకుంది.

"ఇవ్వాళ కాలేజీకి వెళ్లకుండా ఇంట్లో కూర్చుని ఏమిటే వాగుతున్నావు?!" క్రిష్ణయ్య కూడా గట్టిగా అరిచాడు.

"అవును నాన్నగారూ! ఆఫీసులో తనిఖీకి పై అధికారులు వస్తున్నా, బాధ్యతారహితంగా ఇంట్లో కూర్చుని గొడవచేస్తున్నది మీరు కానీ, నేను కాదు!"

కమల మాటలు విని మరింత కోపం రెచ్చిపోయిన క్రిష్ణయ్య నోట మాట పెగల్లేదు.

"అదేమిటే, పెద్దాచిన్నా తారతమ్యం లేకుండా అంతలేసి మాటలంటున్నావు! నీకు చదువు ముఖ్యమో, పెళ్ళి ముఖ్యమో మాకు తెలియదా? నేనేం చదువుకున్నానని, ఆరో క్లాసు పాసయ్యానంతే!" అంది రుక్మిణి.

"నీ మాంగల్యం గట్టిగా వుంది కాబట్టి నాన్నగారింకా సర్వీసులో వుండగానే అన్న ఏదో ఉద్యోగంలో స్థిరపడ్డాడు. లేకపోతే అమ్మా, నువ్వు మమ్మల్నిద్దర్నీ పట్టుకుని రోడ్డు మీద పడేదానివి. భర్త వదిలినా, భర్త చచ్చినా ఆడదానికి డిగ్రీ అంటూ వుంటే ఏదో గౌరవప్రదమైన జీవనాధారం దొరుకుతుంది. సంఘంలో వైవాహిక జీవితం, అటుపైన మాతృత్వం స్త్రీకి పరమావధే అయితే ప్రస్తుత పరిస్థితుల్లో స్త్రీకి విద్య వరమే కానీ శాపం కాదు! ఈ సత్యం నాన్నగారెందుకు గుర్తించటల్లేదో నా కర్థం కావటల్లేదు!".

కమల మాటలు క్రిష్ణయ్యకి కొరడాదెబ్బలే అయ్యాయి. నిస్సత్తువగా కుర్చీలో కూలబడ్డాడు. తన పిల్లల దృష్టిలో తనెంతగా దిగజారిపోయిందీ ఆత్మావలోకనం చేసుకుంటూ మౌనంగా కూర్చుండిపోయాడు.

'ఎప్పుడూ నోరు విప్పని కమల ఎంత ఎత్తుకెదిగిపోయిందీ' అని ఆశ్చర్యంతో రుక్మిణి, కూతురి వైపు చూస్తూ నిలుచుండి పోయింది.

"పప్పు మాడిన వాసన వేస్తోందేమిటి?" అని హుషారుగా ఇంట్లో అడుగుపెడ్తూ అన్న సాంబశివం మాటలు విని ముగ్గురూ ఈ లోకంలో పడ్డారు.

కమల ఒక్క ఉదుటున లేచివెళ్లి గ్యాస్‌స్టవ్ ఆర్పేసింది.

వాళ్లని చూసిన సాంబశివానికి మళ్లీ ఏదో గొడవ జరిగిందనిపించింది. సంచీలోంచి ఇరవై వేలు తీసి తండ్రి ముందర వుంచుతూ, "ఇవిగో ఇరవై వేలు. ప్రిన్సిపాల్‌గారు సహాయం చేశారు. సుబ్బరామయ్యగారికి కబురు పెట్టండి" అన్నాడు.

"అవసరంలేదు. ప్రిన్సిపాల్‌గారికి డబ్బు వాపసు చెయ్యి. కమల ముందుగా బి.ఎస్‌సి. పూర్తిచెయ్యాలి. పెళ్ళో, ఇంకా పైచదువులో ఆ తర్వాత ఆలోచిద్దాం" అన్నాడు.

ఆ మాటలు నాలుక చివరి మాటలు కావనీ, హృదయపు లోతుల్నుంచి పుట్టుకొచ్చినవనీ గుర్తించిన కమల, వెళ్లి తండ్రిని కావలించుకుని భోరున ఏడ్చేసింది.

"వెర్రితల్లీ, ఏడుపెందుకు? ఇవ్వాళ మీరిద్దరూ నా కళ్లు తెరిపించారు. ఆలస్యమైతే అయిందికానీ, ఆఫీసుకి వెడ్తున్నాను" అని ఇల్లు వదిలాడు క్రిష్ణయ్య.

రుక్మిణి పిల్లలిద్దరికేసి అప్యాయంగా చూసింది.

ఏం జరిగిందో, ఏం జరుగుతోందో తెలియక తికమకపడుతూ నిలబడ్డ సాంబశివాన్ని "అన్నయ్యా రా, నీ కసలేం జరిగిందో చెప్తాను" అని చెయ్యిపట్టుకుని లాక్కువెళ్ళింది.

మాడిపోయిన పప్పుని చెత్తబాల్చీలో పడేసి, కందిపప్పుసీసా అందుకుంది రుక్మిణి.

• • •

శేషగిరి మార్నింగ్ క్లాసు తీసుకున్న తర్వాత రెగ్యులర్ పిరియడ్స్ రెండు తీసుకున్నాడు. మళ్ళీ మధ్యాహ్నం ప్రాక్టికల్స్ చూసుకోవాలి. కడుపులో కాముడు కంగారు చెయ్యడంతో ఆనంద్ భవన్ హోటల్‌కి పోయి సుష్టుగా భోజనం చేశాడు.

ఇంటిదగ్గర పార్వతికి భోజనం లేదన్న సంగతి మధ్యమధ్యలో గుర్తుకొచ్చినా, రెండు పూటలు పస్తుపెడితేనే కానీ తిక్కకుదరదనుకుంటూ ఆనందంగా భోజనం ముగించి, బయట కిళ్ళీ దుకాణంలో కిళ్ళీ కొనుక్కుని బుగ్గని దట్టించి, మోపెడ్ మీద కాలేజీత్రోవ పట్టాడు. శంకరస్వామి మఠం దగ్గర ఉన్నట్టుండి ఇంటికి వెళ్ళే వీధిలోకి మలుపు తిప్పాడు, పార్వతినోసారి చూడాలన్న కుతూహలం కొద్దీ.

ఇల్లు చేరేసరికి ఇంటికి తాళం వేసి వుంది. శేషగిరికొక్కసారిగా కంగారు పుట్టింది. కొంపదీసి ఏదైనా అఘాయిత్యానికి పూనుకోలేదుకదాని ఓ శంక మనస్సులో చోటుచేసుకుంది. చుట్టూ తిరిగివెళ్ళి, పెరట్లో నీళ్ళబావిలోకి వంగి చూశాడు. కిటికీలోంచి వంటింట్లోకి చూశాడు. మరోవైపు నుంచి తిరిగి పడగ్గది కిటికీలోంచి కూడా చూసి ఇంటి ముందుకొచ్చేసరికి గేటు తీసుకుని పార్వతి లోపలికి ఆవరణలోకి అడుగు పెడ్తోంది.

"ఎక్కడికి వెళ్లావు?" అని ప్రశ్నించాడు.

పార్వతి మొగుడికేసి ఓసారి నిర్లక్ష్యంగా చూసి మెట్లెక్కి ఇంటి తాళం తీసింది. పార్వతి వెనకనే లోపల ప్రవేశిస్తూ, "ఎక్కడికి వెళ్ళావూ అని అడుగుతున్నాను" అన్నాడు రెట్టించి.

"అడుక్కు తినడానికి!" పార్వతి కూడా అంత గట్టిగానూ సమాధానమిచ్చింది.

నిజానికి రాజారావు గది నుంచి నేరుగా బ్యాంకుకి పోయి తండ్రి పేర రెండు వేలకి డ్రాఫ్టు చేయించింది. పక్కనే వున్న పోస్టాఫీసుకి వెళ్లి తండ్రికో ఉత్తరంతోపాటు పోస్టుచేసి తిరిగి వచ్చింది. శరీరాన్ని ఎరపెట్టి డబ్బు సంపాదించవచ్చునన్న ఓ రకమైన ఆత్మవిశ్వాసం కలగడంతో, పార్వతికి కొండంత బలం పుంజుకున్నట్లుయింది. అందుకనే తలతిక్కగా సమాధానం చెప్పింది.

"కడుపునిండిందా?" వ్యంగ్యంగా అడిగాడు శేషగిరి.

'నిండకుండా జాగ్రత్త పడ్డాను' అని మనస్సులో అనుకుని, "ఎంగిలి తిండి ఎంత తింటేమటుకు సంతృప్తి కలుగుతుంది? కడుపు నిండినా గౌరవం మండిపోతుంది. అందుకని అర్ధాకలితోనే తిరిగి వచ్చాను" అంది పార్వతి శేషగిరిని రెచ్చగొడ్తూ.

"ఎవర్ని అడుక్కుతిన్నావు?" శేషగిరి మరింత కుళ్లిపోతూ అడిగాడు.

పార్వతి మాట్లాడకుండా వంటగదిలోకి వెళ్ళి, కొంగుముడి విప్పి రాజారావిచ్చిన వాచీని తీసి, ఓసారి గూట్లో వున్న కారం డబ్బాని గట్టిగా కదిపి ముందుగదిలోకి వచ్చింది. వాచీ మొగుడికి చూపిస్తూ బల్ల మీద వుంచింది.

శేషగిరి కళ్ళలో ఓ వెలుగు వెలిగింది. పార్వతి కేసి చూశాడు, ఏమిటిదన్నట్లుగా?

"మీ గోల భరించలేక పది రోజుల క్రితమే ఉత్తరం వ్రాశాను. కడుపే కాల్చుకున్నారో. తల తాకట్టు పెట్టారో లేక దొంగతనం చేశారో నాకు తెలియదు కానీ మా తమ్ముడొచ్చి ఈ వాచీ ఇచ్చి వెళ్లాడు. అడుగు పెడ్తూనే ఆకలితో మాడి ఛస్తున్నాని గ్రహించిన వాడు, నన్ను హోటల్‌కి తీసుకువెళ్ళాడు. అక్కణ్ణుంచి వాడితో బస్‌స్టాండ్‌కి వెళ్లి బస్సెక్కించి వస్తున్నాను. కట్టుకున్న మొగుడు తిండిపెట్టకపోతే, పుట్టింటి వాళ్లు పకోడీలు పెట్టించినా అడుక్కుతినడం కిందే లెక్క! వెడ్తూ వెడ్తూ అయిదు రూపాయలిచ్చి వెళ్లాడు" - బొడ్డు దగ్గర చీర మడతలోంచి నలిగిన ఓ అయిదు రూపాయల నోటు తీసి బల్ల మీద పెట్టింది.

శేషగిరికి తల తిరిగిపోయింది.

వాచీ వచ్చినందుకోపక్కన మనసానందంతో పొంగిపోతున్నా, పార్వతికి లోకువైపోయి నట్లుగా మొదటిసారి కొద్దిగా గుర్తించగలిగాడు.

'గాడిదగుడ్డేమి కాదు! ఓ పావలా మల్లెపూవులు కొనిపారేస్తే రాత్రయ్యేసరికి పక్కలోకి పరుగెత్తుకుంటూ వస్తుంది!' అనుకుంటూ, "నువ్వేదో తిరిగి సమాధానం చెప్పావన్న తిక్కకొద్దీ, స్టోర్‌రూమ్ తాళాలివ్వకుండా పోయానుకానీ మరేమీ కాదు. వంటచేసుకుని తిను" అంటూ స్టోర్‌రూమ్ తాళాలు బల్ల మీద పెట్టాడు.

చేతినున్న పాతవాచీ బల్ల మీద పెట్టి బల్లమీదనున్న వాచీని చేతికి పెట్టుకుని, "నేను కాలేజీకి పోతున్నాను. మధ్యాహ్నం ప్రాక్టికల్స్ వున్నాయి. సాయంత్రం కానీ రాను" అని మరి వెనక చూపు చూడకుండా బయటకు వెళ్లి మోపెడ్ స్టార్ట్ చేశాడు.

కొలీగ్స్‌కి కొత్త వాచీ చూపించాలన్న అతనిలోని తహతహ చూసి పార్వతి జాలిగా నవ్వుకుంది.

అయిదు రూపాయల కాగితం తీసుకోకుండా ఆ మాత్రమైనా విలువనుంచుకున్నాడు

త్రాష్టుడనుకుంటూ పార్వతి, రాజారావిచ్చిన అయిదు వందల రూపాయల నోటు జాకెట్టులోంచి పైకి తీసి, మంచం కింద తన పాత ట్రంకుపెట్టెలో బట్టలడగున దాచింది.

కావాలని వయసులో వున్న కుర్రాడికి తన కౌగిలిలో స్వర్గసుఖాలు చూపించిన పార్వతి, ఆ రోజు సంఘంలోని ఏ పెద్దమనిషి చేతుల్లో నలగవలసివస్తుందోనని ఆలోచిస్తూ, మగతగా కళ్లు మూసింది.

• • •

"రామకోటీ, నేనలా ఓసారి ఇంటికి వెళ్ళి వస్తాను. నా కోసం ఎవరైనా వస్తే ఓ గంటలో వస్తానని చెప్పు. ఒకవేళ రావడం ఆలస్యమైతే ఫైనల్ బి.ఏ. ఇంగ్లీషు క్లాసుని సర్వేశంగార్ని తీసుకోమని రిక్వెస్టు చేశానని చెప్పు. వినోద్‌కుమార్ డ్రాఫ్టు కనక పూర్తిచేస్తే, దాన్ని మీరు చూసి, నా బల్ల మీద పెట్టండి. తిరిగి వచ్చిన తర్వాత చూస్తాను" అని పరబ్రహ్మం ఇంటికి వెళ్లాడు రిక్షా మీద.

ఆ రోజు ఉదయం కోడలి వరస చూసిన పరబ్రహ్మం తల్లి వంట ప్రయత్నాల్లో వుంది. తండ్రి దొడ్లో దొండపాదులకి నీళ్లు పోస్తున్నాడు. పరబ్రహ్మం తన గదిలోకి వెళ్ళేసరికి, "నువ్విలా దిక్కుమొహంతో కూర్చుని గది వదలి మామూలుగా వుండకపోతే నాయనమ్మకీ, తాతగారికీ అనుమానం వేస్తుంది. ఈ వయసులో వాళ్లీ వార్తని తట్టుకోలేరు. నా మాట విని మామూలుగా వుండు" అని శకుంతల రాధని ఓదారుస్తోంది.

"అమ్మ చెప్పింది నిజం. నేను ఉదయం నుంచీ ఆలోచిస్తూనే వున్నాను. శేషగిరిని శిక్షించాలంటే ఈ విషయం బయటపెట్టక తప్పదు. అయితే అతని శిక్ష మాట దేముడెరిగినా, మనందరి జీవితాలూ అపహాస్యం పాలవుతాయి. అందుకని నేనో నిర్ణయానికి వచ్చాను" అన్నాడు పరబ్రహ్మం.

తండ్రి మాటలతో మళ్ళీ ధైర్యం పుంజుకుంది రాధ – తల్లి చీరకొంగుతో కళ్లు తుడుచుకుంటూ. శకుంతల ప్రశ్నార్థకంగా చూసింది.

"రాధా! నీకు బోటనీ డిమాన్‌స్ట్రేటర్ సాంబశివం తెలుసుగా?" అని అడిగాడు.

తెలుసునన్నట్లుగా తలూపింది రాధ.

"నీ పెళ్లి ప్రస్తావన అతని దగ్గర తీసుకువచ్చాను. కుర్రవాడు యోగ్యుడు. చూడ్డానికి బావుంటాడు. అతను నువ్వంటే ఇష్టపడ్తున్నట్లుగా అతని సమాధానాల్లో వ్యక్తం చేశాడు. నీ కభ్యంతరం లేకపోతే తను సిద్ధమే అన్నట్లుగా సూచించాడు. ఏమంటావు?"

"అయ్యయ్యో ఇదేం నిర్ణయమండీ, కులగోత్రాలు చూడకుండా?" శకుంతల ఆందోళనగా అంది.

"కులగోత్రాలు చూసి మానభంగాలు జరగవు! సంఘంలో కులగోత్రాలని పక్కకి నెట్టినప్పుడు వివాహాలు త్వరగా జరుగుతాయి. శకుంతలా! ప్రస్తుత పరిస్థితిలో రాధకి వెంటనే వివాహం చెయ్యడం మంచిది.

"నాన్నగారూ! నా కడుపులో పెరుగుతున్న జీవం మాట?" రాధ నెమ్మదిగా ప్రశ్నించింది.

"ఏడో నెల జననాలనేకం జరుగుతాయి. అనుమానానికి తావుండదు. అందుకనే పెళ్లి జరగడం వెంటనే ముఖ్యం"

"భ్రూణ హత్య చేయించినా వార్త పైకి పొక్కి పేరుప్రతిష్ఠలకి భంగం వస్తుందన్న భయంతో మీరీ ప్రయత్నానికి పూనుకోవడం భావ్యం కాదు. ఈ వివాహం జరిపించి మీరు శ్వాస పీల్చుకున్నా, మొదటి రాత్రి మొదలు జీవితాంతం నేను దోషిగా జీవించనూ లేను. అనీచుడి రూపాన్ని పెంచనూ లేను. నావరకూ ఎందుకు, మీరిద్దరూ ఆ పుట్టబోయే శిశువుని ఎత్తుకుని ముద్దాడగలరా?!"

పరబ్రహ్మం అవాక్కయిపోయాడు. నిజానికి తనంత దూరం ఆలోచించలేదు. పరబ్రహ్మం కాలేజీలో జరిగినదంతా చెప్పి, "నేనతనికి చెక్ కూడా ఇచ్చేశాను. నా మాట మీద ఈపాటికే నీ మీద ఆశలు పెంచేసుకునివుంటాడు, ఎలా?" అన్నాడు.

"మీరు చెక్ ఇస్తోన్నప్పుడు ఎవరికిష్టంలేకపోయినా బలవంతం లేదని చెప్పారుగా. అందుకని బెంగ లేదు. ప్రస్తుతం నేను వివాహం చేసుకోడానికి సిద్ధంగా లేనన్నాని ఆయనతో చెప్పండి. అతనికి మీరందించిన సహాయాన్ని అలానే వుండనీయండి. నా కతి సన్నిహితురాలైన స్నేహితురాలి అక్క బొంబాయిలో డాక్టరు. నన్ను బొంబాయి పంపిస్తే ఇంటికి దూరంగా ఈ గొడవ వదుల్చుకుంటాను."

రాధ దృఢనిశ్చయం చూసి పరబ్రహ్మం, శకుంతలా ఆశ్చర్యపోయారు. ఎంత ఏడ్చినా, ఆ గుండెలో ఇంత ధైర్యముందని గ్రహించగలిగారు.

పరబ్రహ్మం రాధ తల నిమురుతూ, "నీలో వున్న వివేకం నాలో లేనందుకు చింతిస్తున్నాను. అవివేకంతో తొందరపడ్డాను. సాంబశివానికి సహాయం చేసినందుకు చింతలేదు కానీ, అతన్ని ఉచ్చులోకి లాగడానికి చేసిన ప్రయత్నానికి సిగ్గుపడుతున్నాను. నేను నైతికంగా పతనం చెందకుండా కాపాడావు. ఇంక నేనే పరిస్థితికి భయపడదల్చుకోలేదు. బొంబాయి ప్రయాణానికి సిద్ధమవు. ఏర్పాట్లు చేస్తాను" అన్నాడు పరబ్రహ్మం.

రాధ నీళ్లు నిండిన కళ్ళతో తండ్రిని చూసి, తల్లి భుజం మీద వాలింది. పరబ్రహ్మం మరి మాట్లాడకుండా కాలేజీకి బయలుదేరాడు – "వచ్చినవాడవు ఎలాగూ వచ్చావు, కాస్త భోజనం చేసి వెళ్లకూడదట్రా?" అన్న తల్లి మాటల్ని వినిపించుకోకుండా.

❁ ❁ ❁

శేషగిరి కోలాహలంగా వున్న సైన్సు బ్లాక్ స్టాఫ్‌రూమ్‌లో అడుగు పెట్టాడు. కొంతమంది కాంటీన్ నుంచి తెప్పించుకున్న టిఫిన్లు తింటూంటే, మరికొందరు ఇళ్ళనుంచి వచ్చిన కారియర్లని ముందేసుకుని కూర్చున్నారు. కొంతమంది చెప్పవలసిన పాఠాల్ని చూసుకుంటున్నారు. ఖాళీగావున్న కుర్చీలో కూర్చుని దర్జాగా రెండు చేతుల్నీ బల్ల మీద పెట్టాడు శేషగిరి.

పక్కనే కూర్చుని పెసరట్టు ఉప్మాతో కలయబడ్తున్న మాథమెటిక్స్ లెక్చరర్ మాధవరావు

కంటబడింది. శేషగిరి చేతినున్న కొత్త వాచీ, "ఏమిటో లేటెస్ట్ వాచీ కొన్నట్టుగా వున్నారు?" అన్నాడు.

అందరి దృష్టీ శేషగిరి మీద పడింది. చిద్విలాసంగా తలపంకించాడు శేషగిరి.

"మీ చేతి నుంటే ఆ వాచీ వింతలు మాకేం తెలుస్తాయి? ఓసారిలా యివ్వండి, అందరమూ చూస్తాం!" అన్నాడు మాధవరావు.

శేషగిరి వాచీ తీసి ఇచ్చాడు. అది క్షణాల్లో అందరి చేతులూ మారి, ఫిజిక్స్ లెక్చరర్ శ్రీకంఠస్వామి చేతి కొచ్చింది. దాన్ని తిరగా మరగా చూస్తూ, "ఇటువంటి వాచీ ఈ రోజు చూడ్డం నాకిది రెండోసారి. ఈ రోజు ఉదయం మార్నింగ్ క్లాస్‌లో రాజారావనే విద్యార్థి ఇటువంటి వాచీని పెట్టుకువచ్చి, ఇతర విద్యార్థుల దృష్టి నాకర్షించి నా క్లాసు చెడగొట్టాడు. ఆగండాగండి... ఇటువంటి వాచేం ఖర్మ? ఇదే వాచనుకుంటాను యస్, అదే సీరియల్ నంబరు ట్రిపుల్ త్రీ! నాకు బాగా గుర్తు!" అన్నాడు.

శేషగిరికి తల తిరిగింది.

"మాస్టారు ట్యూషన్ ఫీజుతోబాటు వాచీని కూడా గురుదక్షిణగా తీసుకున్నారేమో?" అన్నాడు మాధవరావు కాస్త వ్యంగ్యంగా.

శేషగిరి ముఖం వెలవెలబోయింది. శ్రీకంఠస్వామికి తను తొందరపడ్డానేమోననిపించింది. ట్యూషన్లు చెప్పడం అందరికీ పరిపాటే అయినా, ఎవరూ బాహాటంగా ఒప్పుకోరు. అయితే ఓ విద్యార్థి చేతినున్న వాచీని శేషగిరి తీసుకున్న వైనం, తనన్న మాటలవల్ల బయటపడిందని కొద్దిగా ఇబ్బందిపడ్తూ, వాచీని శేషగిరికి అప్పచెప్పాడు.

శేషగిరికి, రాజారావు తమ పక్కింటి డాబా గదిలో అద్దెకుంటున్నాడని తెలుసు. శ్రీకంఠస్వామి అంత ఖచ్చితంగా సీరియల్ నంబరు చెప్పగలిగాడంటే ఇది తప్పకుండా రాజారావు వాచే అయ్యుంటుంది. సందేహం లేదు. అయితే ఇది పార్వతి తమ్ముడికెలా వచ్చినట్లు? ప్రశ్నలు బుర్రని బ్రద్దలు కొడ్తూంటే నిర్జీవంగా వాచీని అందుకుని చేతికి పెట్టుకున్నాడు. లేని నవ్వు బలవంతంగా తెచ్చుకుని –

"ఎస్, ఇది రాజారావు వాచే. రాజారావు మా పక్కింట్లో వుంటాడు. నిన్న సాయంత్రం చూసి యథాలాపంగా బావుందన్నాను. ఈ రోజు మార్నింగ్ క్లాసు నుంచి తిరిగి వచ్చిన తర్వాత రాజారావు వచ్చి 'సార్! వాచీ బావుందన్నారు. మీరు దీన్ని తీసుకోండి, నేను మరోటి తెప్పించుకుంటాను' అన్నాడు. రాబోయే యూనివర్సిటీ పరీక్షల్లో కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌ని దృష్టిలో వుంచుకుని, కాకా పట్టడానికి ప్రయత్నిస్తున్నాడేమోనని సంశయం కలిగింది. అతనికి నచ్చచెప్పి ఇండియాలో వున్న దీని ధర పన్నెండు వందలూ ఇచ్చి తీసుకున్నానుకానీ, రాజారావుకి నేను ట్యూషన్ చెప్పటల్లేదు!" అన్నాడు.

అక్కడున్నవారిలో చాలామందికి, ముఖ్యంగా పాతవారికి, శేషగిరి నైజం తెలుసు. శేషగిరి సమాధానం విని చిన్నగా నవ్వుకుంటూ, అందరూ తమతమ పనుల్లో మునిగిపోయారు.

శేషగిరి లేచి, భారంగా అడుగులు వేసుకుంటూ, కెమిస్ట్రీ లేబొరేటరీలో అడుగు పెట్టాడు. వెంటనే వెళ్లి పార్వతిని నిలదీసి అడుగుదామని అనిపించింది. అయితే చేయించవలసిన ప్రాక్టికల్స్ గుర్తుకొచ్చి, పరీక్షల ముందు ప్రాక్టికల్స్ క్లాస్ తీసుకోవడం మానేస్తే మాట దక్కదనుకుంటూ, అటెండర్ని పిలిచాడు, స్టాండర్డ్ సొల్యూషన్స్ తయారుచేసే ప్రయత్నంలో.

శేషగిరి స్టాఫ్‌రూమ్ వదలగానే, మాధవరావు ఓ చీటీ రాసి, స్టాఫ్‌రూమ్ ప్యూన్‌ని థర్డ్ బి.ఎస్‌సి క్లాస్‌రూమ్ దగ్గరకు పంపాడు. మాథమెటిక్స్ చెబుతున్న లెక్చరర్ పద్మనాభం ఆ చీటీ చూసి, "మిస్టర్ రాజారావ్! నిన్ను స్టాఫ్‌రూమ్‌లోకి రమ్మనమని మాధవరావుగారు కబురంపారు. వెంటనే వెళ్ళు" అన్నాడు.

'ఎందుకో?' అనుకున్నారందరూ, రాజారావు సహితంగా.

సందేహిస్తూ అడుగులో అడుగు వేసుకుంటూ, స్టాఫ్‌రూమ్‌లో ప్రవేశించాడు రాజారావు.

మాధవరావు రాజారావుని దగ్గరగా రమ్మని, "నువ్వేదో కొత్త వాచీ పెట్టుకుని వచ్చావనీ, అది చాలా బావుందనీ, ఫిజిక్స్ లెక్చరర్ శ్రీకంఠస్వామిగారు చెప్పారు. ఏదీ ఓసారి చూడనివ్వు!" అన్నాడు.

రాజారావు గది చుట్టూ చూశాడు. అందరి దృష్టీ తన మీదే వుండడం గమనించాడు. రాజారావుకేమీ అర్థం కాలేదు.

"మార్నింగ్ క్లాసయిన తర్వాత రూమ్‌కి వెళ్ళాను సార్. స్నానం చేసిన తర్వాత అలవాటు ప్రకారం పాత వాచీ పెట్టుకుని వచ్చేశాను" అన్నాడు.

"సరే రేపు కాలేజీ కొచ్చినప్పుడు తీసుకొచ్చి చూపించు. మాలో చాలామందికి అటువంటిదీ కొనాలనివుంది. ఇంతకీ దాని ధరెంత?" అన్నాడు.

పార్వతితో ఇరుకు సుఖాన్ననుభవించిన తను ఓ ఇరుకు పరిస్థితిలోకి వెడుతున్నట్టు గ్రహించాడు రాజారావు.

"అలాగే సార్. దాన్ని రేపు చూపిస్తాను. మా బాబాయ్ దాన్ని టోక్యో నుంచి పంపాడు. అసలు ధర తెలియదుకానీ బొంబాయి మార్కెట్లో ఏడెనిమిది వందలకి దొరుకుతోందనుకుంటాను" అన్నాడు.

మాధవరావు కాస్త ఆలోచించి, "చూడు రాజారావు, నిజం చెప్పు. నీకు డబ్బు అవసరం వచ్చి, ఆ వాచీని ఏ రెండు వేలకో కొన్నట్లుగా చెప్పి, శేషగిరిగారి దగ్గర తాకట్టుపెట్టి పన్నెండువందలు తీసుకున్నావు కదూ?" అన్నాడు.

రాజారావుకి ఆ ప్రశ్న ఆసరాగా దొరికింది. పార్వతి శేషగిరికి వాచీ ఇస్తుందని తెలుసుకానీ, శేషగిరి దాన్ని వెంటనే వేసుకుని కాలేజీకి వస్తాడని ఊహించలేదు. అయితే అది ఇదీ ఒకటేనని, శ్రీకంఠస్వామి గుర్తించి వుంటాడు.

శేషగిరి ఎందుకో తాకట్టు మీద తనకి పన్నెండు వందలిచ్చానని చెప్పివుంటాడు. కొన్నాడని ఎందుకు చెప్పలేదో? అసలు విషయం ఎవరికీ తెలియదు. తెలియకూడదు కూడా. ఇదీ ఒకందుకు

మంచిదేననుకుంటూ, అవునన్నట్లుగా తల ఊపాడు.

"సరే. నువ్వెళ్ళు. నువ్విలా వస్తువులు తాకట్టు పెట్టి డబ్బు కోసం ప్రయత్నిస్తున్నావని తెలిస్తే, కుబేరుడైన మీ నాన్నగారికి తలవంపులు కాదయ్యా? నిన్నో కంట చూస్తూండమని ఆయన చెప్పబట్టి కానీ, మాకెందుకు?" అన్నాడు మాధవరావు.

రాజారావు మాధవరావు మాటల్ని నమ్మలేదు. 'ఉదయం జరిగిన ఘనకార్యం తెలుసుకున్న తండ్రి పల్లెత్తు మాట అనని విషయం వీళ్ళకేం తెలుసు? తన తండ్రి ఇంతవరకూ తనమీద నిఘా వెయ్యమని ఎవ్వరికీ చెప్పలేదు, చెప్పబోడు కూడా' అనుకుంటూ రాజారావు స్టాఫ్‌రూమ్ వదిలాడు. మళ్లీ క్లాసుకి వెళ్లకుండా జరిగిన సంగతి పార్వతికి చెప్పి ముందుగా హెచ్చరిక చేద్దామని, స్కూటరెక్కి, ఇంటిదారి పట్టాడు.

రాజరావు గది వదలగానే, "చూశారా, శేషగిరిగారి వడ్డీ వ్యాపారం? ఆఖరికి స్టూడెంట్లు కూడా ఈయన ఉచ్చులో బిగుసుకుపోతున్నారు!" అన్నాడు- ఓసారి అత్యవసర పరిస్థితి వచ్చి వంద రూపాయలు చేబదులడిగి శేషగిరి దగ్గర అవమానం పొందిన మాధవరావు.

మాధవరావు మాటలు మోసుకొచ్చిన మరో లెక్చరర్ ద్వారా శేషగిరి జరిగిందంతా తెలుసుకున్నాడు. మాధవరావు తన వడ్డీ వ్యాపారాన్నందరికీ చెప్పి హేళన చేస్తున్నాడు. పార్వతి మీద నిలువెత్తు కోపం ముంచుకొచ్చింది.

ఇంతకీ రాజారావు వాచీ పార్వతికెలా వచ్చింది? తను కొన్నానని చెప్తే, రాజారావు తాకట్టుపెట్టానంటున్నాడు? పార్వతి తమ్ముడు కానీ, పార్వతి కానీ దొంగతనం కానీ చెయ్యలేదుకదా? అంతకుమించి ఆలోచించలేకపోయాడు శేషగిరి. సమాధానం కోసం సాయంత్రం వరకూ ఆగవల్సిందే.

❁ ❁ ❁

వినోద్‌కుమార్ మనసు మనసులో లేదు. రామకోటి పెట్టిన చివాట్లు మాటిమాటికీ గుర్తురావడంతో, స్పీడు కుంటుబడింది. రెండు పేజీలు టైపు చేసిన తర్వాత కానీ తను డ్రాఫ్టుని డబుల్ స్పేస్‌తో కాక సింగిల్ స్పేస్‌తో టైపు చేసినట్టు గుర్తించలేదు. ఉసూరుమంటూ వాటిని చించిపారేసి, మళ్ళీ డబుల్ స్పేస్‌తో మొదలు పెట్టాడు. పార్కులో కలవబోయే కాంతం, లైనుకీ లైనుకీ మధ్య మనసులో మెదలడంతో, వినోద్‌కుమార్‌కి రిపోర్టుని టైపు చెయ్యడానికి గగనప్రయత్నమే చెయ్యవలసి వచ్చింది.

రిపోర్టుని రామకోటి బల్లమీద పెట్టి, "మీరు దీన్ని చూసి ప్రిన్సిపాల్‌గారికివ్వండి. ఆయన సరిచేసిన తర్వాత ఫైనల్‌గా చేస్తాను. నా కర్జంటుగా ఓ చిన్నపని వుంది. రెండు గంటలు సెలవు కావాలి" అన్నాడు.

"సరేకానీ, అదేపనిగా వెళ్లిపోతే కుదరదు! నాలుగైదు ముఖ్యమైన ఉత్తరాలకి రిప్లై ఇవ్వాలి. మరిచిపోకుండా మళ్లీ కాలేజీకి రండి" అన్నాడు రామకోటి.

"అలాగే" ముఖం మాడ్చుకుంటూ అని వినోద్‌కుమార్ బయట పడ్డాడు.

స్కూటర్ మీద ఇంటికి పోయి, స్నానం చేసి, దుస్తులు వేసుకుని, మార్కెట్లో విపరీతంగా అమ్ముడవుతున్న ఓ మగసెంటు మెడలనిండా పూసుకుని, హుషారుగా మునిసిపల్ పార్క్‌కి దారితీశాడు.

పార్క్ బయట స్కూటరాపి, లోపలికి ప్రవేశించి, కాలువగట్టుపైనున్న నిద్రగన్నేరు చెట్టు కింద సిమెంటు బెంచీ మీద కూర్చున్నాడు. చెల్లాచెదురుగా అక్కడక్కడా రిక్షవాళ్లూ, రోడ్డు వేసే కూలీలు చెట్ల నీడలో కాస్త సేద తీర్చుకుంటున్నారు. ఏకాంతానికి పర్వాలేదనిపించింది.

అడుగులో అడుగు వేసుకుంటూ వస్తున్న కాంతం కనబడ్డంతో, వినోద్‌కుమార్ ఇంత నవ్వుని ముఖానికి పులుముకుని లేచి నిల్చున్నాడు. కాంతం దగ్గరగా రాగానే, "ఈ ఉదయం మీ సమాధానం కోసం ఎంతగా ఎదురు చూశానో, ఇందాకట్నుంచీ మీ కోసం అంతగానూ ఎదురుచూస్తున్నాను, కూర్చోండి" అన్నాడు.

కాంతం అలవోకగా వినోద్‌కుమార్‌ని చూస్తూ, చిరునవ్వు నవ్వుతూ బెంచీకి ఓ చివరగా కూర్చుంది.

వినోద్‌కుమార్ మనసు కొద్దిగా వశం తప్పుతూండగా, నిగ్రహించుకుని కూర్చున్నాడు. ఆకలితో కాంతాన్ని మింగేటట్టు చూసే చూపులు, పక్కనే వున్న మరో నాలుగైదు చెట్ల వెనక సర్దుకున్న ఓ అరడజను మంది యువతుల్ని చూడలేకపోయాయి.

"మీరు రావడం అంగీకారంగా తీసుకుంటున్నాను" అన్నాడు వినోద్‌కుమార్ నవ్వుతూ.

"అలాగనే ఎందుకనుకోవాలి? మా అక్క పద్మని గురించి మరోసారి మిమ్మల్ని అడుగుదామని వచ్చానని ఎందుకనుకోకూడదు?" అంది కాంతం కూడా చిన్నగా నవ్వుతూ.

"నా అభిప్రాయం మీకు ముందుగానే చెప్పాను. నేనిష్టపడ్తోన్నది మిమ్మల్ని"

"మీ అభిప్రాయం తెలియజేసి మా అక్కకెంత మానసిక క్షోభ కలిగించారో మీకేం తెలుసు? మా అక్క నచ్చకపోతే, లేదా కట్నం సరిపోకపోతే ఆమేరకు కబురంపాలి కానీ, నేను నచ్చానని చెప్పడంలో సభ్యత ఏమైనా వుందా?"

తనూహించుకున్న శృంగార సంభాషణా రాగంలో, పెడదారి పట్టిన కాంతం మాటలు అపశ్రుతులు పలికాయి.

"ఇందులో నేను చేసిన తప్పేముందని?! మధ్యవర్తుల ద్వారా మీ అక్క సంబంధం కోసం కబురంపారు. నేను వచ్చి చూశాను. కానీ నాకు మీరు నచ్చారు. వివాహమనేది నా జీవితానికి సంబంధించిన విషయం కాబట్టి, నా మనసులో వున్న మాట మీకు తెలియజేశాను. ఇందులో వున్న అసభ్యత ఏమిటో నాకు తెలియటల్లేదు!"

"మా అక్క నచ్చలేదని మీరు మరో ఏ స్త్రీని వివాహమాడినా అది సర్దిపెట్టుకోగల విషయం. అయితే మీరు పంపిన కబురు మా ఇద్దరికీ ఎంతటి మానసిక వ్యధ కలిగించగలదో మీరూహించగలరా? అందుకనే సభ్యత కాదన్నాను."

"ఎవరికైతేనేం పెళ్ళి కుదిరిందికదా అని చాలామంది ఇళ్లలో ఇటువంటి వివాహాలు జరిగాయి.

జరుగుతోనే వుంటాయి. సర్దిపెట్టుకుపోతే ఏగొడవా వుండదు. తీవ్రంగా ఆలోచిస్తేనే వస్తుంది చికాకంతా" అన్నాడు వినోద్‌కుమార్ తేలిగ్గా.

"మీ మాటల్లో పురుషాహంకారం కొట్టవచ్చినట్టు కనబడ్తోంది. ఆడదానికి వివాహం జరిగితే జన్మ తరించినట్టే మాట్లాడుతున్నారు! సరే, అదే భావనతో నేనీ వివాహానికి అంగీకరించాననుకోండి. నేను మీకు నచ్చాననంటున్నారు కాబట్టి కట్నం కాన్సిల్ చేస్తారా, లేదా కన్సెషన్ ఏదైనా ఇస్తారా?" అంది కాంతం కవ్వింపుగా.

అంటే నిజానికి తనూ ఇష్టపడ్తోంది. కాకపోతే కట్నం ఎగ్గొట్టడానికి కాస్త మాటల్లో తిరకాసు పెడ్తోంది. ఘటికురాలే!

"ఈ విషయంలో నాకు స్వేచ్ఛ లేదు. ఈమాత్రమైనా కట్నం లేకుండా మావాళ్ళంగీకరించరు" అన్నాడు కాస్త ఇబ్బందిగా.

"పోనీ కట్నం ఇస్తామనుకోండి. కానీ పెళ్ళయిన తర్వాత ఉద్యోగం మానేస్తే?"

"అదీ... అదీ...." వినోద్‌కుమార్ నీళ్లు నమిలేశాడు.

"అవును, ఉద్యోగం వుంది కాబట్టే ఈమాత్రం కట్నమంటారు! అంతేగా? పిల్ల నచ్చడం మీ జీవితానికి సంబంధించిన విషయం! కట్నకానుకలు నిశ్చయించడం మీ తల్లిదండ్రులకి సంబంధించిన విషయం! మీలాంటి వ్యక్తిత్వం లేని పురుషుల్ని పెళ్ళాడి వ్యక్తిత్వమున్న స్త్రీలు సుఖపడలేరు! ఏమంటారు?" కాంతం చాలా కటువుగా, కసిగా అంది.

వినోద్‌కుమార్ అహం దెబ్బతింది.

"ఇష్టంలేకపోతే ఆ సంగతి చెప్పొచ్చుకానీ ఇలా మనిషిని పిలిచి అవమానపర్చడంలో మీకు మట్టుకు ఏం సభ్యత వుందని?" రోషంగా అన్నాడు.

"అదే మహానుభావా, మొదట్లో నేనన్నదీను! తనదాకా వస్తేనేకానీ తెలియదనడం ఇదే మరి!

"సరే మీ సమాధానం తెల్సింది. అదీ నా అదృష్టమే! ఇటువంటి అహంకారంగల స్త్రీని పెళ్ళాడి ఏ పురుషుడూ జీవితాన్ని సవ్యంగా గడపలేడు! మీ పొగరు గురించి అందరి తోటీ చెప్పకపోతే నా పేరు వినోద్‌కుమార్ కాదు. వస్తాను" అంటూ లేచాడు.

అతడు లేచేసరికి చెట్ల చాటున దాగున్న యువతులందరూ ముందుకు వచ్చి చుట్టుముట్టారు.

"చూడండి వినోద్‌కుమార్! ఒకవేళ మా అక్క ఖర్మ కాలి మీరు తనని వివాహం చేసుకున్నా, నా ఖర్మ కాలి నేను మిమ్మల్ని వివాహం చేసుకున్నా, మీ కట్నదాహంలో మా బ్రతుకులే నాశనమయ్యేవి. అయితే ఆ పార్వతీపురం పోలీసు కానిస్టేబులెవరో మాకు తెలియదుకానీ, అతనికి చేతులెత్తి మొక్కుతున్నాం. లేకపోతే మీ మొదటి భార్యలాగా నిలువుగా ఆహుతి అయిపోయేవాళ్లం. మీ తల్లీకొడుకులిద్దరూ ఆమెని నిలువునా కాల్చిపారేశారని ఊరూవాడా చాటించకపోతే నా పేరూ కాంతం కాదు!"

వినోద్‌కుమార్ తల తిరిగిపోయింది. నిస్సత్తువగా బెంచీ మీద కూలబడ్డాడు.

కాంతంతో సహా గుమిగూడిన యువతులందరూ, "మొదటి పెళ్ళాన్ని కాల్చి చంపిన భ్రష్టుడికి మళ్ళీ పెళ్ళి కావాలట!" అని అరుచుకుంటూ వెళ్ళిపోయారు.

సేదదీర్చుకుంటున్న మనుషులు అరుపులు విని పరుగెత్తుకువచ్చి వినోద్‌కుమార్‌ని చూసి గేలిచేయడం మొదలు పెట్టారు.

అవమానం దేహాన్ని దహిస్తోంటే నెమ్మదిగా పార్కు బయటకు వెళ్ళి స్కూటర్ని నడుపుతున్న వినోద్‌కుమార్ రాంగ్‌సైడ్‌లో వెళ్తున్నానని గుర్తించకుండా, ఎదురుగా వస్తున్న సైకిల్ని గుద్దేశాడు.

కిందపడిన ఇద్దరు వ్యక్తులూ, గుమిగూడిన వ్యక్తులూ, "కళ్లు నెత్తిమీద పెట్టుకుని డ్రైవ్ చేస్తావట్రా రాస్కెల్" అంటూ వినోద్‌కుమార్‌కి దేహశుద్ధి చేశారు.

మరో చెట్టు చాటున నక్కి జరిగిన వ్యవహారమంతా చూసిన వెంకటస్వామి కాలేజీకి పరుగెత్తాడు - రామకోటికి చెప్పడానికి. దారిలో తన్నులు తింటూన్న వినోద్‌కుమార్‌ని దూరం నుండి చూసి, అటువైపు ఒక అడుగు వెయ్యబోయి, మళ్ళీ తమాయించుకుని కాలేజి దారే పట్టాడు.

❁ ❁ ❁

రాఘవరావు ఇంటికి వెళ్లేసరికి, రాజేశ్వరి డైనింగ్ టేబుల్ మీద మధ్యాహ్న భోజనం కోసం చేసిన వంటకాల గిన్నెల్నీ, కంచాల్నీ సర్దుతోంది. పడగ్గదిలోకి వెళ్లి గోడకి ఓ పక్కగా వున్న రెండు వి.ఐ.పి. సూట్‌కేసుల్ని చూశాడు. పెళ్ళిప్రయాణానికి సిద్ధమౌతోంది అని చిన్నగా నవ్వుకుంటూ, వాష్‌బేసిన్ దగ్గరకు వెళ్లి మొహమూ, చేతులూ కడుక్కుని, టవల్‌తో తుడుచు కుంటూ, డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. రాజేశ్వరి వడ్డించడం మొదలు పెట్టింది.

"పెళ్లికి వెళ్ళడానికి మహాకంగారులో వున్నట్టున్నావు?" అన్నాడు నవ్వుతూ.

"ఏదీ, బేబీ ఇంకా స్కూలు నుంచి రాలేదు. మరో అరగంటలో వచ్చేస్తుంది. అది రాగానే బయలుదేరతాం" అంది రాజేశ్వరి ఉత్సాహంగా.

"ఇంత ఎండలో బయలుదేరడమెందుకు? సాయంత్రం చల్లబాటు వేళన బయలుదేరితే బావుంటుంది. రేవు వరకూ జీపులో పంపిస్తాను" అన్నాడు భోజనానికుపక్రమిస్తూ.

"లేదు, ఇప్పుడు బయలుదేరి ముక్తేశ్వరం వెళ్లి అక్కడ మా పిన్ని కూతురి దగ్గర సాయంత్రం వరకూ వుండి, వస్తే తనని కూడా తీసుకుని బయలుదేరతాను. అన్నట్టు చెప్పటం మరిచాను. మీ కంట్రాక్టరు కోటీశ్వర్రావట, ఇప్పటికే రెండుసార్లు వచ్చాడు మీరొచ్చారా అంటూ. మొదటిసారి వచ్చినప్పుడు వంద చెరకు రసాల బుట్ట తీసుకొచ్చాడు. బాబూరావు కూరలు తీసుకొచ్చినప్పుడు అతని ద్వారా కిలో జీడిపప్పు పంపించాడు. రెండోసారి వచ్చినప్పుడు చేతులు నలుపుకుంటూ మీరతన్నేదో కావాలని తిప్పిస్తున్నట్లుగా బాధపడుతూ 'అయ్యగారితో ఒకటీ అయిదు వరకు సిద్ధం అని చెప్పండమ్మా. ఇప్పటికే హైదరాబాద్‌లో చాలా ఇచ్చుకోవలసివచ్చింది' అని ఏవేవో అని, అయ్యగారితో మళ్ళీ వస్తానని చెప్పండి' అంటూ వెళ్ళిపోయాడు" అంది కళ్ళు తిప్పుతూ.

"మళ్లీ ఎప్పుడొస్తానన్నాడు?" ఆత్రుతగా ప్రశ్నించాడు.

అతని ఆత్రుత చూసి చిన్నగా చిరునవ్వు నవ్వింది.

"మీ కోసం ఏ రోడ్డుమూలో పడిగాపులు పడ్తూ కూర్చుని వుంటాడు. ఈ రోజే మళ్ళీ వస్తానన్నట్టుగా చెప్పాడు. మీరేమీ అనుకోనంటే ఓ మాట. మీ లావాదేవీలేమిటో నాకు తెలియదు కానీ, అతను ఒకటీ అయిదు కంటే ఇవ్వలేనంటున్నాడు. అయినా వాళ్ళని మాటిమాటికి ఇళ్ల చుట్టూ తిప్పించుకుంటే, ఒకటి చూసేవాళ్ళకి బావుండదు. రెండోది మొదటికే మోసం రావచ్చు. ఎందుకంటే, హైదరాబాద్ వాళ్ళని చేతిలో పెట్టుకున్న కంట్రాక్టరు, మీరు మరీ బిగుసుకుపోతే మొండిచెయ్యి చూపించి పైనుంచి ఒత్తిడి తీసుకొస్తాడు. ఏదో నాకు తట్టింది చెబ్తున్నాను. మీరీ వ్యవహారాలేవో తొందరగా తేల్చుకుంటే నయం!" అంది రాజేశ్వరి ఏదో మాటవరసకి చెప్పినట్టుగా నటిస్తూ.

రాఘవరావు కొంచెంగా విస్తుపోయాడు రాజేశ్వరి మాటలకి. ఆమె మాటల్లో నిజం లేకపోలేదు. నిజానికి పరాంకుశంతో మాట్లాడినప్పుడు, ఒకటి కంటే ఎక్కువిచ్చేటట్లు లేదని తను చెప్పాడు ముందుజాగ్రత్తతో.

హైదరాబాద్‌లో విషయాలన్నీ ఓ కంట కనిపెడ్తున్న పరాంకుశం 'కంట్రాక్టు పొందడం కోసం కోటీశ్వర్రావిక్కడ చేసిన ప్రయత్నాలు నీకు తెలియనివి కావు. నువ్వు మరీ బిగిస్తే, అతగాడెక్కువ ఇచ్చినా, పని పూర్తిగా దెబ్బతింటుంది. అది అందరికీ ప్రమాదం. అందుకని కాస్త లౌక్యంగా వుండి జాగ్రత్తగా ప్రవర్తించు. సరే నా శాతం మరిచిపోకు' అన్నాడు.

లక్షలో పరాంకుశానికి ఇరవై శాతం పోయినా, పై ఏభై వేలూ కొరుకుడు లేకుండా అదనంగా అంతా తనకే మిగిలిపోతుంది. ఇదీ బాగానే వుందనుకున్నాడు.

"సరే, ఆ గొడవలన్నీ నీకెందుకుగానీ, బేబీ రాగానే నువ్వన్నట్టుగా వెంటనే బయలుదేరి వెళ్ళు" అన్నాడు.

ఆ మాటల్లో రాఘవరావు సమాధానం రాజేశ్వరికి లభించింది. ఈ మాటు కోటీశ్వర్రావు కలిస్తే భర్తని ఒప్పించడానికి తానెంత కష్టపడిందీ చిలవలు పలవలుగా కల్పించి చెప్పొచ్చు. అయితే మొదట్లోనే రెండూ ఇచ్చుకుంటే, అది కోటీశ్వర్రావు ఖర్మ అనుకుంది.

మరో పది నిముషాల్లో రిక్షావాడు బేబీని ఇంటి దగ్గర దింపాడు. బేబీతోపాటు భోజనం చేసి, బట్టలు మార్చుకుని, వెళ్లి ముందు సీట్లో మధ్యగా బేబీని కూర్చోపెట్టి తను చివరగా కూర్చుంది. ఈలోపుగా డ్రైవరు సూట్‌కేసుల్నీ, మామిడిపళ్ల బుట్టనీ జీపులో వెనుక పెట్టాడు.

"ఇద్దర్నీ ముక్తేశ్వరంలో దింపి వెనక్కి వచ్చి ఆఫీసుకి వెళ్ళిపో. మూడొంతులు మళ్ళీ ఆఫీసుకి వెళ్ళను. ఒకవేళ జీపు కావలిస్తే ఫోన్ చేస్తాను" అని డ్రైవర్‌కి చెప్పి, "రేవు దాటుతున్నప్పుడు జాగ్రత్త. నేను పెళ్లినాటికి, వీలైతే ఒకరోజు ముందర వస్తాను" అని రాజేశ్వరితో అన్నాడు.

జీపు కదిలి ముక్తేశ్వరం దారి పట్టింది.

రాఘవరావు హాల్లో సోఫాలో కూర్చుని ఆ రోజు పేపరు తిరగవేస్తూ, కోటీశ్వర్రా వెప్పుడొస్తాడా అని ఎదురు చూడసాగాడు.

కాలింగ్ బెల్ మోగడం విని, రాఘవరావు ఒక్క ఉదుటున వెళ్లి తలుపు తీశాడు, ఎదురుగా బ్రీఫ్‌కేసు పట్టుకుని నిలబడివున్న యువతిని చూసి ఒక్క క్షణం విస్తుపోయాడు.

"రాఘవరావుగారిల్లు ఇదేనా?" అడిగిందా యువతి.

"నేనే రాఘవరావుని. రండి" అన్నాడు పక్కకు తప్పుకుంటూ. కూర్చోండన్నట్టుగా సోఫా చూపించాడు.

ఆమె సోఫాలో కూర్చుంది. పక్క సోఫాలో తను కూర్చుంటూ ఆమె వంక నిశితంగా చూశాడు రాఘవరావు.

"మిమ్మల్నెక్కడో చూసినట్టుగా వుంది. కానీ గుర్తుకురావట్లేదు" అన్నాడు.

"నా పేరు పార్వతి. ఈ ఊరి కాలేజీ కెమిస్ట్రీ లెక్చరర్ శేషగిరిగారి భార్యని. మీరు నన్నేదైనా కాలేజీ ఫంక్షన్లో చూసుంటారు. లేదా శివాలయంలో చూసుంటారు!" అంది నవ్వుతూ.

రాఘవరావుకేమనాలో పాలుపోలేదు. బహుశా రాజేశ్వరి కోసమని వచ్చివుండొచ్చు.

"మీరొకవేళ రాజేశ్వరి కోసమే వచ్చినట్లయితే ఆమె ఊళ్ళో లేదు. ఓ గంట క్రితం బయలుదేరి పుట్టింటికి వెళ్ళింది. వాళ్ళ చెల్లి పెళ్లి త్వరలోనే జరగబోతోంది. ఆమెతో మీకేదైనా పనివుంటే చెప్పండి. నేను వెళ్లినప్పుడు చెప్తాను. లేదా అర్జంటయితే ఈ రాత్రికి టెలిఫోన్ చేసి చెబ్తాను" అన్నాడు.

"మా ఇంటి పక్క ఇంట్లో కంట్రాక్టరు కోటీశ్వర్రావుగారి కొడుకు అద్దెకుంటున్నాడు. అతనీ ఊరి కాలేజీలో చదువుకుంటున్నాడు. అతగాడి బాగోగులు మేం చూస్తూ వుంటాం. ఇందాకా ఆయన వాళ్ళ కొడుకుతో వుండగా, ఆయన తల్లిగారికి ప్రాణం మీదకు వచ్చిందని కబురంది, హడావుడిగా బయలుదేరి వెళ్ళిపోయారు. వెళ్ళబోయే ముందు నా దగ్గర కొచ్చి వివరాలు చెప్పి 'ఈ బ్రీఫ్‌కేస్‌లో చాలా అవసరమైన కాయితాలున్నాయి. అర్జంటుగా రాఘవరావుగారింట్లో శ్రమ అనుకోకుండా ఇవ్వండి. నేను మరో రెండు రోజుల్లో వీలుచూసుకుని దర్శనం చేసుకుంటానని చెప్పండి' అని బ్రీఫ్‌కేసు నా కిచ్చారు. బ్రీఫ్‌కేసు నిచ్చినట్టూ వుంటుంది, మీ శ్రీమతిగారితో పరిచయం చేసుకున్నట్లూ వుంటుందని వెంటనే బయలుదేరి వచ్చాను" అని పార్వతి వంగుని, పక్కన పెట్టిన బ్రీఫ్‌కేసుని ముందున్న సెంటర్ టేబుల్ మీద పెట్టింది.

కావాలని జార్చిన పైటని సర్దుకోకుండా, ఆ సంగతి గమనించనట్లే కూర్చున్న పార్వతిని నాలుగైదు దొంగచూపులు చూసిన రాఘవరావుకి చిన్నగా ఓ స్పందన కలిగింది.

"సరేలెండి. మరోమారు వచ్చి మీ శ్రీమతిగారి పరిచయం చేసుకుంటాను" అని లేవబోయిన పార్వతిని వారిస్తూ, "ఎండలో వచ్చారు. కాస్త కూల్‌డ్రింక్ ఏదైనా కలుపుతాను, తీసుకుని వెళ్ళండి" అన్నాడు రాఘవరావు.

"వద్దులెండి మరోసారెప్పుడైనా వస్తాను" అని చివాల్న లేచిన పార్వతి, పూర్తిగా జారిన పైటకొంగు కాళ్ళలో పడి తూలి రాఘవరావు ఒడిలో పడింది.

రాఘవరావు మీద పడ్డ పార్వతి లేవడానికి ప్రయత్నించనూలేదు, పార్వతిని పొదివి పట్టుకున్న

రాఘవరావు చేతులు విడనూ లేదు.

అయాచితంగా లభించిన పరస్త్రీ పొందులోని సుఖాన్ని అనుభవించిన రాఘవరావు మనసు సంతోషంతో పరవళ్ళు తొక్కింది. డన్‌లప్‌బెడ్ మీద అలసి పడుకున్న పార్వతి శరీరాన్ని పక్కనే కూర్చుని నిమురుతూ, "ఇంతటి మధురానుభూతి నా జీవితంలో ఇంతవరకూ పొందలేదు!" అన్నాడు.

"పొరుగింటి పుల్లకూర రుచి' అని ఊరికే అనరు!" అంది పార్వతి, రాఘవరావుని ఓరకంట చూస్తూ.

"ఆ నిజం మనిద్దరికీ వర్తిస్తుందేమో?" అన్నాడు రాఘవరావు కొంటెగా.

"అవునని ఒప్పుకోకపోతే అది అబద్ధం చెప్పినట్టవుతుంది! ఇంక నేను వెళ్ళాలి. మీ కాయితాలన్నీ ఉన్నాయో లేవో చూసుకోండి" అని పార్వతి రాఘవరావుని మంచం మీద నుంచి త్రోసింది.

అంతవరకూ దాని మాటే మరచిన రాఘవరావు హాల్లోకి వెళ్ళి బ్రీఫ్‌కేసు తెరిచి చూశాడు. లోపల వరసగా పేర్చిన నోట్ల కట్టల్ని చూసి అతని కళ్ళు విప్పారాయి. గబగబా కళ్ళతోటే లెక్కపెట్టాడు. పదిహేను. అంటే అతనన్నట్టుగా 'ఒకటీ అయిదిచ్చాడు పర్వాలేదు' అనుకుంటూ బ్రీఫ్‌కేసు మూసి, పడగ్గదిలోకి తీసుకొచ్చి, మంచం కింద పెట్టాడు.

పార్వతి లేచి బట్టలు కట్టుకుని, గాడ్రెజ్ అలమారకున్న అద్దం ముందు నిల్చుని జుట్టు సవరించుకుంది. ఊడిపడ్డ బొట్టుని అంటించుకుంది.

"మెడ మీద గాట్లు పెట్టేశారు. వీటిని ఆయన కంటపడకుండా చూసుకోవాలి ఖర్మ!" అంది పార్వతి.

"బుగ్గల మీదా పెదవుల మీదా పెట్టకుండా ఎందుకడ్డుకున్నారో ఇప్పుడర్థమవుతోంది. అవునూ..." రాఘవరావు ఏదో అనబోయి ఆగాడు.

"మీ అనుమానం తెలుస్తోనేవుంది. జరిగింది కేవలం యాదృచ్ఛికం. నా భర్త మీది కసి నన్నలా చేయించింది. మీ మీద చీరకొంగు అడ్డుపడి పడ్డ క్షణంలో లేవకుండా చేసింది నాకు ఆయన మీద నిరంతమూ రగుల్తున్న కోపమే. నేను చేస్తున్నదేమిటో నాకే తెలియలేదు" అంది పార్వతి గంభీరంగా.

"అంటే....?"

"నా తల్లిదండ్రులూ, సోదరులూ నోట్లోకి రెండు వేళ్ళు కూడా వెళ్ళని జీవితాలు గడుపుతూ, నిరంతరమైన ఈయన కోర్కెల్ని తీర్చలేక నానా యాతనా పడ్తున్నారు. పెళ్ళయి రెండేళ్ళయినా, నా పుట్టింటి వారి నుంచి ఇంకా ఇంకా ఏవో కావాలని నన్ను మానసికంగా చిత్రహింస పెడ్తున్నారు. తప్పే చేశానో, ఒప్పే చేశానో తెలియదుకానీ, ఈ రోజు ఓ గంట సేపు మీ పొందులో స్వర్గం చూశాను. థాంక్స్ వస్తాను" అని కదలబోయింది పార్వతి.

రఘవరావు పార్వతి భుజాలు పట్టుకుని ఆపాడు. బీరువా తెరచి బట్టల కింద వున్న నోట్ల

కట్టని పార్వతి చేతిలో పెడ్తూ, "పది వేలు! మీ వాళ్ళకి సహాయం చెయ్యండి. అప్పుడప్పుడూ వీలైనప్పుడల్లా మనమిలా..." అని ఆగిపోయాడు.

"కలుసుకుంటూ వుంటే థ్రిల్‌గా వుంటుందంటారు! క్షణికావేశంలో దారి తప్పినా, మీకు నీతివాక్యాలు చెప్పి తప్పించుకోలేను. అంధకారమైన జీవితంలో ఓ వెలుగు చూపించారు. అయితే జాగ్రత్త అవసరం. మీరు తాగుతారో లేదో నాకు తెలియదుకానీ తాగినప్పుడూ గొప్పలు చెప్పుకునేప్పుడూ మాట జారితే, నేను రోడ్డు మీద పడ్తాను" పార్వతి నోట్ల కట్టని జాకెట్ లోపల పెట్టింది. కొంగు నిండుగా కప్పుకుని రాఘవరావు ఇల్లు వదిలింది.

పార్వతి వెళ్ళిన తర్వాత రాఘవరావు ఆలోచనలో పడ్డాడు. నిజానికి శేషగిరికీ, తనకీ నైతికంగా ఏమీ తేడా లేదు. పార్వతి అన్న మాటలు నిజంగా తమలాంటి వాళ్ళందరికీ కొరడా దెబ్బలు. ఉదయం రాజేశ్వరి కూడా నెత్తీనోరు బాదుకుంది.

ఇంకా నయం రాజేశ్వరి పుట్టింటివాళ్ళు ఉన్నవాళ్లు కాబట్టి సరిపోయింది. లేకపోతే పార్వతిలాగే కసితో ఏదైనా చెయ్యొచ్చు!

రాఘవరావు గుండె ఝల్లుమంది. రాజేశ్వరి దృష్టిలో తను దిగజారకూడదు. రాజేశ్వరి పార్వతిలా పెడదారి పట్టకూడదు.

వెంటనే తను ముక్తేశ్వరం వెళ్ళి, రాజేశ్వరితో డబ్బు మాట మరచిపొమ్మని, వాళ్లు బలవంతం చేసినా తీసుకోవద్దని చెప్పాలన్న నిశ్చయానికి వచ్చేశాడు.

ఆఫీసుకి ఫోన్ చేసి, జీప్ డ్రైవర్ కనక తిరిగివచ్చి వుంటే జీపునీ, లేకపోతే ఓ టాక్సీని తీసుకుని వెంటనే రావల్సిందిగా బాబూరావుకి చెప్పి, ఓ దీర్ఘ నిశ్వాసం వదిలాడు.

రాజేశ్వరి విషయంలో జాగ్రత్తపడ్డ రాఘవరావు మనసు పార్వతిని మట్టుకు వదులుకోడానికి ఇష్టపడలేదు.

అయితే అప్పటికే రాజేశ్వరి తనకొచ్చే లంచంలో కొంత భాగం చేజిక్కించుకుని మరోరకం పెడదారి తొక్కిందని కానీ, తనకి అయాచితంగా లభించిన పరస్త్రీ సుఖం కూడా రాజేశ్వరి మాటల వల్లనే లభించిందని కానీ, అదనంగా రావలసిన మరో యాభై వేలు కూడా రాజేశ్వరి ధర్మమా అంటూ నష్టపోయిన సంగతి కానీ, రాఘవరావుకి తెలియదు.

• • •

వెంకటస్వామి పార్కులో వినోద్‌కుమార్‌కి జరిగిన పరాభవం గురించీ, ఆ తర్వాత యాక్సిడెంట్ చేసి జనాల తన్నులు తిన్న సంగతీ రామకోటికి చెప్పాడు.

అంతలోనే టెలిఫోన్ మోగింది.

రామకోటి రిసీవరందుకుని, "ఆఁ.... నేనే రామకోటిని చెప్పండి" అన్నాడు.

"నేను సార్, వీనస్ ప్రెస్ నుంచి కాంతాన్ని. వినోద్‌కుమార్ బండారం బయటపెట్టాం. మీ రుణం తీర్చుకోలేం" అంది కాంతం.

"మీరు నా పేరు కానీ, వెంకటస్వామి పేరు కానీ ఎత్తలేదుకదా?" అడిగాడు.

"మీరు ముందే చెప్పారుగా. పార్వతీపురం కానిస్టేబుల్ మాట మట్టుకు తీసుకు రావల్సి వచ్చింది. సార్! మీ ఇంటికొచ్చి నేనూ, మా అక్కా కృతజ్ఞతలు చెప్పుకోవాలనుకుంటున్నాం. సాయంత్రం ఇంట్లో వుంటారా?"

"మీరా పని చెయ్యవద్దు. మా ఇంట్లో ఆడవాళ్ళకీ సంగతి తెలిస్తే, వార్త కొద్దిగా పాకి, నా జోక్యం, వెంకటస్వామి జోక్యం తెలిసిపోతుంది. ప్రస్తుతానికి వినోద్‌కుమార్‌కి మా జోక్యం సంగతి తెలియకూడదు. అన్నట్టు మీకు తెలుసునో తెలియదో, పార్కు నుంచి బయటకు వచ్చిన వినోద్‌కుమార్ యాక్సిడెంట్ చేసి తన్నులు తిన్నాడు"

"ఆ సంఘటన మేం దూరంగా వుండి చూశాం సార్" అంది కాంతం.

"ఎందుకైనా మంచిది. మీరు ఓ వారం రోజులు ఊరు వదిలి ఏ బంధువులింటికైనా వెళ్ళండి. వినోద్‌కుమార్ ఏమీ చెయ్యకపోవచ్చు కానీ పరాభవంతో వున్నాడు కాబట్టి, కాస్త మన జాగ్రత్తలో మనం వుండడం నయం. మీకేదైనా సహాయం కావలిస్తే నాకు ఫోన్ చెయ్యండి" అని ఫోన్ పెట్టేశాడు.

"వెంకటస్వామీ! కాంతానికి చెప్పినది విన్నావుగా, ఎక్కడా మన ప్రమేయం బయటపడ కూడదు" అన్నాడు.

"ఆ మాత్రం నాకు తెలియదండయ్యా? ఈ దెబ్బతో వినోద్‌కుమార్ పూర్తిగా దారి కొస్తాడు. చూస్తూ వుండండి" అన్నాడు వెంకటస్వామి.

రామకోటి వినోద్‌కుమార్ టైపు చేసిన డ్రాఫ్టుని తీసుకుని ప్రిన్సిపాల్ గదిలో అడుగుపెట్టాడు. శేషగిరి ఉదంతం, వినోద్‌కుమార్ యాక్సిడెంటు సంగతీ టూకీగా చెప్పాడు కానీ, పూర్తి వివరాలు చెప్పలేదు.

పరబ్రహ్మం డ్రాఫ్టుని చూసి అక్కడక్కడా చిన్న మార్పులు చేశాడు.

"సరే, దీన్ని ఫైనల్‌గా టైపు చేయించు. దెబ్బలు తిన్న వినోద్‌కుమార్ మళ్ళీ ఈరోజు ఆఫీసుకు రాకపోవచ్చు. ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌కి పంపించు. లేదా బయట చేయించు" అన్నాడు.

అంతలో సాంబశివం, "మే ఐ కమిన్ సార్" అంటూ ప్రిన్సిపాల్ గదిలో అడుగు పెట్టాడు. అతని కళ్ళలోని వెలుగుని రామకోటీ, పరబ్రహ్మం చూడగలిగారు.

"ఏమిటి సంగతి?" అన్నాడు రామకోటి నవ్వుతూ.

"ముందు మీరు ఎర్రదీపం వెలిగించండి ప్రిన్సిపాల్‌గారూ! నేను మీరిచ్చిన చెక్కు మార్చి ఇంటికి వెళ్ళేసరికి కథ అనుకోని మలుపు తిరిగింది. మా చెల్లి ఇంట్లో ఎదిరించి ససేమిరా చదువు పూర్తయితేనే కానీ పెళ్ళి వద్దని మొరాయించడంతో, మా నాన్నగారు మనసు మార్చుకున్నారు సార్! ఇదిగో మీ డబ్బు. కావాలంటే రేపు మీ అకౌంట్‌లో జమచేయించేస్తాను" అన్నాడు సాంబశివం.

అంతరాంతరాల్లో మథనపడ్తున్న పరబ్రహ్మానికి నిజం చెప్పడానికి, సాంబశివం మాటల్లో ఓ చిన్న ఆసరా దొరికింది.

"మళ్ళీ బ్యాంక్‌లో వెయ్యవలసిన అవసరం లేదు. నా కూతురికి గర్భస్రావం చేయించడానికి పనికివస్తుంది" అని నిర్లిప్తంగా డబ్బు తీసి బ్రీఫ్‌కేసులో పెట్టాడు.

రామకోటీ, సాంబశివం అవాక్కయిపోయారు.

పరబ్రహ్మం మనసు విప్పి మాట్లాడాడు.

"ఈ రోజు నా కూతురు నన్నో నేరం చేయకుండా కాపాడింది. నేను శేషగిరి మీద డిసిప్లీనరీ యాక్షన్ తీసుకున్న ఫలితంగా అతను ప్రతీకారంతో, కొన్ని రోజుల క్రితం నా కూతుర్ని కెమిస్ట్రీ లేబొరేటరీస్‌లో బలాత్కారం చేశాడు. ఫలితంగా గర్భం దాల్చింది. అయితే ఈ సంగతి మాకీరోజు ఉదయమే తెలిసింది. నువ్వు ఉదయం ధనసహాయం అర్థించిన క్షణంలో, నాలోని వివేకం నశించి, నా కూతుర్ని నీకు కట్టబెడ్దామన్న ఆలోచన కలిగింది. అయితే రాధ నా కళ్ళు తెరిపించింది. వంచనతో తను ఎవరి జీవితంలోనూ అడుగు పెట్టడానికి సిద్ధంగా లేనంది. జీవితంతో పోరాడగల శక్తి తనకుందనీ, అయితే తనలో ఇప్పుడిప్పుడే పెరుగుతున్న ఆ పాపిష్ఠి జీవాన్ని దిగజార్చడం కోసం బొంబాయి పంపమని అడిగింది. నాలో కలిగిన ఆ నీచభావానికి ఎంతగానో చింతిస్తున్నాను. నన్ను క్షమించు సాంబశివం!"

పరబ్రహ్మం కళ్ళమ్మట ధారాపాతంగా కారుతున్న నీళ్ళు వాళ్ళిద్దర్నీ కదిలించాయి.

రామకోటి సాంబశివం వైపు చూస్తూ, "రాధకి మీరంటే ఇష్టంలేదని ఓ చిన్నమాట చెప్పి ఊరుకునే అవకాశం వున్నా, కన్నతండ్రిగా ఆలోచించిన ఓ ఆలోచనని ఎంతో గుండె ధైర్యంతో మీకు చెప్పి, క్షమార్పణ కోరుకుంటున్నారు. ఇది ఎవరూ చేయలేని పని. సాంబశివంగారూ ఈ రహస్యాన్ని దాచి ఆయన గౌరవాన్ని కాపాడవలసిన బాధ్యత మనిద్దరిమీదా వుంది" అన్నాడు.

సాంబశివం ఓ క్షణం మౌనంగా వుండి, ఆ తర్వాత నెమ్మదిగా అన్నాడు – "సార్! ఈ మాత్రం దానికి బొంబాయిదాకా అనవసరం. రాజమండ్రిలో నా చిన్ననాటి స్నేహితుడూ, అతని భార్యా ఇద్దరూ డాక్టర్లు. మీరు సరేనంటే రాధని ఈ సాయంత్రమే రాజమండ్రి తీసుకువెళ్ళి దగ్గరుండి ఏర్పాట్లు చేస్తాను. ఇక రహస్యంగా వుంచడం మాటంటారూ, ఈ రహస్యాన్నే కాదు, రాధని కూడా నా జీవితంలో ఇముడ్చుకోవడానికి నేనిప్పుడూ సిద్ధమే. కావల్సిందల్లా మీరాధ అంగీకారం!"

పరబ్రహ్మం నమ్మలేనట్టుగా రామకోటి వైపు చూశాడు. రామకోటి తల ఊపాడు.

పరబ్రహ్మం కుర్చీలోంచి లేచివచ్చి, సాంబశివాన్ని కౌగలించుకుని, "నీ రుణాన్ని ఎన్ని జన్మలకైనా తీర్చుకోలేను. నువ్వు బస్‌స్టాండ్ దగ్గర మరోగంటలోగా వుండు. నేను మా తల్లిదండ్రులకి ఏదో వంక చెప్పి, రాధని తీసుకువస్తాను" అన్నాడు.

పరబ్రహ్మం ఆనందబాష్పాలు సాంబశివం భుజాల్ని తడిపాయి.

❁ ❁ ❁

ఉదయం నుంచీ జరిగిన సంగతుల్ని నెమరువేసుకున్న రామకోటికి శేషగిరి మీద విపరీతమైన ఆగ్రహం పుట్టుకొచ్చింది. పరబ్రహ్మంగారికి ఎంతటి మనోవ్యథ కలిగించాడు తన దురాగతం

వల్ల. వినోద్‌కుమార్‌కి జరిగినట్టుగానే, అతనికీ ఏదో పరాభవం జరిగితీరాలి. వడ్డీ వ్యాపారంలో కాలేజీ కుర్రవాడి నుంచి వాచీ లాగాడన్న విషయం అపప్రథే అయినా, అదేమంత పెద్ద శాస్తి కాదు. అయితే ఎప్పుడో అప్పుడు పాపం పండకపోదు. సరైన అవకాశం చూసి దెబ్బతీయాలి.

ఏమైతేనేం సాంబశివం చాలా ఔదార్యంగా, ఉన్నతంగా పరబ్రహ్మాన్ని ఆదుకున్నాడు. అతన్ని మనసులో మరీ మరీ మెచ్చుకోకుండా వుండలేకపోయాడు. అందరికీ చెప్పి అతని కీర్తిపతాకాన్ని ఎగరవేసే అవకాశం ఈ విషయంలో లేదు. ఆలోచనలకీ, ఆ రోజు పనికీ స్వస్తి చెప్పి ఇల్లు చేరాడు.

"పొద్దుననగా తిండి తినకుండా వెళ్ళావు. మధ్యాహ్నం కూడా ఇంటికి రాలేదు" అంది నడవగదిలో కూర్చున తల్లి మాణిక్యాంబ.

కాళ్ళూ, చేతులూ, ముఖమూ కడుక్కొని, దండెంమీదనున్న తువ్వాలు తీసుకుని తుడుచుకుంటూ డైనింగ్ టేబుల్ వద్ద కూర్చుని, "అమ్మా కాస్త కాఫీ ఇవ్వు" అన్నాడు.

"ఉదయం ఆజ్ఞలు జారీచేసి వెళ్ళావుగా, మీ ఆవిణ్ణే కలిపి ఇవ్వమను! అయినా మీ ఆవిడ మొదటి వంట బల్ల మీద సిద్ధంగా వుంది, కాస్త ఎంగిలిపడు. తర్వాత కాఫీ కలపమను" అంది నవ్వుతూ.

నీలవేణి గదిలోంచి బయటకు వచ్చింది. ఉడుకుమోతుతనంతో ఏడ్చి ఏడ్చి కళ్లు పత్తికాయల్లా తయారయ్యాయి. కంచం పెట్టి నీలవేణి వడ్డించింది. రామకోటి భార్య ముఖంలోకి చూస్తూ మొదటి ముద్ద కలిపాడు.

"తారకం! నువ్వూ మీ ఆవిడా బయటకు రండి" అంది మాణిక్యాంబ గట్టిగా.

వాళ్లిద్దరూ వచ్చి, రామకోటికి ఎదురుగా కూర్చున్నారు.

మాణిక్యాంబ కాస్త గొంతు సవరించుకుని, "మీ అన్నదమ్ములిద్దరూ విడి కాపురాలు పెట్టండి. మనసులు విరిగి కుటుంబాలు ముక్కలయే బదులు, కుటుంబాల్ని విడదీసుకుని, మనసులు కలిసివుండడం అందరికీ మంచిది" అంది.

"ఏమిటమ్మా నువ్వంటున్నది? నీలవేణి మళ్ళీ ఏమైనా గొడవ లేవదీసిందా?" అన్నాడు ఆదుర్దాగా రామకోటి.

"లేదు. కానీ ఈరోజు మీ ఇద్దరి మధ్యా జరిగిన ఘర్షణ పాతకాలపు నా ఆలోచనల్ని పక్కకి నెట్టి, వాస్తవాన్ని చూపించింది. తల్లిదండ్రుల మనసుని కష్టపెట్టడమెందుకని సోదరులు ఆలోచించినా, వేర్వేరు కుటుంబాల్లోంచి వచ్చిన కోడళ్లు అదే దృక్పథంతోనే ఆలోచించాలను కోవడం అసమంజసం. ఎందుకంటే స్త్రీ స్వార్థం నా మొగుడూ, నా పిల్లలూ అనే భావనతో మొదలవుతుంది. ఇది దోషం పట్టే విషయం కాదు. సమష్టి కుటుంబంలో వుంటే కొన్ని తెరలు స్త్రీ పురుషుల అవగాహనకి అడ్డమొస్తాయి. అందుకని మీరు నిశ్చింతగా వేరు కాపురాలు పెట్టుకోండి. బాధ్యతలు తెలియడానికి అది చాలా మంచిమార్గం కూడా. ఇంతకంటే నేను వేరే ఏమీ చెప్పదలచుకోలేదు" అంది.

"అత్తయ్య ఉదయం నుంచీ ఇదే మాటనంటున్నారు. ఆవిడ చెప్పినట్టుగానే చెయ్యడం అందరికీ మంచిది" అంది రామకోటి వదిన.

రామకోటి కొద్దిగా తెల్లబోయాడు.

"నా మూలాన ఇలా జరగడం...."

నీలవేణి మాటల్ని మధ్యలోనే ఆపుచేశాడు.

"ఎవరి మూలానా ఏమీ జరగలేదు. నువ్వు చేసిందల్లా పిల్లి మెళ్ళో గంట కట్టడమే. అమ్మ చెప్పిన మాటల్లో కుటుంబాలు ఎందుకు వేరుపడాలో అన్న సత్యముంది. కానీ నువ్వు చేసిన పొరపాటల్లా నువ్వు తెచ్చిన కట్నాన్ని గుర్తుచేస్తూ, నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడమే.

"స్త్రీ పురుషుల వైవాహిక జీవితంలో - ఆర్థిక, విద్యా తారతమ్యాలూ - వంశ, కుటుంబ సాంప్రదాయాలూ - పుట్టి పెరిగిన వాతావరణమూ - అన్నిటినీ మించి వ్యక్తిగతమైన మనస్తత్వాలూ, స్వప్నాలూ అనేకమైన ఒడుదుడుకుల్ని కలిగిస్తాయి. వీటికి తోడు లేనిపోని వరకట్న సమస్యల్ని సృష్టించుకుని బాధపడడం అవివేకం.

"అన్నయ్యా! వదినకి వాళ్ళ నాన్నగారిచ్చిన మూడెకరాల భూమి సంగతి నువ్వేం చేస్తావో నాకు తెలియదుకానీ, నేను మట్టుకు మావగారిచ్చిన కట్నంతో చేయించిన నగలకి, నేను చేయించిన రెండుజతల బంగారపు గాజుల్నీ వడ్డీగా కలిపి, ఈ సాయంత్రమే బయలుదేరి వారికిచ్చేసి నా వ్యక్తిత్వాన్ని నిలుపుకోదల్చాను. కొత్త ఇంట్లో పాలు కాచే రోజుకి వాళ్ళని రమ్మని ఆహ్వానం ఇచ్చివస్తాను" అన్నాడు.

"ఒరేయ్ నీకా బెంగ అఖ్ఖర్లేదు. వాళ్ల అబ్బాయిని పై చదువులకి అమెరికా పంపాలనే ప్రయత్నంలో ఇల్లు తాకట్టు పెట్టాలనుకున్నాడు. ఆ సంగతి తెలిసి ఆయన్ని వారించి ఆయనకి తొంభై వేలు పంపించి ఆర్నెల్లకి పైగా అయింది. అమ్మకీ సంగతి తెలుసు. నాకు చాలా మనశ్శాంతిగా వుందనుకో!" అన్నాడు తారకం.

నీలవేణికి కాళ్ళ కింద భూమి కదుల్తోందనిపించింది. సిగ్గుతో ముఖం కుంచించుకు పోయింది. మౌనంగా మెళ్ళో వున్న నగల్నీ, చేతుల్ని వున్న గాజుల్నీ తీసి బల్లమీద వుంచి, వెళ్లి అత్తగారి కాళ్ళ దగ్గర కూలబడి, "నా అవివేకానికి చింతిస్తూ సిగ్గుతో ఛస్తున్నాను. నన్ను మన్నించండి" అని భోరున ఏడవసాగింది.

రామకోటి సంతృప్తిగా నవ్వితే, వదిన అతనికేసి కోపంగా చూసింది, నీలవేణి నెందుకు ఏడ్పించావన్నట్లుగా.

"వెర్రిదానా, ఏడవకు. ఇందులో నీ తప్పేమీ లేదు. వేరుగా వుండి ఒకరినొకరు అర్థం చేసుకోడానికి ప్రయత్నించి, బాధ్యతలు తెలుసుకోండి. నీ కడుపునో కాయ పడింతర్వాత, నువ్వు వద్దన్నా వచ్చి నీ దగ్గరుంటాను!" అంది మాణిక్యాంబ నీలవేణి తల నిమురుతూ.

❁ ❁ ❁

రోడ్డు మొగలో చెట్టు కింద కారునాపి, పక్కనే కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు

కోటీశ్వర్రావు. అక్కడే వున్న సోడా కొట్టులో అప్పటికే రెండుసార్లు సోడా తాగాడు. రాఘవరావు బుట్టలో పడకపోతే తనకు చాలా నష్టం జరిగిపోతుంది.

ఒక్క డబ్బుతోనే మనుషుల్ని కొనడానికి అలవాటుపడ్డ అతనికి రాజేశ్వరి మాటలూ, కొడుకు గదిలో పట్టుబడ్డ పార్వతి కథనం మరో మార్గాన్ని సూచించాయి. రెండు ఆయుధాల్నీ ఒకేసారి ప్రయత్నించాడు. ఫలితం ఏమవుతుందో?

రాఘవరావు ఇంటి గేటు తీసుకునివస్తున్న పార్వతిని దూరం నుంచే చూసి, చేతిలో బ్రీఫ్‌కేసు లేకపోవడం గమనించి ఒక దీర్ఘనిశ్వాసం విడిచాడు. కారెక్కి కొడుకు గది జేరాడు.

రిక్షా దిగి డబ్బులిచ్చి వాణ్ణి పంపిన పార్వతికి, పక్కింటి డాబా వరండాలో పచార్లు కొడ్తున్న కోటీశ్వర్రావు కనిపించాడు. గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్ళి తలుపు తాళం తీసి, లోపల ప్రవేశించి, జాకెట్లో వున్న నోట్ల కట్టని వంటింటి గూట్లో వున్న విఘ్నేశ్వరుడి వెనుక దాచి ముందు గదిలోకి వచ్చింది. సరిగా అప్పుడే కోటీశ్వర్రావు లోపల ప్రవేశించాడు.

"మీ పని సక్రమంగా జరిగింది" అంది ముక్తసరిగా.

"డబ్బుని గురించి ఏమైనా మాట్లాడాడా?" కోటీశ్వర్రావు ఆదుర్దాగా అడిగాడు.

"బ్రీఫ్‌కేస్ తెరచి కళ్ళతోటే లెక్క పెట్టుకుని, దాన్ని మంచం కింద పెట్టాడు. అతని కళ్ళు మరోసారి మెరిశాయి".

"అంటే...?"

"ఆ వివరాలడగవద్దు. ఈ ఉదయం పతనం చెందిన నాకు, పరాయి పురుషుల ముందు రెండోసారి బట్టలు జార్చడం కొంచెం సులువే అయినా, సిగ్గూ, లజ్జా చంపుకొని ఆ పని చెయ్యడం, మనస్సుని కష్టపెడ్తోంది!" అంది పార్వతి తల వంచుకుని.

రాజేశ్వరి తనని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్‌చేసి నలభై వేలు రాబట్టుకుంది. పార్వతి శరీరాన్నర్పించి తనకు ఏభై వేలు ఆదా చేసింది.

"ఒకరి కష్టాన్ని వుంచుకునే మనిషిని కాను. ఈ అయిదు వేలూ వుంచు" అన్నాడు కోటీశ్వర్రావు పక్క జేబులోంచి వంద ఏభై రూపాయల కట్టని తీస్తూ.

పార్వతి దాన్ని తీసుకోలేదు.

"ఇంట్లో ఇంతలేసి డబ్బుని దాచడం నాకు చాలా కష్టం. నా తల్లిదండ్రుల కుటుంబ పరిస్థితి ఉదయమే మీకు చెప్పాను. మీరు ఈ డబ్బునీ, ముందు ముందుగా మీ పన్లు చేసినప్పుడల్లా మీరిచ్చే ప్రతిఫలంలో నేను చెప్పినంతా, కాకినాడలో మా తల్లిదండ్రుల కందజేస్తూ వుండండి. నాతమ్ముళ్ళ చదువు భారం మీ మీద వేస్తున్నాను"

"ఎవరో అపరిచిత వ్యక్తి ద్వారా డబ్బందుకోవడానికి మీవాళ్ళు ఇష్టపడ్తారా?"

"ఏదో ట్రస్టనో, ఛారిటీ అనో చెప్పి, పేరుకేవో ఇంటర్వ్యూలు చేసి వాళ్ళిద్దరి చదువులూ అయ్యేటట్టు చూడండి. తర్వాత సంగతి తర్వాత చూసుకోవచ్చు. అన్నట్టు మరోసంగతి. మీరు నన్ను రాఘవరావింటికి డబ్బిచ్చి పంపడానికి ఇందాక వచ్చినప్పుడు, మీకు మీ కుర్రాడి వాచీ

ఈయన గారి చేతికొచ్చిందని కాలేజీ అంతా తెలిసిపోయిందని చెప్పాను కదా. ఈసాయంత్రం ఇంటికొచ్చిన తర్వాత ఆయనేం గొడవ చేస్తాడో, నేనేం చేస్తానో నాకు తెలియదు! ఎందుకైనా మంచిది, మీరు మీ కుర్రాడి గదిలో వుండండి"

పార్వతి తన మీద పెంచుకున్న నమ్మకానికి సంతోషిస్తూ, నోట్ల కట్టని తిరిగి జేబులో పెట్టుకుంటూ, బయటకు దారితీసి కొడుకు గదికి వెళ్లాడు.

రాఘవరావుకీ తనకీ మధ్య జరిగిన లోపాయికారీ లావాదేవీల్ని గురించి కోటీశ్వర్రావుకి చెప్పనవసరం లేదనుకుంటూ, పార్వతి వంటింట్లోకి వెళ్ళి, దేముడి పటం వెనుక దాచిన డబ్బుని తీసి ఓ పాత ఖద్దరు షోల్డర్ బాగ్‌లో పెట్టింది.

అదే సంచిలో మరో రెండు పాత కూరల సంచుల్ని కుక్కి ఖద్దరు సంచీని వంటింటి తలుపు వెనక మేకుకి తగిలించింది. ఉదయం ట్రంకులో దాచిన అయిదు వందల రూపాయల నోటుని తీసి, అలమార్లో పేపరు కింద పెట్టింది.

శుభ్రంగా స్నానం చేసి, బట్టలు మార్చుకుని, పక్కగది వరండాలో చాప వేసుకుని, గోడ కానుకుని కూర్చుంది. అలా ఎంతసేపు కూర్చుందో తనకే తెలియదు.

శేషగిరి లోపలికి విసురుగా వచ్చి, వరండాలో కూర్చున పార్వతిని చూసి, "లోపలికి రా" అని గట్టిగా అరిచాడు.

"ఆ అరుపులెందుకూ?" అంటూ పార్వతి గదిలోకి వచ్చింది.

"ఈ వాచీ నీకెలా వచ్చిందో చెప్పు" అని గద్దిస్తూ అన్నాడు.

"ఉదయం చెప్పానుకదా, ఎలా వచ్చిందీను!" అంది పార్వతి నిదానంగా.

"కాదు. అబద్ధం చెప్పావు. ఈ వాచీ పక్కింటి డాబా గదిలో అద్దెకుంటున్న కాలేజీ స్టూడెంట్ రాజారావుదని కాలేజీలో అందరికీ తెలిసి అపహాస్యం పాలయ్యాను. నిజం చెప్పు. అతని గదిలోంచి కానీ దొంగతనం చేశావా?"

"మరొకరైతే వాచీని మొహాన్న గిరవాటేసి, ప్రశ్నలడిగేవారు. మీరింకా వాచీని చేతి కుంచుకునే అడుగుతున్నారు కాబట్టి. మీకు వాచీ దొంగ వస్తువైనా పర్వాలేదు. కావల్సిందల్లా నిజం, అంతేగా?!" పార్వతి హేళనగా అంది.

"అధిక ప్రసంగం ఆపి ఎలా వచ్చిందో నిజం చెప్పు" అని కోపంగా అరిచాడు.

"ఈరోజు ఉదయం నా తమ్ముడు వాచీని తీసుకొచ్చాడని మధ్యాహ్నం మీకు చెప్పినప్పుడు, వాళ్లు దాన్ని ఎలా కొని పంపించగలిగారన్న మాటైనా ఆలోచించకుండా, అందరికీ చూపించి గొప్పలు చూపించుకోడానికి కాలేజీకి పరుగెత్తారు. ఇప్పుడు వాచీ మరొకరిదని తెలిసి, నిజం కోసం నిర్బంధం చేస్తున్నారు. నిజాన్ని వినగల శక్తి వుంటే వినండి. దాన్ని నేను దొంగతనం చేసి కాదు, లం.... చేసి సంపాదించాను!"

శేషగిరి చెయ్యి అప్రయత్నంగా పైకి లేచింది. రుద్రకాళిలా వున్న పార్వతి ముఖం చూసి, ఎత్తిన చెయ్యిని నెమ్మదిగా దింపాడు.

"వాచీ కోసం రెండు రోజులు కడుపు మాడ్చారు. ఆకలి భరించలేక, ఆ కుర్రాడి గదిలో అతని పనిమనిషి కారియర్ పెట్టి వెళ్లగానే, దీపం గూట్లో వున్న తాళం చెవితో తాళం తీసి లోపలికి వెళ్ళి, నా ఆకలి తీర్చుకుంటున్న సమయంలో, మార్నింగ్ క్లాసు నుంచి తిరిగి వచ్చిన అతను నన్నాక్రమించి తన ఆకలి తీర్చుకున్నాడు. చెడినదాన్నెలాగూ చెడాను కదా అని అతని చేతినున్న వాచీని అడిగాను. వెంటనే ఇచ్చిపారేశాడు!" అంది శేషగిరి ముఖంలోకి చూస్తూ.

శేషగిరి ముఖంలో రంగులు మారుతున్నాయి. నిజమో, అబద్ధమో తెలియని పరిస్థితులో పడిపోయాడు.

"నమ్మకం కుదరటల్లేదా? నన్ననుభవించినందుకు మరో అయిదు వందలు కూడా ఇచ్చాడు!" అంటూ, అలమార్లో పేపరు కింద దాచిన నోటుని పైకి తీసి, శేషగిరికి చూపిస్తూ జాకెట్టులో పెట్టుకుంది.

మతిభ్రమణం కలిగినవాడిలా వెర్రిచూపులు చూస్తూ మంచం మీద కూలబడ్డాడు.

"ఇంకా నమ్మకం కుదరటల్లేదా? నా మెడని నేను కొరుక్కోలేను. కావాలంటే నా మెడ మీది పంటిగాట్లు, వంటి మీద గోళ్ళ రక్కులూ చూసుకోండి!"

శేషగిరికి నమ్మవలసిన పరిస్థితి ఏర్పడింది. మౌనంగా వుండిపోయాడు.

పార్వతి విజృభించింది.

"కన్నతండ్రీ, తోడబుట్టిన సోదరులూ, కట్టుకున్న మొగుడూ, కన్నకొడుకూ, స్త్రీ జీవితంలో వివిధ దశల్లో, వివిధ పరిస్థితుల్లో అండగా నిల్చుంటారని లోకం అంటుంది. కానీ మొగుడు వుండీ అండలభించని స్త్రీ వయసులో కనక వుంటే, అత్యంత నిస్సహాయ పరిస్థితిలో ప్రాణాలు తీసుకునే బదులు, మరో మగాడి అండ చూసుకోడానికి వెనుదీయదు. నేనీ దారి పట్టడానికి కారణం మీరు!

"ధనాశకైనా ఓ 'హద్దు' అనేదుండాలి, స్వయంశక్తి మీద ఎంతైనా సంపాదించుకోవచ్చు. కానీ, శవాల్ని పీక్కుతింటూ సంపాదించిన డబ్బుకి విలువ లేదు.

"అందుకనే మీరన్నా, మీ వడ్డీ వ్యాపారమన్నా నా కసహ్యం. అంతకంటే శరీరాన్ని అమ్ముకుని నేను సంపాదించిన డబ్బే విలువైనది. మీరింక నన్ను పోషించకపోయినా, నా కాళ్ళ మీద నిలబడే శక్తి నా ఒంట్లో వుందని గ్రహించాను.

"ఎందుకంటే, నేను రాజారావుతో వుండగా, అతని తండ్రి కంట్రాక్టరు కోటీశ్వర్రావు గదిలో అడుగు పెట్టాడు. తన పనులు నెరవేర్చుకోడానికి సంసార స్త్రీలని ఎరగా వేయడంలో వున్న లాభాలు చెప్పి, నేనతని పనులు చేయడానికి ఒప్పించాడు. నేనూ సరేనన్నాను. రేపట్నుంచీ అప్పుడప్పుడూ ఇల్లు వదలి వెళ్ళవలసివస్తుంది. సరే, నిజం చెప్పాను కాబట్టి ఏం చేద్దామనుకుంటున్నారు?"

శేషగిరి సమాధానమిచ్చే పరిస్థితిలో లేదు.

"సరే, నే చెప్తా వినండి! ఒకటి. విడాకులిద్దామనుకుంటే, మీరు కోర్టులో కారణం చెప్పుకోవాలి.

ఏ పరిస్థితుల్లో నేను దిగజారానో కోర్టు వాళ్ళకి చెప్పి మీ బండారం బయట పెట్టి, మరో స్త్రీ మీ జీవితంలో ప్రవేశించకుండా చూస్తాను.

"రెండు. మీరు నా ప్రాణాల్ని ఏదోవిధంగా తీయడానికి ప్రయత్నించవచ్చు. ప్రాణాల సంగతి దేముడెరుగును కానీ, నా ఒంటి మీద ఈగ వాలినా కోటీశ్వర్రావు రెండోకంటివాడికి తెలియకుండా మిమ్మల్ని నరికి పోగులు పెడ్తాడు!

"మూడు. అత్తచాటు బొంకూ, భర్త చాటు రంకూ చెల్లుతుందంటారు. నేను బయటకు వెళ్లినప్పుడల్లా సంపాదించినదాంట్లో నాలుగోవంతు మీ మొహాన్న కొడ్తూ వుంటాను. మీక్కావల్సింది డబ్బే కాబట్టి మీ ఆశా తీరుతుంది, గృహిణిగా నాకో ముసుగూ దొరుకుతుంది!

నాలుగు. యివేమీ కాదు, ఈ క్షణంలో యిల్లు వదలి వెళ్ళమంటే అందుకూ సిద్ధమే. "సిగ్గూ లజ్జా విడిచినదాన్ని. బ్రతుకుతెరువు నేర్చినదాన్ని, నాకింక ఫర్వాలేదు. మీ కళ్ళెదురుగానే ఎదురింట్లో కాపురం పెడ్తాను!

"నేను వీధి మొగలో వున్న కూరల దుకాణం దగ్గరకు వెళ్ళి, నా మొదటి సంపాదనతో కూరలూ అవీ కొని, అరగంటలో తిరిగి వస్తాను. నేను తిరిగి వచ్చేసరికి తలుపులు తెరిచి కనక వుంటే, మీకు నా మూడో సూచన అంగీకారమైందని ఇంట్లో అడుగుపెడ్తాను. తలుపులు కనక వేసివుంటే, ఎక్కిన మెట్లు దిగి నా నాలుగో పథకం అమల్లో పెడ్తాను!"

పార్వతి విసురుగా వెళ్లి, వంటగది తలుపుకి వెనకగా వేలాడదీసిన ఖద్దరు సంచీని భూజానికి తగిలించుకుని, ఇంటి మెట్లు దిగి, రోడ్డు మీదకు వెళ్ళింది. ఆ సంచీలోని పది వేలూ, పార్వతికి కొండంత బలాన్ని కలిగించాయి.

శేషగిరి బుర్ర తిరుగుతోంటే, రెండు చేతుల్తో తలపట్టుకున్నాడు. తలలో తిరుగుతున్న సుడిగుండాలలో వికటాట్టహాసం చేస్తూ రాధ, రాజారావుల ముఖాలు కనిపించాయి!

శేషగిరి రాధకి చేసిన అన్యాయం పార్వతికి తెలియదు. శేషగిరికి పార్వతి విధించిన శిక్ష రాధకి తెలియదు.

❁ ❁ ❁

ప్రవాహానికెదురుగా సాయంత్రపు సముద్రపు గాలి వీస్తోంటే, గోదావరిలో అలల అలజడి ఎక్కువైంది. గట్టుకి కాస్తంత దూరం పోయిన తర్వాత తెరచాప ఎత్తబడిన పడవ ముక్తేశ్వరం రేవు వదలి, కోటిపల్లి రేవు వెడ్తోంది.

తెరచాప కొయ్యకి ఆనుకుని, కూతుర్ని గట్టిగా పట్టుకుని కూర్చుంది రాజేశ్వరి. భర్త రాఘవరావు ఉన్నట్టుండి ఉదయం దాల్చిన అవతారానికీ, మళ్లీ అంతలోనే సాయంత్రానికి పొందిన మార్పుకీ సమన్వయం కుదరక సతమతమవసాగింది.

కన్నవారి ముందు అపహాస్యం పొందకుండా కాపురం నిలబెట్టుకునే ప్రయత్నంలో, ముక్కూ మొహం తెలియని వ్యక్తి దగ్గర తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకుని, అనుచితంగా సంపాదించిన నలభై వేలనీ ఏం చెయ్యాలని ఆలోచిస్తోంది.

పడవ ముందుభాగంలో సాంబశివం భుజం మీద తలవాల్చి, చల్లగా వీచే గోదారి గాలిలో మత్తుగా కళ్లు మూసుకున్న రాధ, ముందు జీవితాన్ని గురించి ఆలోచిస్తోంది.

'పడవ నడిపేవాళ్లు గడ వేస్తారు. గడ అందకపోతే తెడ్డు వేస్తారు. గాలి తిరిగితే తెరచాప ఎత్తుతారు. అయితే గమ్యం చేరడానికి చుక్కాని ఎంతో అవసరం. ఒడుదుడుకుల జీవనప్రయాణంలో గమ్యానికి చేర్చేది వ్యక్తుల ఆత్మస్థైర్యమే' అనుకుంటూ, గాలికి చెదరిన రాధ ముంగురులు ముఖాన్ని తాకుతూవుండగా, సాంబశివం ఆమె భుజం మీద సుస్నితంగా చేయి వేశాదు.

ప్రతి నిత్యమూ తనని దాటుతున్న ప్రయాణీకుల సుఖదుఃఖాలతో ప్రమేయం లేనట్టుగా గోదావరి సముద్రం వైపు ప్రవహిస్తోంది.

'నేనింత వెలుతుర్ని ఇస్తున్నా జనాలు కావాలని అంధకారాన్ని తెచ్చుకుంటున్నారు. ఈరోజు గోదావరి లంకలో వీచిన చైతన్యవాయువులు దేశమంతటా వీస్తే ఎంత బావుండును!' అనుకుంటూ, అలసట పొందిన సూర్యుడు కొవ్వూరు గట్టు వెనక అస్తమించాదు.

❁ ❁ ❁

**ఉపసంహారం:**

"ఇదమిత్థంగా ఓ పతాక సన్నివేశమంటూ లేదు!" అన్నాడు రాజు.

"లౌక్యం ఉపయోగించిన రాజేశ్వరి, దగాపడి ధైర్యం కూడదీసుకున్న రాధ, ముందుగానే చేతులెత్తి కూర్చోకుండా ప్రయత్నం చేసిన సాంబశివం పడవలో వున్నారు. బుద్ధి చెప్పిన రామకోటికీ, కాంతానికీ ముక్తేశ్వరం రేవులో ఇదే పడవ నెక్కే అవకాశం వుంది. శేషగిరి చేత తలుపులు మూయించు. కోటీశ్వర్రావు పార్వతిని తీసుకొచ్చి ముక్తేశ్వరం గట్టు మీద వదుల్తాడు. పార్వతి కూడా ఇదే పడవలో అడుగు పెడ్తుంది, ఏర్పాట్లు జరిగేవరకూ పుట్టింట వుండడానికి.

"ఇటువంటి వ్యక్తులు తమ జీవితాల్నే కాదు, ఇతరుల జీవితాల్ని కూడా సరిదిద్దగల చైతన్యవాయువులు. రగులుకున్న నిప్పులు. వారి అవసరం సమాజానికి ఉందీ అనుకుంటే, పడవని సురక్షితంగా కోటిపల్లి రేవు చేర్చు. కాదంటావూ, పడవని నడి గోదావరిలో ముంచు. సమాజానికి మిగిలేది స్తంభించిన గాలీ, చెద పట్టిన నిప్పులూ. పతాక సన్నివేశం నీచేతిలో వుంది. పాఠకుడిగా నువ్వేం చేసుకున్నా నీ ఇష్టం రాజూ!" అన్నాను.

రాజు మాట్లాడలేదు.

**ఉ(అ)పశ్రుతులు :**

అ : గోపీకృష్ణ చాలా ఆదర్శాలు కల యువకుడు. పెళ్లిచూపులకని తల్లిదండ్రులతో సహా విజయవాడ నుంచి బయలుదేరి, హైదరాబాద్ చేరేలోపున, ఏకబిగిని నవల చదివాడు. అతనిలో మరింత ఆశయాల ఉత్తేజం కలిగింది.

ముందు పరిచయాలైన తర్వాత చుట్టూవున్న పెద్దలు ఏదో వంక పెట్టి అటూ ఇటూ జారుకున్నారు. అంతవరకూ ఎదురు కుర్చీలో కూర్చున్న చారులత లేచివచ్చి, గోపీకృష్ణ పక్కన

సోఫాలో కూర్చుని నెమ్మదిగా అడిగింది - "నేను మీకు నచ్చానా?"

"ఫోటో చూసి తొంభై తొమ్మిది వంతులు నచ్చిందని నా మనసంగీకరించిన తర్వాతే మిమ్మల్ని చూడ్డానికి వచ్చాను. ఎందుచేతనంటే చూసి నిరాకరించి మనసు నొప్పించడం నాకిష్టంలేదు"

"ఆ మిగిలిన ఒక శాతం సంశయం ఎందుకనో? కట్నం కోసమా?" చారులత కొంటెగా అంది.

"కాదు, మాటలు వచ్చునో రాదో చూడాలిగా!" అన్నాడు గోపీకృష్ణ నవ్వుతూ.

"అయితే నేనంటే ఇష్టమన్నట్టేకదా?"

"అంతేకదా మరి!"

"అయితే వినండి. మీరు ఆదర్శ భావాలు కల యువకులని విన్నాను. వాటిని ఓ పక్కకు నెట్టండి. దండిగా కట్నం అడగండి. ఘనంగా లాంఛనాలడగండి. ఎందుచేతనంటే, ఒకసారి పెళ్ళయి ఈ ఇంటి నుంచి బయట అడుగుపెడ్తే, తర్వాత నాకు నయాపైసా కూడా విదల్చడానికి నా అన్నలూ, వదినలూ అడ్డొస్తారు. మీ కోసం కాకపోయినా నా కోసం అడగండి!" అంది చారులత.

చారులత విపరీతంగా నచ్చేసిన గోపీకృష్ణ ఇరకాటంలో పడ్డాడు.

ఆ : ఎంతో ఆర్భాటంగా చేసిన వివాహపు తంతులన్నీ మధ్యాహ్నం భోజనంతో ముగిశాయి. అలిసిపోయిన పెళ్లికూతురు ప్రియంవద, మేడ మీది గదిలో ఫోంబెడ్ మీద విశ్రాంతి తీసుకుంటూ, చుట్టూ పడివున్న కానుకల్ని చూసింది.

స్నేహితురాలు రమ్యకృష్ణ 'నువ్వు చదవలసిన పుస్తకం' అంటూ బహుమతిగా ఇచ్చిన నవలని కుతూహలంతో చదివింది.

'ఇవ్వలేనివాళ్ళ సంగతి సరేకానీ, ఇవ్వగలిగినవాళ్ళిస్తే తీసుకోవడంలో తప్పేమీ లేదు. అనవసరంగా గోలచేశాడు రచయిత' అనుకుంది.

ఆ రాత్రి శోభనం గదిలో అడుగు పెట్టిన శ్యామసుందర్, ప్రియంవదని సంతోషపెట్టే ప్రయత్నంలో సఫలుడు కాలేకపోయాడు.

ప్రియంవద కళ్లు తెరచి శ్యామసుందర్ ముఖంలోకి చూసింది, లక్షన్నర సరుకూ ఇంతేనా?!' అన్నట్లుగా.

ఆ చూపుని విశ్లేషించుకుని శ్యామసుందర్ మథనపడసాగాడు.

అతనిలోని భావాల్ని గ్రహించి, 'మొదటి రాత్రి అనుభవం చాలామందికి ఇలానే ముగుస్తుంది. అందుకని కంగారుపడనవసరంలేదు' అని అనేక సలహాల శీర్షికల్లో చదివిన ప్రియంవద, 'పర్వాలేదు నేను తీసుకొచ్చిన కట్నాన్నీ, ఈయన మొదటి రాత్రి పరాక్రమాన్నీ ఆయుధాలుగా అవసరమైనప్పుడు వాడుకోవచ్చున'నుకుంటూ, చిరునవ్వు నవ్వుతూ శ్యామసుందర్ మెడ చుట్టూ చేతులు వేసింది.

ఆ చిరునవ్వు శ్యామసుందర్‌ని మరింత మానసికంగా చితక్కొట్టింది.

ఇ : నవల చదివిన వరహాలరావుకి విపరీతమైన ధైర్యమొచ్చింది. సాంబశివంలాగే తల్లిదండ్రులతో ఉన్న మాట చెప్పదలచుకున్నాడు. "కట్నం తీసుకునే పక్షంలో నేను పెళ్ళి చేసుకోను. అది మగవాడి సంస్కారానికి తీవ్రమైన ఘాతం. కట్నం తీసుకోకుండా వుండడానికి సిద్ధపడితేనే, నేను పెళ్ళిచూపులకి వచ్చేది" అన్నాడు.

"వెర్రి నాగన్నా ముందుగానే కట్నం వద్దని చాటించుకుంటే, నీ సంస్కారం మాట అటుంచి, నీలో ఏదైనా అపకరం వుందనుకుంటారు. అందుకని వద్దనకుండా వాళ్ళెంత ఇస్తే అంత నోరు మూసుకొని పుచ్చుకోండి" అంది అనుభవంతో తల పండిన వరహాలరావు నాయనమ్మ.

ఈ : నవల చదివి భారంగా నిట్టూర్చాడు నిరంజనరావు. ఒకటి - ఇలా కట్నాలిచ్చుకోలేకా, రెండు - కుటుంబాల్లోని ఆస్తిపాస్తులు కుటుంబాల్లోనే తిరగాలనీ, మేనరికాలు అవతరించాయి. ఫలితం! మూడు తరాల మేనరికంలో, అంగవైకల్యంతో పుట్టిన కూతురికి నాలుగేళ్ళు వచ్చినా నడక లేదు! మాట లేదు.

ఉ : "సరేనండి మహానుభావా! కట్నం తీసుకోకుండా నన్ను ఉద్ధరించినందుకు సంతోషం. కానీ మాటిమాటికీ, 'నిన్ను కానీ కట్నం లేకుండా చేసుకున్నాన'ని గొప్పలు చెప్పుకోవడం సంస్కారం కాదు. అంతకంటే కట్నం తీసుకోవడం మంచిది. మీరు వద్దన్నారు. మావాళ్ళు చంకలు గుద్దుకున్నారు. ఇప్పుడు చూడండి, గౌరవం లేకుండా ఏడుస్తున్నాను!" అంది అయిదేళ్లనుంచీ కాపురం చేస్తున్న విశాల, నవలలో ఎదిరించిన పార్వతిని దృష్టిలో పెట్టుకుని.

ఊ : "రాజూ!"

"ఊఁ!"

"ఏమంటావు?"

"యాంటీ క్లైమాక్స్"

"హతోస్మి!"